ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి
16
కొత్తగూడెం
బుధవారం 23 ఆగస్టు 2017




లారీలో బొగ్గు నింపుతున్న దృశ్యం



ఆంధ్రజ్యోతి నిఘా

కోల్ నాగులు!



డీఎస్పీ సమక్షంలో వివాదం సమసినట్టు ఒప్పందం కుదుర్చుకుని రాసుకున్న స్టాంప్ పత్రం

- రూ. కోట్లు కొల్లగొడుతున్న మాఫియా
- అండదండలందిస్తున్న ప్రజాప్రతినిధులు, ఖాకీలు!
- ఇల్లెందు ట్రాన్స్‌పోర్ట్‌లో అదుపులేని దందా
- భారీగా వెనకేసుకుంటున్న మధ్యవర్తులు
- లారీల యజమానులు విలవిల

11

'ఖాకీ' సహకరిస్తోంది. 'మీడియా' వంత పడుతోంది. 'ఖద్దరు' రక్షణ కల్పిస్తోంది. 'తుపాకీ' నీడనిస్తోంది. యథేచ్ఛగా దందా సాగిపోతోంది. అడిగే వారు లేరు. అడ్డుకునే వారూ లేరు. డ్రైవర్లను బెదిరించడం.. రూ.లక్షలు దోచుకోవడం.. దాచుకోవడం.. ఇదీ ఇల్లెందులో కోల్‌ట్రాన్స్‌ఫోర్ట్ పేరిట చేస్తున్న వసూళ్ల పర్వం. మధ్యవర్తులు 'కోల్' మాఫియాగా అవతరించిన తీరు విస్తుగొలుపుతుండగా.. తమ నోటి కాడి కూడు లాక్కొంటున్నారని యజమానులు గొల్లుమంటున్నారు. ఇల్లెందులో వేళ్లూనుకున్న 'కోల్'నాగులపై 'ఆంధ్రజ్యోతి' పరిశోధనాత్మక కథనం..

- ఇల్లెందు

11



లబ్ధిదారుల ఇంట్లో మూలుగుతున్న సరుకులు

పునరావాసంలో చేతివాటం!

- అధిక ధరలకు యూనిట్ల కొనుగోలు
- ప్రశ్నించిన లబ్ధిదారులపై ఆగ్రహం
- పక్కదారి పట్టిన ప్రభుత్వసాయం

వారంతా సారా తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారితో ఆ పని మాన్పించి ఆర్థికంగా భృతి కల్పించాలని ప్రభుత్వం పునరావాస పథకానికి రూపకల్పన చేసింది. ఒక్కో యూనిట్‌కు రూ.రెండు లక్షలు కేటాయించింది. అది కూడా పూర్తి ఉచితంగా.. కానీ ఎక్సైజ్ అధికారులు చేతివాటం ప్రదర్శించారు. అధిక ధరకు యూనిట్లు కొనుగోలు చేసి లబ్ధిదారులకు అన్యాయం చేశారు. భారీగా వెనకేసుకున్నారు.

- దుమ్ముగూడెం



సంసారాల్లో సెల్‌చిచ్చు!

- విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు
- బంధువులకు ఇచ్చారో అంతే సంగతులు
- మిస్సింగ్, కిడ్నాప్ కేసుల్లో నిందితులయ్యే ప్రమాదం

అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్ కుటుంబాల్లో చిచ్చుపెడుతోంది. కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తోంది. భార్యాభర్తలకు, స్నేహితులకు మధ్య గొడవలు సృష్టిస్తోంది. ఇటీవల జిల్లాలో ఇలాంటి సంఘటనలు పెరిగాయి. ఈనేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

వివరాలు సెంటర్‌స్ప్రెడ్‌లో..

- కొత్తగూడెం క్రైం

వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి



- ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలి
- సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- ఉద్యోగులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు పిలుపు
- ఈ-లెర్నింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజీవ్ గాంధీ హన్మంతు

16

ఎక్కడి ఉత్తరాలు అక్కడే!

- నిరవధిక సమ్మెలో జీడీఎస్ ఉద్యోగులు



కొత్తగూడెం పోస్టాఫీస్ ఎదుట జీడీఎస్ సిబ్బంది సమ్మె

16



జూలూరుపాడులో తెరుచుకోని ఎస్‌బీఐ

3

బ్యాంకుల బంద్ విజయవంతం

- స్తంభించిన సేవలు.. ఖాతాదారుల ఇబ్బందులు

ప్రత్యేకతలకు నిలయం.. కాళేశ్వరస్వామి ఆలయం

అశ్వారావుపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, వినాయకపురంలో నిర్మించిన శ్రీ యంత్ర రాజ సహిత కాళేశ్వరస్వామి ఆలయం ఎన్నో ప్రత్యేకతలను నిలయం. భూక్యా భిక్షం అనే గిరిజనుడు సొంత భూమిలో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. రెండు అంతస్తులతో నిర్మించిన ఈ ఆలయంలో మూలవిరాట్ ను 16అడుగుల ఎత్తున ఏకశిలతో నిర్మించారు. పానమట్టాలపైన శ్రీ చక్రం యంత్ర స్థాపితంతో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. కింది అంతస్థులో ప్రతిష్ఠించిన స్వామి విగ్రహం రెండో అంతస్తులో భక్తులకు దర్శనమిస్తుంది. ఆలయం ఎదురుగా 42 అడుగుల ఎత్తున్న ఏకశిల ధ్వజస్తంభంను ప్రతిష్ఠించారు. 14 అడుగుల ఎత్తున నందీశ్వరుని విగ్రహాన్ని నిర్మించారు. ఆలయానికి ఎదురుగా తూర్పున కోనేరు, దాని మధ్యలో మృత్యుంజయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ప్రత్యేకంగా యాగశాల, నవ గ్రహాల విగ్రహాలను ఏర్పాటు చేయడం విశేషం. పంచాయన ఉప ఆలయాలు నిర్మించి అందులో విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీరాజ శ్యామలాదేవి మాత, శ్రీఆంజనేయ లక్ష్మణ, సీతారామలక్ష్మణుల ఆలయాలు, జంట సర్పాల విగ్రహాన్ని ఆలయం చుట్టూ ఏర్పాటుచేశారు. ఇన్ని ప్రత్యేకలతో నిర్మిస్తున్న ఈ ఆలయాన్ని ఓ గిరిజనుడు సొంత భూమిలో నిర్మించడమే కాకుండా,



నాలుగేళ్లుగా ఆయన పొలంలో, తోటల్లో వచ్చే పూర్తి ఫలసాయాన్ని ఈ ఆలయానికే వెచ్చించడం మరో విశేషం. భక్తులు ఈ ఆలయంలోని కాళేశ్వరస్వామిని దర్శించి పులకించిపోతున్నారు.

ఎస్ఎంసీలకు ఆర్‌సీనెం.382 సూచనలు

బోనకల్: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కమిటీలకు విద్యాశాఖ ఇటీవల ఆర్‌సీనెం.382/ ఎస్ఎస్ఏ/ సీఎంవో/ టీ4/2016 ద్వారా తగు సూచనలను చేసింది. చైల్డ్ ఇన్ఫో వెబ్‌సైట్‌లో విద్యార్థుల పేర్లు, ఆధార్ నెంబర్లతో పాటు ఎస్ఎంసీ సభ్యుల పేర్లు, వారి ఫోన్ నెంబర్లను పొం దుపరచాలి. మండల, జిల్లా స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేయాలి. పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక సమావేశాలను నిర్వహించి వారికి హ్యాండ్‌బుక్‌లు ఇచ్చి చైతన్యపరచాలి. పాఠశాలకు, సమాజానికి మధ్య వారధిలా పనిచేసి అందరిని బడులలో భాగస్వామ్యం కల్పించేలా చూడాలి. పాఠశాలల ఆధునికీకరణ కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులను ఎప్పటికప్పుడు సంప్రదించాలి.

ప్రమాదమే పట్టుదలను పెంచింది

సురుగురి ప్రశాంత్, తాలిపేరు ఏఈ, దుమ్ముగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా



- దుమ్ముగూడెం

పేద కుటుంబంలో పుట్టినా కష్టపడి చదివి ఉద్యోగం సాధించారు సురుగురి ప్రశాంత్. అవకాశాలను అందిపుచ్చుకొంటూ, ఆశావహదృక్పథంతో విజయం సాధించారు. 'ఆంధ్రజ్యోతి' పలుకరింపుతో ఆత్మీయంగా మాట్లాడారు. ఆ విశేషాలు మీకోసం..

రోడ్డు ప్రమాదం పట్టుదలపెంచింది

మాది వరంగల్ జిల్లా ధర్మసాగరం మండల కేంద్రం. నేను ఐదో తరగతి చదువుతున్న సమయంలో వ్యవసాయ పనులపై వెళ్తున్న తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సకాలంలో సరైన వైద్యం అందలేదు. దీంతో బాగా చదవాలనే పట్టుదలను వచ్చింది.

అక్క త్యాగం మరువలేనిది..

ఇంటి వద్ద బాగోగులు చూసుకోడానికి తొమ్మిదో తరగతి చదువుతున్న అక్కయ్యను చదువు మాన్పించారు. పేద వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నాకు చదువువిలువ చిన్నప్పుడే తెలిసింది. రెండెకరాల వ్యవసాయభూమి ఉన్నప్పటికీ, చిరు కిరాణాదుకాణంపై వచ్చిన ఆదాయంతోనే చదివా. అమ్మ ఎంతో ప్రోత్సహించారు. మామయ్య రాజు మార్గనిర్దేశకంతో ప్రభుత్వోద్యోగం సాధించా.

మెకానికల్ టాపర్‌ను..

2015 టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో మెకానికల్ టాపర్‌గా నిలిచాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఈసెట్‌లో ఆరో ర్యాంకు సాధించాను. పదోతరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివా. డిప్లొమా వరంగల్ ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసించాను. పదో తరగతిలో 532, డిప్లొమాలో 91శాతం మార్కులు సాధించాను.

ఆ కామెంట్‌ను పాజిటివ్ తీసుకున్నాను..

డిప్లొమా ప్రాక్టికల్ పరీక్షల్లో ఇన్విజిలేటర్‌గా ఒక మేడం వచ్చారు. మెకానికల్ విద్యార్థులంతా బట్టీ పట్టి చదువుతారని వ్యాఖ్యానించారు. ఆ మాటలను నేను పాజిటివ్‌గా తీసుకున్నాను. నాటి నుంచి సబ్జెక్టును అర్థం చేసుకొని చదివేవాడిని. దీంతో ప్రయోజనం కలిగింది.

ప్రణాళికాబద్ధంగా చదవాలి..

పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒక ప్రణాళికాబద్దంగా చదవాలి. పూర్తైన ప్రతీ సబ్జెక్టును ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ఉండాలి.



కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



యోగాసనాలు సాధన చేస్తున్న చిన్నారులు

క్రీడా కిరణాలు

చదువుతో పాటు ఆటల్లో ప్రతిభచూపుతున్న తిమ్మారావుపేట జడ్పీఎస్ విద్యార్థులు

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లో పతకాలు సాధిస్తున్న చిన్నారులు

అదో విద్యా ఉద్యానవనం.. దానితో పాటు సుశిక్షితులైన క్రీడాకారులను తయారు చేసే క్రీడా మైదానం.. తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులు.. మైదానంలో వారికి ఇష్టమైన క్రీడల్లో సాధన చేస్తున్నారు. ఇప్పటికే పలువురు విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు చదరంగంలో పతకాలు సాధించారు. ఈ ప్రాంతంలో ఎక్కడ ఆటల పోటీలు జరిగినా తిమ్మారావుపేట జడ్పీ పాఠశాల క్రీడాకారులు విజేతలుగా నిలుస్తున్నారు. భవిష్యత్తులో ఈ పాఠశాల నుంచి జాతీయ స్థాయిలో ఆడే క్రీడాకారులు తయారుకావాలని ఆశిద్దాం..

- ఏన్కూరు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తిమ్మారావుపేట గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. దాదాపు 330 మంది విద్యార్థులున్న పాఠశాల క్రీడామైదానంలో ప్రతీరోజు పలు ఆటల్లో సాధన చేస్తుంటారు. దీనికి పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ ఎంతో సహకరిస్తున్నారు.

ఆత్మరక్షణకు కరాటే..

ఆత్మస్థైర్యం పెంచడానికి పలు రకాల మార్శల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. చిన్నతనంలోనే ఎటాకింగ్‌లో మెలకువలు నేర్చుకుంటే ఎంతో సహాయకారిగా ఉంటుందని క్రీడా శిక్షకులు అంటున్నారు. ప్రత్యేకంగా బాలికలకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. అపరిచితులతో ఎలా ప్రవర్తించాలో నేర్పుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రత్యర్థిని నిలువరించడానికి భౌతికంగా దాడి చేసే విధానం నేర్పిస్తున్నారు.

కబడ్డీ ప్రత్యేకం..

తిమ్మారావు పేట పాఠశాల విద్యార్థులు అన్ని రకాల ఆటల్లో ప్రతిభ చూపుతున్నా కబడ్డీలో అధిక సంఖ్యలో క్రీడాకారులున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలోని పలు కేంద్రాల్లో నిర్వహించిన పోటీల్లో తిమ్మారావుపేట విద్యార్థులు విజయం సాధించారు. ఉదయం, సాయంత్రం కోచ్ పర్యవేక్షణలో కబడ్డీ శిక్షణ కొనసాగుతోంది. ఎస్.శ్రావణి అనే క్రీడాకారిణి కబడ్డీలో రాణిస్తోంది. మండల, జోనల్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాల పంట పండిస్తోంది. నాలుగు పర్యాయాలు రాష్ట్రస్థాయి కబడ్డీలో రాణించింది. శ్రావణి రైడర్‌గా పాయింట్లు తేవడంలో ప్రత్యేక శైలి కనబరుస్తోంది. ఆజాద్ అనే విద్యార్థి కబడ్డీలో రాష్ట్రస్థాయలో రాణిస్తున్నాడు.



కబడ్డీ అఫీషియల్స్‌తో పాఠశాల క్రీడాకారులు

కబడ్డీ రిఫరీగా రాణిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు శోభన్



విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చదిద్దడానికి పీఈటీ గుగులోతు శోభన్ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నా రు. స్వతహాగా కబడ్డీ క్రీడాకారుడైన శోభన్ చిన్నారులను ప్రోత్సహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలకు రిఫరీగా వ్యవహరిస్తున్నారు. ఎన్‌సీసీ-బీ గ్రేడ్ సర్టిఫికెట్ కలిగిన పీఈటీ విద్యార్థులకు ఆటల్లో మెలకువలతో పాటు క్రమశిక్షణను నేర్పుతున్నారు. గత వేసవిలో ప్రత్యేకంగా కబడ్డీ కోచింగ్ క్యాంపు నిర్వహించారు. దాదాపు 150 మంది యువకులు 40 రోజుల పాటు శిక్షణ పొందారు. వీరిలో నలుగురికి ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలు వచ్చాయి. తిమ్మారావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు మానసిక ఉల్లాసం కోసం కోలాటంలో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. దీని వల్ల వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

నేడు ఏకలవ్య పాఠశాలలో
స్పాట్ అడ్మిషన్లు

దమ్మపేట: మండల పరిధి గండుగులపల్లిలో మంజూరయిన ఏకలవ్య పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు బుధవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీతాకుమారి తెలిపారు. ఐదు, ఆరు తరగతుల్లో ఒక్కో తరగతికి 80మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తామన్నారు. 64మంది ఎస్టీలు, 10 మంది ఎస్సీలు, నలుగురు బీసీలు, ఇద్దరు ఓసీలకు ప్రవేశముంటుందన్నారు. అడ్మిషన్ పొందాలనుకునేవారు కులధ్రువీకరణ, ఆదాయం, విద్యార్హత పత్రాలతో సంప్రదించాలని కోరారు.

సమయపాలన పాటించాలి

● ఏడీఎంహెచ్‌వో సింగరాజు

ములకలపల్లి: మండల కేంద్రమైన ములకలపల్లిలోని మంగపేట గిరిజన ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా అదనపు వైద్య అధికారి డాక్టర్ సింగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి వైద్యాధికారులతో మాట్లాడారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, గ్రామాల్లో ఎంఆర్ వ్యాక్సిన్ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్లు స్వాతిశ్రీ, ప్రియత, సిబ్బంది ఉన్నారు.

బ్యాంకుల బంద్ విజయవంతం

నిరసన తెలిపిన ఉద్యోగులు
స్తంభించిన సేవలు.. ఖాతాదారుల ఇబ్బందులు


నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

భద్రాచలం: ప్రభుత్వ రంగ బ్యాంకుల బంద్ జిల్లాలో మంగళవారం విజయవంతమైంది. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ ఒక రోజు సమ్మెకు ఇచ్చిన పిలుపు మేరకు ఎస్‌బీఐ ఉద్యోగులు బ్యాంకులు మూసి తమ నిరసన తెలిపారు. మంగళవారం బ్యాంకు ఉద్యోగులు ఎన్పీఏల రికవరీ విషయంలో పార్లమెంటరీ కమిటీ సిఫారసులను అమలు చేయాలని, ఎఫ్ఆర్‌డీఐ బిల్లును ఉపసంహరించుకోవాలని, బ్యాంక్స్ బోర్డు బ్యూరోను రద్దు చేయాలని, బ్యాంకింగ్ రంగంలో అన్ని ఖాళీలను భర్తీ చేయాలని, డిమాండ్ చేస్తూ ఉద్యోగులు నినాదాలు చేశారు. బ్యాంకింగ్ ఉద్యోగులు సమ్మెతో ఎస్‌బీఐ దాని అనుబంధ శాఖల్లో లావాదేవీలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ప్రసంగించిన ఎస్బీఐ ఉద్యోగుల సంఘం కార్యదర్శులు డి.నరేష్, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నిరర్ధక ఆస్తుల మాఫీని వ్యతిరేకిస్తున్నామని, జీఎస్టీ పేరుతో బ్యాంకు చార్జీలను పెంచవద్దని అన్నారు. నోట్ల రద్దు సమయంలో బ్యాంకులు పెట్టిన ఖర్చులను ప్రభుత్వం భరించాలని , కేంద్ర ప్రభుత్వం కారుణ్య నియామకాలను బ్యాంకుల్లో కూడా అనుసరించాలని కోరారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకొని బ్యాంకు సేవలను సులభంగా, చౌకగా సేవలందించాలనే సదుద్దేశ్యంతోపే తాము ఈ ఒక్కరోజు సమ్మెలో పాల్గొన్నామని తెలిపారు. ఇదిలా ఉండగా బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయు ఆధ్వర్యంలోని బృందం సభ్యులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మాచారి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎంబీ నర్సారెడ్డి, వై.వెంకటరామారావు, పట్టణ ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి పాల్గొన్నారు.

మినీ లోకం



దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రుణాల మంజూరులో జిల్లా ద్వితీయస్థానం: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి పేర్కొన్నారు. రాష్ట్రంలో 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను స్వయం ఉపాధి పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.250కోట్ల రుణాలు కేటాయించిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాకు 2,552 మంది లబ్ధిదారులకు రూ.40.15 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సారా తయారీ మానేసిన ఎస్సీ కుటుంబాల వారికి ఉపాధి కల్పిస్తామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 112 మందిని గుర్తించామని, వీరి ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీతో రుణం అందజేస్తామన్నారు. జిల్లాలో అంబేద్కర్ విదేశీ విద్య పథకం కింద ఆస్ట్రేలియా, అమెరికా, ఇంగ్లాండ్‌లో ఉన్నత చదువులు చదువుకునేందుకు ఒక్కొక్కరికి రూ.20లక్షల చొప్పున ఇస్తామని, ఇందుకు 31మందిని గుర్తించినట్లు తెలిపారు.. 2016-17 ఆర్థిక సంవత్సరంలో స్వయం ఉపాధి కల్పించేందుకు 640మందికి కార్పొరేట్ రుణాలు అందజేస్తామన్నారు. ఇప్పటికే 97 మందికి రూ.7.97 కోట్లు రుణాలు అందజేసినట్లు పేర్కొన్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో 291 మందికి రుణాల పంపిణీ పెండింగ్‌లో ఉందన్నారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో 738 లబ్ధిదారులకు రుణాల పంపిణీ పెండింగ్‌లో ఉందన్నారు. సెప్టెంబర్ 4తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉబర్ కంపెనీ ద్వారా ఎస్సీ లబ్ధిదార్లకు ట్యాక్సీలు నడుపుకునేందుకు 500 కార్లను పంపిణీ చేస్తామన్నారు.. జిల్లాలో క్యాబ్ కార్ల కోసం 103 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 13మందికి రుణాలు ఇచ్చేందుకు ఎంపిక చేశామన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నగేష్, టీఆర్ఎస్ నాయకులు మోదుగు ప్రభాకర్, సింగరేణి ఎస్సీ, ఎస్టీ అధ్యక్షుడు కొంకటి శ్రీనివాస్, ఎస్సీ అసోసియేషన్ నాయకుడు రామారావు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలింపు

● అటవీశాఖ అధికారుల అదుపులో 20 ట్రాక్టర్లు


అటవీశాఖ అదుపులో ఇసుక ట్రాక్టర్లు

ఇల్లెందురూరల్: గుండాల మండలం నుంచి అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక మాఫియా అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తూ లక్షల రూపాయలు వెనకేసుకుంటోంది. సోమవారం రాత్రి గుండాల మండలం ఆళ్లపల్లినుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను ఇల్లెందు ప్రాంతంలో అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి బిల్లులు లేకుండా, సమయం లేకుండా నకిలీ బిల్లులను సృష్టించి తరలిస్తున్న 20 ట్రాక్టర్లను రేంజర్ వెంకన్ననాయక్ ఆధ్వర్యంలో కలపడిపోకు తరలించారు. గత కొంత కాలంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్ళ పేరిట నకిలీ పత్రాలను సృష్టించి ఇసుకను అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుండాల నుంచి ఇల్లెందు వరకు రశీదులు సృష్టించి ఖమ్మం, మహబూబాబాద్ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై ఫారెస్ట్ రేంజ్ అధికారి వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు లేకుండా ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నట్లు సమాచారంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

● డీఈవో హయగ్రీవాచార్యులు

పాల్వంచ: ఉన్నతలక్ష్యాలతో విద్యార్థులు చదువుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖాదికారి హయగ్రీవాచార్యులు పిలుపునిచ్చారు. పాల్వంచలోని నవభారత్ ఆధ్వర్యంలో 20ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 150మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ఉచితంగా నిర్వహిస్తున్న ట్యూషన్, స్పోకెన్ ఇంగ్లీషుల్లో ప్రతిభ చాటిన విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం నవభారత్ యాజమాన్యం పాఠశాల బ్యాగులు అందజేసారు. నవభారత్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సంస్థ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నవభారత్ సోషల్ డవలప్‌మెంట్ బాధ్యులు జీఎన్ రావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న డీఈవో హయగ్రీవాచార్యులు

బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం

మణుగూరు: బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనం, బ్యాంకుల మూసివేత నిర్ణయాలను వ్యతిరేకిస్తూ.. దేశ వ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు మంగళవారం నిర్వహించిన సమ్మె మణుగూరులో విజయవంతమైంది. ఇందులో భాగంగా మణుగూరులోని బ్యాంకులు మూతపడ్డాయి. దీంతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బ్యాంకుల బంద్ విషయం తెలియని అనేక మంది ఖాతాదారులు అత్యవసరాలు నిమిత్తం బ్యాంకులకు వచ్చి.. నిరాశగా వెనుదిరిగారు.

సినిమాలు

మణుగూరు

● సత్యభాస్కర	జయజానకి నాయక
● సీతారామ	ఫిదా

మణుగూరు మండల అధికారుల సమాచారం

తహసీల్దార్	9849 906092
ఎంపీడీవో	9440 906948
ఎంఈవో	9440 890114
వ్యవసాయాధికారి	7288 894259
డీఎస్పీ	9440 795326
సీఐ	9440 795327
ఎక్సైజ్ సీఐ	9440 902685
విద్యుత్ ఏడీఈ	9440 811536
విద్యుత్ ఏఈ	9440 811555
ఇరిగేషన్ ఏఈ	9701 362564
పీఆర్ ఏఈ	9492 960748
టెలికం ఏఈ	9440 326999
వైద్యాధికారి	9550 791319
పశువైద్యాధికారి	9866 341589
ఆర్టీసీ డీఎం	7382 825963
ఐకేపీ ఏపీఎం	9704 789728



జోరుగా వరినాట్లు

వర్షం రాకతో అన్నదాతల్లో ఆనందం

మణుగూరు రూరల్: వరుసగా మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు రైతుల్లో ఆనందం నింపాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తి కావస్తున్న తరుణంలో నారుమడి వేసి, వరి నాటు వేయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఆగి పోవడంతో వర్షాధారంపై ఆధారపడిన రైతులు తమ పోలాలను దుక్కి దున్ని వరి నాట్లు ప్రారంభించారు. సమితిసింగారం పంచాయతీ పరిధిలోని సీతానగరం, మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలో వరి నాట్లు వేయని రైతులు ఉత్సాహంగా వరినాటే పనిలో నిమగ్నమయ్యారు.



సిద్ధంగా ఉన్న వరినారు కట్టలు



సీతానగరంలో వరినాట్లు వేస్తున్న మహిళలు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

● మణుగూరు డీఎస్పీ అశోక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్‌కుమార్

మణుగూరు: వినాయక నవరాత్రి ఉత్సవాలను నిబంధనల మేరకు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని.. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మణుగూరు డీఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకల్లో డిజె సౌండ్ సిస్టం, బాణాసంచాలకు అనుమతులు లేవన్నారు. ఎక్కడ వినాయక విగ్రహం పెట్టినా ముందుగా అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసే మండపాల్లో రాత్రి సమయాల్లో ఇద్దరు కమిటీ సభ్యులు రక్షణగా ఉండాలన్నారు. మండపాల వద్ద కానీ, ఊరేగింపు సందర్భంగా కానీ వాహన డ్రైవర్లు, ఇతర సభ్యులు మద్యం సేవిస్తే కేసులు తప్పవన్నారు. అలాగే ఆ కమిటీకి సంబంధించిన అధ్యక్షుడిపై కూడా కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా కమిటీ సభ్యులే బాధ్యత వహించాలన్నారు. భక్తిభావంతో భక్తిగీతాలు, భజనలతో వేడుకలను నిర్వహించుకోవాలన్నారు. ఎటువంటి రికార్డింగ్ డ్యాన్సులకు కూడా అవకాశం లేదన్నారు. సెప్టెంబర్ 2న బక్రీద్ సందర్భంగా ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల తర్వాతే ఊరేగింపులు చేసుకోవాలని సమావేశంలో సీఐ మొగిలి, ఎస్ఐ నరహరి, సిబ్బంది పాల్గొన్నారు.

'పిరమిడ్' ఆధ్వర్యంలో ప్రదర్శన



ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

మణుగూరు: శాఖాహార భోజనమే ఆరోగ్యకరమని... మాంసాహారాన్ని తినడం మానాలని నినదిస్తూ... పిరమిడ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణం లో భారీ ప్రదర్శన నిర్వహించారు. జంతువధ మహాపాపం, జంతువులను స్వేచ్ఛగా బతకనివ్వడం మానవధర్మం, మాంసాహార భక్షణే సకల రోగాలకు మూలం అంటూ రాసిన ప్లకార్డులను చేతబూని మహిళలు అధిక సంఖ్యలో ప్రదర్శనలో పాల్గొన్నారు. మాంసాహారం మానాలి, శాఖాహారం మనవాహారం అంటూ నినాదాలు చేశారు. ప్రదర్శనకు విశేష స్పందన లభించింది.

రోడ్డు పనులను పరిశీలించిన సర్పంచ్



పనులు పరిశీలిస్తున్న దృశ్యం

మణుగూరు రూరల్: సమితిసింగారం పంచాయతీ పరిధిలోని అగ్నిమాపక కేంద్రానికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బచ్చల భారతి మంగళవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు అగ్నిమాపక కేంద్రానికి వెళ్లే రహదారి మొత్తం వరద నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలుగ చేసింది. స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించిన సర్పంచ్ వెంటనే ఆ ప్రాంతంలో గ్రావెల్ రోడ్డును నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వెంటనే అధికారుల ఆ ప్రాంతంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కెవి రావు, నాయకులు ఉడతాని రవి, సూర రాజు తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

మణుగూరు: మణుగూరు ఏరియా ఆస్పత్రి (వంద పడకల) ప్రారంభించి నెల రోజులు దాటుతున్నా.. నేటికీ వైద్యులు, సిబ్బంది, పరికరాలు ఏర్పాటు చేయకపోవడాన్ని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉప్పుతల రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సాయి, శ్రీను, కిరణ్, పాషా, భాస్కర్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమితిసింగారం రోడ్డు నిర్మించాలని బీజేపీ దీక్ష

మణుగూరు రూరల్: మణుగూరు పట్టణంలోని టీడీపీ సెంటర్ నుంచి పీవీ కాలనీకి వెళ్లే సమితిసింగారం ప్రధాన రహదారిపై నూతన రోడ్డును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఒక్క రోజు నిరాహార దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడు తూ.. ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి నిర్మాణంలో ఉన్నందున భారీ వాహనాల రాకపోకలతో రహదారి అధ్వానంగా మారిందన్నారు. ఈ రహదారికి తాత్కలిక మరమ్మత్తులు చేసి వదిలి పెట్టకుండా నూతన రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనివల్ల ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు జంపన సీతరామరాజు భిక్షపతి, తార ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న బీజేపీ నేతలు

'నిరాహార దీక్ష హాస్యాస్పదం'

మణుగూరు: పీవీ కాలనీ రోడ్డు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించినా బీజేపీ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మించాలంటూ నిరాహార దీక్షకు దిగడం హాస్యాస్పదంగా ఉందని టీఆర్ఎస్ నేతలు జోగా సారయ్య, జనగం పద్మ విమర్శించారు. మంగళవారం టీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సారయ్య, పద్మ మాట్లాడారు. వర్షం కారణంగా మరమ్మతు పనులు ప్రారంభం కాలేదన్నారు. రోడ్డును మళ్లీ నిర్మించడానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. అప్పటి వరకు ఇబ్బందులను తొలగించేందుకు మరమ్మతులు నిర్వహిస్తారన్నారు. ఈ విషయంపై బీజేపీ నాయకులు దీక్షకు దిగడం పలువురు ఆక్షేపించే విధంగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు ఆదిలక్ష్మి, శ్రీను, వావిలాల భుజంగరావు, మాదాడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



దీక్షల దృశ్యం

మణుగూరు రూరల్: ఆర్‌టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) ఆధ్వర్యంలో మణుగూరు ఆర్‌టీసీ డిపో వద్ద కార్మికులు నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజన్ కార్యదర్శి డీఎస్ నారాయణ మాట్లాడుతూ.. కార్మికలకు ఏప్రిల్ 1 నుంచి రావాల్సిన పే స్కేల్‌ను వెంటనే అమలు చేయాలని, సకలజనుల సమ్మెల కాలాన్ని వేతనంతో కూడిన సెలవులుగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, కేవీ రావు, ఎస్ఆర్ బాబు, పవన్, మధు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన

అశ్వాపురం: నాబార్డు ఆర్థిక సహాయంతో చెస్ట్‌డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జగ్గారం వాటర్ షెడ్ పరిధిలోని జగ్గారం, కొమ్ముగూడెం గొల్లగూడెం, సీతారాంపురం రైతులకు సేంద్రియ ఎరువుల తయారీ విధానం ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎన్‌వీఎస్ ప్రసాదరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

భద్రాచలం: భద్రాచలం మండల ఫొటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవీఎస్ శంకర్‌రావు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి వెంకటపతిరాజు, కోశాధికారి శోభన్ బాబు, కన్వీనరు బాబాజీ, సమన్వయకర్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

భద్రాచలం

- ఉదయభాస్కర్ ఫిదా
- విజయభాస్కర్ మాయామాల్
- గోపాలకృష్ణ గౌతమ్ నంద
- శివం (సారపాక) ఫిదా

దుమ్ముగూడెం అధికారుల సమాచారం

తహసీల్దార్	:7680026361
ఎంపీడీఓ	:9440906956
ఎస్ఐ	:9440795307
ఎంఈఓ	:9912170410
రేంజ్అధికారి	:9440810347
విద్యుత్‌శాఖ ఏఈ	:9440811554
మండల ఏఓ	:7288894265
పీఆర్ జేఈ	:9440564966
ఈఓఆర్డీ	:9492091891
ఎక్సైజ్ సీఐ	:9440902683
వెటర్నరీ వైద్యుడు	:9704068729
దుమ్ముగూడెం పీహెచ్‌సీ	:9989027131
నరసాపురం పీహెచ్‌సీ	:8977425496
పర్ణశాల పీహెచ్‌సీ	:9963300896
తాలిపేరు డీఈ	:7075238444
ఇరిగేషన్ ఏఈ	:9100040649
టెలికాం ఏఈ	:9441558855

గణనాథులు సిద్ధం



- 25న వినాయక చవితి..
- జోరుగా విగ్రహాల విక్రయాలు



చర్ల: గ్రామాల్లో వినాయక చవితి సందడి మొదలైంది. చిన్నా పెద్దా కలిసి వినాయక నవరాత్రి మహోత్సవ ఏర్పాట్ల లో నిమగ్నమయ్యారు. కొన్ని గ్రామాల్లో మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. బయట మార్కెట్‌లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. విగ్రహం సైజును బట్టి 4 వేల నుంచి 12 వేల ధర పలుకుతున్నాయి. అయితే చాలా మంది మట్టి విగ్రహాల వైపే మొగ్గు చూపుతున్నారు.

ముమ్మరంగా ఉత్సవ ఏర్పాట్లు

వినాయక చవితి పండుగ సమీపిస్తుండంతో చర్ల మండలంలో చిన్నా, పెద్దా కలిసి ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు. సమీప అడవుల్లో కి వెళ్లి తీసుకు వస్తున్న కర్రలతో మండపాలు తయారుచేస్తున్నారు. తాహతును బట్టి సెట్టింగ్‌లు ఏర్పాటుచేయడంలో నిమగ్నమయ్యారు.

అధిక ధర పలుకుతున్న విగ్రహాలు

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలు అధిక ధర పలుకుతున్నాయి. సైజు, మోడల్‌ని బట్టి నాలుగు వేల నుంచి 12 వేల వరకు ధర పలుకు తున్నాయి. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ధర ఎక్కువనే అని ఉత్సవ కమిటీ సభ్యులు అంటున్నారు. ఒక్కో విగ్రహాన్ని తయారు చేయడానికి 30 రోజులు సమయం పడుతుందని, ముడిసరుకు ధరలు కూడా పెరిగాయని అందుకని విగ్రహాల ధరలు కూడా పెంచాల్సి వస్తోందని విగ్రహతయారీదారులు చెపుతున్నారు. ఏదిఏమైనా.. విగ్రహ తయారీదారులు, విక్రయదారులు బిజీబిజీగా మారిపోయారు. పండుగ సమీపిస్తుండటంతో విక్రయాలు జోరందుకున్నాయి.



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాన్ని తయారు చేస్తున్న దృశ్యం



విగ్రహాలకు రంగులు అద్దుతున్న దృశ్యం

కొనసాగుతున్న
జీఎస్పీ దీక్షలు



దీక్షల దృశ్యం

భద్రాచలం: ఆదివాసీల స్వయంపాలన హక్కును హరించే జీవో నెం.54ను రద్దు చేయాలని కోరుతూ ఐటీడీఏ వద్ద గోండ్వాన సంక్షేమపరిషత్ (జీఎస్పీ) ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. రెండో రోజు దీక్షలను జీఎస్పీ కన్వీనరు సోందె వీరయ్య ప్రారంభించి.. మాట్లాడారు. ఆదివాసీల స్వయంపాలన హక్కును హరించే జీవో నెం.54 అక్రమార్కుల అవినీతికి లైసెన్సులా ఉందన్నారు. ఐటీడీఏ సంస్థల్లో సుమారు 40 ఏళ్లకు పైగా వార్డెన్ వ్యవస్థ కొనసాగుతోందని, ఏజెన్సీలో రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, వార్డెన్ వ్యవస్థ దోపిడీకి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. అందువల్లే వార్డెన్ వ్యవస్థ దశాబ్దాల తరబడి యదేచ్ఛగా కొనసాగుతోందన్నారు. ఈ విధానం మారాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. దీక్షలో సడియం శివ, కుంజా వినోద్, శీలం అరుణకుమార్, వాగి సాయి కిరణ్ కొర్సా ప్రియాంక, పూనం దివ్య, మడకం విజయ కుమారి, మడకం సరిత, యాక స్రవంతి కుమారి, నందిని, తాటి భవాని, పూనెం మనీష, పాయం సుశీల పాల్గొన్నారు.

'భవనం నిర్మించే వరకూ పోరాటం'



మాట్లాడుతున్న బందెల నర్సయ్య

భద్రాచలం: దళితులంతా ఏకమై రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బందెల నర్సయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు దళితుల హక్కులను హరించే విధంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారన్నారు. నేరెళ్లలో ఇసుక మాఫియా జరిపిన దాడిపై ప్రభుత్వం నోరు మెదపకపోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు సత్యనంద్, అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, సభ్యులు బి.రాంబాబు, నాగరాజు, బాబీ, జగన్, గుమ్మడి రాజు పాల్గొన్నారు.

మలేరియా కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న దృశ్యం

చర్ల: చర్ల ప్రభుత్వ వైద్యశాల పరిధిలోని ఆశాకార్యకర్తలకు మంగళవారం మలేరియా కిట్లను పంపిణీ చేశారు. వీటిని చర్ల సర్పంచి పుస్సం జ్యోతిర్మయి, జడ్పీటీసీ సభ్యురాలు తోటమళ్ల హరిత, ఎంపీపీ అధ్యక్షుడు కోదండరామయ్య అందజేశారు. ఈ సందర్భంగా చర్ల ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ జానకీరాం మాట్లాడుతూ వైద్యశాల పరిధిలో మొత్తం 45 మంది ఆశాకార్యకర్తలు ఉన్నారని అన్నారు. వారందరికీ వీటిని అందజేస్తున్నామన్నారు. మలేరియాను దృష్టిలో ఉంచుకుని అందరికీ కిట్లు అందజేశామని పేర్కొన్నారు.

పిడుగు పాటు.. త్రుటిలో తప్పిన ప్రమాదం

దుమ్ముగూడెం: మండలంలోని మహదేవపురానికి చెందిన నూప సీతమ్మ అనే వృద్ధురాలు మంగళవారం త్రుటిలో ప్రాణాలతో బైటపడింది. వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు వస్తుండడంతో భయపడి తన చెల్లెలు ఇంటికి వెళ్లింది. మరునిముషంలోనే గడ్డింటిపై పిడుగు పడి ఇంటిలోని బీరువా, నగదు కాలిపోయాయి. దీంతో రూ.50వేల ఆస్తినష్టం జరిగిందని బాధితురాలు తెలిపింది. అలాగే నరసాపురం గ్రామ సమీపంలో పిడుగు పాటుకు నాలుగు టీవీలు, నాలుగు ఫ్యాన్లు, ఒక రిఫ్రిజరేటర్‌కాలిపోయాయి.

'గిరిజన హక్కుల సాధనకు పోరాడాలి'

చర్ల: గిరిజన హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ఇన్‌చార్జ్ కల్లూరి వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హక్కుల సాధనకు మిలిటెంట్ పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ నెల 24 న భద్రాచలంలో తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా మహసభను నిర్వహిస్తున్నామని గిరిజనులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు జి.సాంబశివరావు, నరేష్, రామారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పాలన: రాజయ్య

కొత్తగూడెం టౌన్: తెలంగాణలో పాలన అస్తవ్యస్తంగా.. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందని ద్రాక్షగా మారాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు, భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఆరోపించారు. కొత్తగూడెంలో సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సేవలు అనువుగా ఉండేందుకు ఇల్లెందు క్రాసోరోడ్డువద్దే అన్ని ప్రభుత్వకార్యాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధిని పోల్చుకుంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నరీతిన ఉందన్నారు. 171 జీవోను తీసుకురావడం సరికాదన్నారు. జిల్లాలో సాగునీటి వనరులు రైతులకు అందాలంటే.. రూ.పది వేల కోట్లను మంజూరు చేయాలన్నారు. దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకం, కిన్నెరసాని జలాలు, తాలిపేరు ప్రాజెక్టు, పులుసుబొంత ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి రైతాంగానికి సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి రానున్న రోజుల్లో దశలవారీ ఉద్యమాన్ని చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని అయిలయ్య కూడా సమావేశంలో మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

వైభవంగా భద్రాద్రి రాముని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి వారికి మంగళవారం నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి వారిని నిత్య కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకురాగా తొలుత సహ స్రనామార్చన నిర్వహించారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యహావచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, యోక్త్రబంధనం, కన్యాదానం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, బ్రహ్మముడి, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

మావోయిస్టు మిలీషియా సభ్యుల అరెస్టు



పట్టబడిన మిలీషియా సభ్యులను చూపుతున్న ఎస్ఐ సత్యనారాయణ

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని కలివేరు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం ఇద్దరు మావోయిస్టు మిలీషియా సభ్యులను అరెస్టు చేసినట్లు చర్ల ఎస్ఐ సత్యనారాణ తెలిపారు. ఈ అరెస్టు వివరాలను ఆయన మంగళవారం వెల్లడించారు. కలివేరు క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇద్దరు వ్యక్తులు పట్టుపడ్డారు. అనంతరం వారిని విచారించగా మావోయిస్టు మిలీషియా సభ్యులుగా తేలింది. వారిలో మడివి అలియాస్ కోడి వినోద్, ముస్కి సోమ ఉన్నారు. వీరిది చర్ల మండలం బట్టిగూడెం గ్రామం. వీరి వద్దనుంచి మావోయిస్టులకు చేరవేసేందుకు తీసుకు వెళ్తున్న మందులు, మాత్రలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. ఇద్దరి పై కేసులు నమోదు చేసి కోర్టుకి తరలిస్తున్నామని ఎస్సై తెలిపారు. తనిఖీల్లో సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ 141 పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తిరుమలాయపాలెం: రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతు ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహబాద్ జిల్లా డోర్నకల్ మండలం అందనాలపాడు గ్రామానికి చెందిన సంద్రపట్ల శ్రీశ్రీ, బాబులు కలిసి సోమవారం మండలంలోని కొక్కిరేణి బంధువుల ఇంటికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. కొక్కిరేణి క్రాస్‌రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీశ్రీ (20) తలకు బలమైనగాయాలు కాగా ఖమ్మలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని మంగళవారం బంధువుల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

బావిలో పడి వ్యకి..

తిరుమలాయపాలెం: ఓ వ్యక్తి కాలుజారి బావిలోపడి మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని కాకరవాయిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికిచెందిన కొత్తపల్లి చిన్న వెంకన్న(43) వ్యవసాయ కూలి. ఈనెల 20న చేనువద్దకు వెళుతున్నానని ఇంటినుంచి బయలుదేరాడు. ఆరోజునుంచి నేటికీ వెం కన్న ఇంటికి చేరుకోలేదు. అతని ఆచూకీకోసం బంధువుల ఇళ్లవద్ద వెతికినా ఫలితంలేక పోయింది. మంగళవారం మండలంలోని సోలిపురం శివారు పీక్యాతండావద్ద వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. బంధుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం మూల మలుపువద్ద మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భూపాలప్లి జయశంకర్ జిల్లా మంగపేటకు చెందిన తోకు నాగరాజు (31) మణుగూరు తాపీ మేస్త్రిగా పని చేస్తున్నాడు. ఈ నేపధ్యంలో తన బైక్‌పై భద్రాచయలం నుంచి మణుగూరు వెళ్తుండగా మార్గ మధ్యలో గొల్లగూడెం వద్ద వర్షం క వస్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి నాగరాజు రోడ్డుపై పడటంతో తలకు



మృతి చెందిన నాగరాజు

తీవ్ర గాయమై అక్కడి కక్కడే మృతి చెంఆదాడు. సంఘటన స్థలాన్ని అశ్వాపురం ఎస్ఐ సంతోష్ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు జారిపడి..

బూర్గంపాడు: ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళ వారం బూర్గంపాడులోని ఎస్సీ కాలనీచోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎస్సీ కాలనీకి చెందిన కంపాటి రాము(40) తమ సమీప బంధువు మృతి చెందడంతో వెళ్లి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దాంతో తలకు రాయి తగలి ఆపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య వెంకటరమణ ఫిర్యాదు మేరకు బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడు..

ఖమ్మంరూరల్: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మండలంలోని కాచిరాజు గూడేనికి చెందిన యువకుడు మంగళవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కిషోర్‌కుమార్ (25) ఖమ్మం నుంచి హైదరాబాదు వెళుతుండగా కేసముద్రం వద్ద రైలునుంచి జారిపడి మృతిచెందాడు.

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య

వ్యవసాయ పెట్టుబడుల కోసం భారీగా అప్పులు
ఆశించిన స్థాయిలో పంటలులేక అప్పులు తీరే దారిలేక మనస్తాపం

కారేపల్లి: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గిద్దవారిగూడెంలో అప్పుభారంతో డేగల బాబయ్య (60) అనే రైతు మంగళవార ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం బాబయ్య గత కొన్నేళ్ళుగా తన కున్న నాలుగెకారాలల్లో పత్తి, మిర్చి పంటసాగుచేస్తున్నాడు. ఈ నేపథయంలో వ్యవసాయ పెట్టుబడులు అధికమయ్యి అనుకున్న రీతిలో దిగుబడులు రాక నష్టాలొచ్చాయి. సారికూడా వ్యవసాయ పెట్టుబడులకోసం మూడు లక్షలు అప్పుగా తీసుకున్నాడు. రెండెకరాల్లో పత్తి సాగు చేయగా విత్తానాలు సరిగ మొలక్కెత్తక పోవడంతో మరోసారి దుక్కి దున్నుకొని తిరిగి పత్తి విత్తానాలు విత్తాడు. ఈసారి కూడ అశించిన మెరకు పత్తిపంట లేకపోడటంతో అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్థాపనికి



రైతు బాబయ్య మృతదేహం

గురైనాడు. మంగళవారం పత్తి చేనువద్దకు వెళ్ళుతున్నట్లు ఇంట్లో చెప్పివెళ్ళిన బాబయ్య మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు అన్నిచోట్ల వెదికారు. ఓ రైతుకు చెందిన వ్యవసాయబావి వద్ద చెప్పులు కనిపించడంతో అందులో నీటిని తోడగా బాబయ్య శవం బయటపడింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు,నలుగురు కుమారులుండగా ఇటీవల ఒక కుమారుడు మృతిచెందాడు.

ప్రభుత్వం ఆదుకోవాలి: అప్పుల భారంతో మృతిచెందిన బాబయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని వైరా డివిజన్ రైతు సంఘం అధ్యకుడు ముత్యాలసత్యానారాయణ, మండల అధ్యకార్యదర్శులు వడ్డె ఆజేయ్ బాబు, దాచేపల్లి కృష్ణరెడ్డి డిమాండ్ చేశారు. మృతదేహాన్ని వారు సందర్శించారు.

వందక్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

తల్లాడ: కాకినాడకు అక్రమంగా తరలిస్తున్న వందక్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మం గళవారం తెల్లవారుజామున తల్లాడ పోలీసులు పట్టుకున్నారు. లారీతోపాటు వంద క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తల్లాడ ఎస్ఐ మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు తల్లాడలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఖమ్మం రూరల్ మం డలం పల్లెగూడెం నుంచి కాకినాడకు రేషన్‌బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. లారీ, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీ కోదాడకు చెందినదిగా



అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న లారీ

గుర్తించారు. లారీ డ్రైవర్ సిరిగిరి శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

కల్తీఉత్పత్తుల నమూనాలను లేబరేటరీకి పంపిన అధికారులు

సత్తుపల్లి రూరల్: సత్తుపల్లి పట్టణంలో సోమవారం టాస్క్‌ఫోర్స్ అదికారులు కల్తీ ఆహార పదార్థాల గోదాములపై దాడులు నిర్వహించి సీజ్ చేసిన వాటిని మంగళవారం నమూనాలను లేబరేటరీకి పంపించారు. కల్తీ జరిగినట్లుగా రిపోర్ట్ వెలువడితే నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సత్తుపల్లి ఎస్ఐ వసంత్ తెలిపారు. దీంతోపాటు ప్యాంకింగ్‌కు సంబంధించిన ఎటువంటి అనుమతులు లేకుండా ప్యాకెట్లలో ఆహారోత్పత్తులపు విక్రయిస్తున్నారని నిర్ధారణ చేశారు. పూజకు ఉపయోగించే నూనెను డబ్బాల్లో నింపి వాటికి సీల్ వేశారని దానికి అనుమతులు లేవని తేల్చిచెప్పారు. కల్తీకి ఉపయోగించే పసుపు, కారం, నూనె ముడి పదార్థాలను స్వాధీనం చేసుకుని పరీక్షకు పంపారు.



రంగు ప్యాకెట్ పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ

వేధింపుల కేసులో ఇదరి అరెస్టు

అశ్వారావుపేట రూరల్: వివాహితపై పలు రకాలుగా వేధింపులకు పాల్పడుతున్న భర్త, అతని కుటుంబసభ్యులను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పేరాయిగూడెం గ్రామానికి చెందిన అశోక్, అతని తల్లి సరస్వతి అశోక్ భార్య లోహితను కొంతకాలంగా వేధిస్తున్నారు. దీనిపై బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈనెల నాలుగున కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం అశోక్, అతని తల్లి సరస్వతిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

బ్లాస్టింగ్ రాయి తగిలి వ్యక్తికి తీవ్ర గాయాలు

పరిస్థితి విషమం ● కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రికి తరలింపు

మణుగూరు: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీ ఆవరణలో ఓ వృద్ధుడు బ్లాస్టింగ్ రాయి తగిలి తీవ్ర గాయాల పాలయ్యాడు. తలకు బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన మణుగూరు ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మణుగూరు ఓసీలో 3 గంటల సమయంలో బ్లాస్టింగ్ నిర్వహించారు. బ్లాస్టింగ్ పని పూర్తయిన తర్వాత అధికారులు, సిబ్బంది తిరిగి వస్తుండగా.. బ్లాస్టింగ్ జరిగిన ప్రాంతానికి సుమారు 300 మీటర్ల దూరంలో రోడ్డుపై ఓ వృద్ధుడు పడి ఉన్నాడు. అధికారులు పరిశీలించగా తలకు బలమైన గాయమైంది. దీంతో అధికారులు వెంటనే మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్య సేవలు అందించిన అనంతరం సిటీ స్కాన్ నిమిత్తం కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రికి తరలించారు. సింగరేణి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఎగ్గడిగూడెం గ్రామానికి చెందిన పూసరి నర్సయ్య(64) గాయాల పాల



గాయాల పాలైన నర్సయ్య

య్యాడు. ఎగ్గడిగూడెం గ్రామం ఖాళీ చేసిన నేపధ్యంలో అతను ప్రస్తుతం ఉడతానేనిగుంపులో నివాసముంటున్నాడు. అతను ఎందుకు అక్కడకు వెళ్లాడు. గాయం ఎలా అయ్యిందన్న విషయాలు తెలియరాలేదు. అయితే బ్లాస్టింగ్ రాయి తగిలి గాయాల పాలై ఉంటాడని పలువురు భావిస్తున్నారు. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

బ్లాస్టింగ్ ఆవరణలో ఉంటే..
అధికారులు ఏం చేస్తున్నారు?

నర్సయ్య అనే వ్యక్తి గాయాల పాలైన ప్రదేశం బ్లాస్టింగ్ జరిగిన ప్రాంతానికి 250 నుంచి 300 మీటర్ల దూరంలో ఉంది. అయితే బ్లాస్టింగ్ చేసే సమయంలో అధికారులు, సిబ్బంది బ్లాస్టింగ్ జరిగే ప్రాంతానికి 500 మీటర్ల వరకు ఎవరూ ఉండకుండా జాగ్రత్తలు తీసుకున్నాకే బ్లాస్టింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. కానీ 8 మంది సిబ్బందితో అధికారులు అంతా పరిశీలించిన తర్వాతే బ్లాస్టింగ్ చేశాం. అప్పుడు ఎవరూ లేరు అంటున్నారు. కానీ సిబ్బంది అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించకుండా బ్లాస్టింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. కేవలం బ్లాస్టింగ్ సిబ్బంది. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు మణుగూరు ఓసి ఆవరణలోకి ఎవరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. బ్లాస్టింగ్ చేసే ముందు బ్లాస్టింగ్ ఆవరణలో వ్యక్తులు, పశువులు వంటివి ఏమీ లేకుండా చూసుకోవాలంటున్నారు. లేని పక్షంలో ఆవరణలోకి ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన కాంపౌండ్‌వాల్ నిర్మించాల్సిన అవసరం ఉంది.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విందు వినోదాలు, వేడుకలకు ఖర్చులు అంచనాలు మించుతాయి. ఆరోగ్యం, ఆహార విషయాలపై శ్రద్ధ చూపించాలి. రిటైల్, హోటల్, వైద్య రంగాల వారికి వృత్తిపరంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతములతో ఉల్లాసంగా వేడుకల్లో పాల్గొంటారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. పెట్టుబడుల్లో నిదానం అవసరం. లాభిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

మిథునరాశి: (మే21-జూన్21): ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. రియల్ ఎస్టేట్, రిటైల్, గృహనిర్మాణ రంగాలు పట్టుదలతో లక్ష్యాలు సాధిస్తారు. కుటుంబ సభ్యుల వైఖరి ఆవేదన కలిగిస్తుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): సోదరీ సోదరులు, బంధుమిత్రులను కలుసుకుంటారు. ప్రయాణాలు, సమావేశాల్లో కొంత అసౌకర్యానికి గురవుతారు. ఒక సమాచారం కలవరపెడుతుంది. ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పెట్టుబడుకు సంబంధించిన నిర్ణయాలు వాయిదా వేయండి. షాపింగ్‌లో వస్తువుల నాణ్యత గమనించండి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. వ్యక్తిగత అవసరాల కోసం ఖర్చు చేస్తారు. కీలక నిర్ణయాలు వాయిదా వేయండి. మీ నిర్ణయాలను సమీక్షించుకుంటారు. మనశ్శాంతి లోపిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): పూజలు, వేడుకలు, సంస్మరణల్లో పాల్గొంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. పెట్టుబడుల్లో నిదానం అవసరం. ప్రయాణాల్లో చికాకులు తప్పకపోవచ్చు. సినీ రాజకీయ రంగాలవారికి ప్రోత్సాహకరం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. బృంద కార్యక్రమాల్లో అసౌకర్యానికి గురవుతారు. స్నేహితులు, ప్రియతముల కోసం ఖర్చులు అధికం.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ మర్యాదలకు భంగం కలిగే అవకాశంఉంది. కుటుంబ పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): సమావేశాలు, బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. ప్రయాణాలు,చర్చలు సత్ఫలితాలను ఇవ్వకపోవచ్చు. ఒక సమాచారం ఆందోళన కలిగిస్తుంది. న్యాయ,బోధన, కన్సల్టెన్సీ రంగాల వారికి శుభప్రదం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. మనసును ఏదో వెలితి వెంటాడుతుంది. పూజలు, వేడుకలు, సంస్మరణల్లో పాల్గొంటారు. క్రయవిక్రయాలలో నాణ్యత గమనించండి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో వేడుకలు, విందుల్లో పాల్గొంటారు. కొత్త పరిచయాలు లాభిస్తాయి. సాహస ప్రయత్నాలకు, పందాలకు అనుకూల సమయం కాదు. ఖర్చులు అంచనాలు మించుతాయి.

-బిజుమళ్ల బిందుమాధవ శర్మ

ఆలయ సమాచారం..

జమలాపురం వెంకన్న



కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
టీటీడీ సత్రం	12	00
సీహెచ్‌ఎన్‌ఎన్	10	07

సంప్రదించాల్సిన ఫోన్ నెం: 08749-279855

ఈవో రమణమూర్తి: 94910 00705

ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ : 99895 07300

- తెల్లవారుజామున 4.30గంటలకు ఆలయాన్ని తెరుస్తారు.
- 5గంటలకు తీర్థబిందెలు తెచ్చే కార్యక్రమం.
- 6.30కి మంగళహారతి, మంత్రపుష్పం సమర్పణ.
- ఉదయం 7.00గంటలకు బాలభోగ నివేదన.
- 7.10 నుంచి 12గంటల వరకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు.
- 10.30 గంటలకు స్వామివారి నిత్య కల్యాణం.
- సాయంత్రం 3గంటల నుంచి తిరిగి ఆర్జిత సేవలు.

కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
కాటేజీలు	26	15
వందగదుల సదనం	62	39
శ్రీరామ సదనం	18	12
టీటీడీ సదనం	26	16
సౌమిత్రి సదనం	30	21

సంప్రదించండి..

దేవస్థానం కేంద్రీయ విచారణ కార్యాలయం : 08743-232467, 7660007671

భద్రాచలం రామయ్య



తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 వరకు, ఉదయం 7 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 8.30 వరకు సర్వదర్శనం.

ప్రత్యేక దర్శనం టిక్కెట్టు ధర ఒకటికి : రూ.20

నిత్య సేవలు ఇలా..

- తెల్లవారుజామున 4.30కి సుప్రభాతసేవ.
- 5.30 నుంచి 7గంటల వరకు బాలభోగం, నివేదన సేవాకాలం.
- ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు సహస్రనామార్చన.
- 8.30 నుంచి 11.30 వరకు, 12.30 నుంచి 1గంట వరకు, 3 నుంచి 8 గంటల వరకు మూల వరుల వద్ద అర్చన.
- 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు నిత్య కల్యాణం.
- 11.30 నుంచి 12గంటల వరకు రాజభోగం.
- మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ఆలయ తలుపులు మూస్తారు.
- రాత్రి 7గంటల నుంచి 8 వరకు దర్బారు సేవ.
- 8.30 నుంచి 9 గంటల వరకు నివేద బోగం అనంతరం పవళింపు సేవ. ఆ తర్వాత ఆలయం తలుపులు మూస్తారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంటల ధరలు (క్వింటాలుకు రూపాయల్లో)

పంట	కనిష్ఠం	నమూనా	గరిష్ఠం
పత్తి	4,300	4,600	4,975
మిర్చి	2,500	4,000	5,700
మిర్చి (తాలు)	1,000	1,200	1,500
కందులు	4,000	4,225	4,350
పెసలు	3,000	4,000	4,750
మొక్కజొన్న	-	-	-
బొబ్బర్లు	-	-	-
మినుములు	-	-	-
వేరుశనగ	-	-	-





- ఖమ్మం స్పోర్ట్స్

ఉష్ణోగ్రత వివరాలు సెల్సియస్ డిగ్రీల్లో..

	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	25	33
కొత్తగూడెం	24	33

షీ టీం చైతన్య గీతాల సీడీ ఆవిష్కరణ



ఖమ్మంలో సీడీ ఆవిష్కరిస్తున్న సీపీ తఫ్సీర్ ఇక్బాల్

ఖమ్మం క్రైం: షీటీం చైతన్య గీతాల ఆడియోసీడీని ఖమ్మం పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ మంగళవారం స్పెషల్ బ్రాంచ్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతులు, మహిళలను చైతన్య పరచటంతోపాటు యువకులను ఈవ్ టీజింగ్ దుష్పరిణామాలపై జాగ్రత్త పరిచే విధంగా పాటలను రూపొందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఖమ్మం షీటీం ఇన్‌చార్జ్ సీఐ అంజలి, తదితర షీటీం బృందం, గాయనీ గాయలకులు జాన్, ఆస్మా, మిమిక్రీ సుధాకర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మొయినుద్దౌలా కప్ రాష్ట్ర జట్టులో

ఇద్దరు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



నారాయణ



నిశాంత్

ఖమ్మం స్పోర్ట్స్: ఆలిండి యా మెయినుద్దౌలా గోల్డ్‌కప్- 2017 క్రికెట్ టోర్నీకి రాష్ట్ర జట్టులో ఇద్దరు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ చేకూరి వెంకట్, హెచ్‌సీఏ జిల్లా కోఆర్డినేటర్ ఎండీ. మసూద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన టీవీఎస్ నారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గుమ్మడి నిశాంత్ మెయినుద్దౌలా క్రికెట్ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వారు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులను ఎంపిక చేయడం పట్ల జిల్లా క్రికెట్ అసోసియేషన్ తరపున హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. వివేక్‌కు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

9న లోక్‌అదాలత్

జిల్లా న్యాయమూర్తి లక్ష్మణ్

ఖమ్మం లీగల్: లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతోందని జిల్లా న్యాయమూర్తి ఎం లక్ష్మణ్ తెలిపారు. సెప్టెంబర్ తొమ్మిదిన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఆయన పోలీసు అధికారులు, న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్‌అదాలత్ లో కేసులను పరిష్కరించే విషయంలో 2012కు ముందు కేసులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా మధిర, సత్తుపల్లి పరిధిలో ఎక్కువ కేసులు ఉన్నాయని, కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు తోడ్పాటు నందించాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి ఒకటోతేది నుంచి ముందస్తు లోక్ అదాలత్ ప్రక్రియ ప్రారంభమవుతుందని న్యాయమూర్తి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు ప్రేమలత, లలితకుమారి, బి. జ్ఞానేశ్వరరావు, ఎం. వెంకటరమణ, వినోద్‌కుమార్, అపర్ణదేవి, రహానా, గీతారాణి, సౌమ్య, ప్రాసిక్యూటర్లు, అదనపు డైరెక్టర్ రామారావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మణ్, హాజరైన ఇతర జడ్జిలు, పోలీసులు

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం చర్చికాంపౌండ్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఖమ్మంనగరంలో ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి కౌశల్‌కేంద్రంలో వివిధకోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పీఎంకేకే నిర్వాహకుడు ఎం.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎలక్ట్రీషియన్, నర్సింగ్, కాల్‌సెంటర్, టువీలర్ తదితర కోర్సుల్లో 18-34 ఏళ్లలోపు వారు 10వతరగతి ఆపై చదివిన వారికి అవకాశం ఉంటుందన్నారు. శిక్షణలో సాఫ్ట్‌స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ నేర్పుతారన్నారు. మహిళలకు బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆసక్తికలవారు 25లోపు దరఖాస్తుచేసు కోవాలని, వివరాలకు 9949947610 నెంబరులో సంప్రదించాలని కోరారు.

సూక్తి

మనకోసం చేసే పని మనతోనే అంతరించిపోతుంది. పరుల కోసం చేసేది శాశ్వతంగా నిలుస్తుంది.


జంబ్లింగ్ వర్డ్స్

1. LMIK ▸ ....
2. DYUT ▸ ....
3. ALTS ▸ ....
4 RCKO ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

ఔనా!

2007లో ఓ గూఢచర్యం కేసులో 14 ఉడతలను ఇరాన్ పోలీసులు అరెస్టు చేశారు.



పదాలు కనుక్కోండి



ASTER, CROCUS, DAFFODIL, DAISY, GERANIUM, HONEYSUCKLE, LAVENDER, LILAC, LILY, MARIGOLD, ORCHID, PANSY, SUNFLOWER, TULIP, VIOLET

దారి కనుక్కోండి



మీకు తెలుసా?



మీరు చంద్రుడి పైకి వెళితే.. మీరు మీ బరువులో 16.5 శాతమే ఉంటారు.

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

చెప్పగలరా?

మందులో ఉన్నా
కానీ ముందులో లేను
దాతలో ఉన్నా
కానీ పీతలో లేను
రంగులో ఉన్నా
కానీ చెంగులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

పాండాలకు ఓ ఆసుపత్రి



నలుపు, తెలుపు రంగుల్లో ముద్దుగా కనిపించే పాండాలంటే.. చాలామందికి ఇష్టం. పాండాలను అంతరించిపోతున్న జాతులలో ఒకటిగా గుర్తించారు. వీటిని పరిరక్షించడానికి పర్యావరణవేత్తలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే 'చైనా కన్జర్వేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ ది గెయింట్ పాండా (సీసీఆర్‌సీజీపీ) పనిచేస్తుంది. రోజు రోజుకీ తగ్గిపోతున్న పాండాల సంఖ్యను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో చైనా ప్రభుత్వం 'డుజియాంగ్యాన్' నగరంలో పాండాల కోసమే ప్రత్యేకంగా ఓ ఆసుపత్రిని 2012లో ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే తొలి పాండా ఆసుపత్రి.

జలుబు చేసినా.. జ్వరం వచ్చినా.. డాక్టరు దగ్గరకు వెళుతుంటాం. మరి పాండాలకు జబ్బు చేస్తే? అనారోగ్యంతో అవి బాధపడుతుంటే? అందుకే వాటికోసం ప్రత్యేకంగా ఓ ఆసుపత్రి ఉంది. అందులో పాండాలను ఎంతో బాధ్యతగా చూసుకుంటారు. ప్రతి రోజూ హెల్త్ చెకప్‌లు చేస్తారు.. మంచి భోజనాన్ని అందిస్తారు. ఇది పాండాల పునరావాస కేంద్రం కూడా. అంతేకాదు ఇక్కడ పాండాలపై పరిశోధనలు చేస్తారు.

పాండాలపై పరిశోధన చేసిన తొమ్మిదిమంది వైద్యులు ఈ హాస్పిటల్‌లో పని చేస్తున్నారు. ఈ వైద్య బృందం పాండాలకి ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. పాండాలు వ్యాధుల భారినా పడితే తక్షణమే వాటికి వైద్యం చేస్తారు. పాండాల సంతతిని అభివృద్ధి చెందేలా ఆసుపత్రి వైద్యులు కృషి చేస్తారు. అత్యున్నత సాంకేతిక వ్యవస్థ ఈ ఆసుపత్రిలో ఉంది. ఇది కేవలం పాండాల ఆరోగ్యాన్ని పరిరక్షించే ఆసుపత్రి మాత్రమే కాదు ఇది పాండాల ఉనికిని కాపాడే సంస్థగా కూడా పనిచేస్తుంది. ఈ ఆసుపత్రిలో మొత్తం 33 పాండాలు ఉన్నాయి. 'పాన్ పాన్' అనే పాండా అన్నింటికన్నా వయసులో పెద్దది. దాని వయసు 33 సంవత్సరాలు. పాండాల కోసం ఈ ఆసుపత్రి చేసిన కృషి వల్లే పాండాల సంఖ్య 17 శాతానికి పెరిగింది.

- పాండాల కోసం క్యారెట్లు, పాలు, కార్న్ బ్రెడ్ వంటి ఆహారపదార్థాల్ని అందిస్తారు.
- మనుషులతో ఎలా ప్రవర్తించాలో పాండాలకు చక్కగా నేర్పుతారు.
- అడవుల్లో ఒంటరిగా సంచరించే పాండాలను, ప్రకృతి వైపరీత్యాల వల్ల కష్టాల్లో పడిన పాండాలను ఆసుపత్రికి తీసుకు వచ్చి వాటిని సంరక్షిస్తారు.
- పాండాలకి ఇష్టమైన ఆహారం వెదురు చెట్లని తెలుసు కదా. పాండాల ఆహారం కోసమే ఆసుపత్రి యజమాన్యం వేల వెదురు చెట్లను పెంచుతుంది. పాండాలు హాయిగా అందులో విహరిస్తాయి. చక్కగా ఆడుకుంటాయి.



మీకు తెలుసా

- పాండా బరువు 100 నుంచి 120 కేజీల మధ్యలో ఉంటుంది.
- వీటి సగటు వయస్సు 20 సంవత్సరాలు.
- ఇప్పటి వరకూ 'బసి' అనే పాండా గరిష్ఠంగా 37 సంవత్సరాలు జీవించింది.
- పాండాలు తమ పిల్లలకి పాలిచ్చి పెంచుతాయి.
- ప్రపంచ వ్యాప్తంగా 1,864 పాండాలు మాత్రమే ఉన్నాయి.

జంతర్‌మంతర్

1. ష్యభవిత్తు ▸ ....
2. మాణంరాయ ▸ ....
3. వృఅభిద్ధి ▸ ....
4. సంవరంత్స ▸ ....


నవ్వుల్ నవ్వుల్

టీచర్ : కోడి మాంసాహరా? శాకాహారా?
బిట్టు : మాంసాహారికి ఆహారం టీచర్ !
టీచర్ : !!!!!!!!

జవాబులు

చెప్పగలరా? : మందారం
జంతర్‌మంతర్ : 1. భవిష్యత్తు 2. రామాయణం 3. అభివృద్ధి 4. సంవత్సరం
జంబ్లింగ్ వర్డ్స్ : 1. MILK 2. DUTY 3. SALT 4 ROCK

బొమ్మ గీయండి



రంగులు అద్దండి



‘కోల్’నాగులు!

రూ. కోట్లు కొల్లగొడుతున్న మాఫియా
దందాకు పెద్దల అండదండలు
ఇల్లెందు ట్రాన్స్‌పోర్ట్‌లో అదుపులేని దందా

ఇల్లెందు: నయాపైసా పెట్టుబడి లేదు. రాజకీయ నేతల ఆశీస్సులున్నాయి. పోలీస్, నక్సల్స్ అండదండలున్నాయి. కళ్లముందు ‘కోల్’పతరువు. ఇంకేముంది దందా సాగిస్తున్నారు. అడ్డూఅదుపులేకుండా కోల్ ట్రాన్స్‌పోర్ట్ పేరిట రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఏళ్ల తరబడి సాగుతున్న ఈ దందా మూలంగా లారీల యజమానులు విలవిలలాడుతున్నారు.

ప్రాణాలే ఫణంగా..

పగలూరేయీ తమ ప్రాణాలు పణంగా పెడుతూ భూగర్భంలోకి వెళ్లి కార్మికులు బొగ్గును వెలికితీస్తున్నారు. రూ.లక్షలు పెట్టుబడులు, ఫైనాన్స్‌ల అప్పులుతెచ్చి లారీలు, టిప్పర్లు కొనుగోలు చేసి వివిధ కంపెనీలకు యజమానులు బొగ్గును రవాణాచేస్తారు. వీరంతా ఈ స్థాయిలో కష్టపడినా అంతంతమాత్రంగానే ఆదాయం వస్తోంది. కోల్ ట్రాన్స్‌పోర్ట్ మాఫియా మాత్రం చెమట చుక్క రాల్చకుండా... అదిరింపులు, బెదిరింపులతో రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. పోలీసు అధికారులు, సింగరేణిలో కొన్ని విభాగాల సిబ్బంది, విలేకరులు, రాజకీయ నాయకులకు నెలవారీ ముడుపులు ముడుతుట్లు ఆరోపణలున్నాయి.

శ్రేయస్సును విస్మరించి..

ఇల్లెందు ఏరియా సింగరేణి బొగ్గుగనుల నుంచి ఉత్పత్తి జరిగిన బొగ్గును వివిధ ప్రాంతాల్లోని పారిశ్రామిక సంస్థలు, కంపెనీలకు ప్రైవేట్ లారీలు, టిప్పర్ల ద్వారా రవాణా చేస్తుంటారు. వీటి రవాణా వ్యయాన్ని ఆయా కొనుగోలు సంస్థలే భరిస్తుంటాయి. లారీలు, టిప్పర్లు యజమానుల సంక్షేమంతోపాటు లోడింగ్, అన్‌లోడింగ్‌లు, ట్రాన్స్‌పోర్ట్‌ల తరుణంలో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే పరిష్కరించుకోవాలన్న యోచనతో ఇల్లెందులో 20 ఏళ్ల క్రితం కోల్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అసోసియేషన్ బాధ్యులు క్రమేపీ లారీయజమానుల శ్రేయస్సును విస్మరించి అందినంత దండుకుంటున్నారు. ప్రశ్నించిన యజమానులను వివిధ రీతుల్లో వేధించడం, ప్రశ్నించిన వాళ్ళకు పర్మిట్లు లేకుండా చేస్తున్నారు. మామూళ్లు ఇవ్వాలంటూ, బ్రోకర్లు, గుమస్తాల పేరిట ఒక్కోలోడ్ లారీ నుంచి సగటున రూ.నాలుగు నుంచి రూ.పది వేలు దండుకుంటున్న తీరు ఆశ్చర్యం కలిగించకమానదు.

దందా జరుగుతోందిలా..

కోల్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ నేత తొలుత బొగ్గు దిగుమతి చేసుకునే కంపెనీ నుంచి లారీ కిరాయి ఖరారు చేసుకుంటాడు. అసోసియేషన్ ఖరారు చేసిన కిరాయిని లారీ, టిప్పర్లు యజమానులకు తగ్గిస్తాడు. వేరే కిరాయిని నిర్ణయించి వేలాది రూపాయలు కాజేస్తుంటాడు. ఉదాహరణకు ఒక లారీ(బొగ్గు దిగుమతి చేసుకునే కంపెనీ చెల్లించింది) భద్రాద్రి జిల్లా సరిహద్దునగల కుంటకు బొగ్గు రవాణా చేసినందుకు ట్రాన్స్‌పోర్టర్ కిరాయిగా రూ.22,500 చెల్లిస్తున్నాడు. అసోసియేషన్ నేత మాత్రం బండి కిరాయిగా కేవలం రూ.19,050లు మాత్రమే ఖరారు చేస్తుంటాడు. అసోసియేషన్ అధ్యక్షుడు పెట్టుబడిగా రూ.3,450 బ్రోకర్ కమీషన్‌గా రూ.750 తీసుకుంటాడు. బొగ్గు లోడింగ్ సింగరేణి కాలరీస్ సంస్థ ఉచితంగా చేస్తున్నప్పటికీ లోడింగ్ చార్జీల పేరిట రూ.300, ట్రాన్స్‌పోర్ట్ గుమస్తా మామూలుగా రూ.150 మినహాయించుకుంటున్నట్లు పేరు చెప్పేందుకు ఇష్టపడని ఒక లారీ యజమాని ‘ఆంధ్రజ్యోతి’తో వాపోయాడు. కేవలం ఇల్లెందుకు అతి సమీపంలో ఉన్న కుంట కిరాయి నుంచే ట్రాన్స్‌పోర్టర్‌కు, అసోసియేషన్ నేతకు రూ. 4,650 ముట్టజెపుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. 12 టైర్ల వాహనానికి రూ. ఐదువేల నుంచి రూ.పది వేలు దాకా మినహాయించుకుంటారు. సగటున 10టైర్ల వాహనానికి సంబంధించి అసోసియేషన్‌కు రూ.300, 12 టైర్ల వాహనానికి రూ.400, 14 టైర్ల వాహనానికి రూ.600 చొప్పున అసోసియేషన్‌కు చెల్లిస్తుంటారు. వీటికి సంబంధించి ఎలాంటి రశీదులు ఇవ్వకపోవడం గమనార్హం.

రూ.10వేల నుంచి 50వేల వరకు వసూలు

ఇల్లెందు నుంచి నిత్యం వంద నుంచి రెండు వందల లారీల బొగ్గు వివిధ ప్రాంతాలకు రవాణా జరుగుతుంటుంది. సభ్యత్వాల పేరిట ఒక్కో లారీ, టిప్పర్ యజమాని నుంచి రూ.10వేల నుంచి 50 వేల దాకా వసూలు చేస్తున్నారంటే కోల్ మాఫియా ఏస్థాయిలో దందా సాగిస్తుందో అర్థం చేసుకోవచ్చు. కొసమెరుపు ఏమిటంటే ఈ దందాకు కొమ్ముకాస్తున్న ఒక నక్సలైట్ పార్టీకి రూ.35వేలు,



ఇవే అసోసియేషన్ పేరుతో తెల్లకాగితాలపై జారీచేస్తున్న రశీదులు

లారీ అసోసియేషన్‌కు రూ. 40లు వసూలు చేస్తుండటం, ఈ రెండు రకాల వసూళ్లు ఒకే గుమస్తా ద్వారానే సాగిస్తుండటం గమనార్హం. స్థానిక వాహనాలకు రూ.250 చొప్పున, బయటి వాహనాలకు రూ. 500 చొప్పున చెల్లించిన తర్వాతే ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ నేతలు బొగ్గు లోడ్‌కు అనుమతిస్తుండటం గమనార్హం. స్థానిక లారీలకు బొగ్గు లోడింగ్ ప్రాధాన్యం ఇవ్వాలని ఎంతో కాలంగా స్థానిక వాహనాల యజమానులు కోరుతున్నా వారి గోడు పట్టించుకునే నాథులే కరువయ్యారు.

పెద్దల అండదండలు

‘కోల్’నాయకులకు అధికార పార్టీ ఎమ్మెల్యే ఆశీస్సులున్నట్లు ప్రచారం సాగుతోంది. పోలీసు అధికారులకు, ప్రెస్‌కు, వివిధ పార్టీల నాయకులకు నెలవారి మామూళ్లు ముట్టజెప్పడమేగాక ఏకంగా ఒక నక్సలైట్ గ్రూపు అండదండలతో రెచ్చిపోతున్నట్టు తెలుస్తోంది. గతంలో కోల్ ట్రాన్స్‌పోర్టులో తలెత్తిన వివాదాల తరుణంలో ఏకంగా లారీల యజమానులను అడవిలోకి తీసుకెళ్లి ఓ దళకమాండర్ సమక్షంలో బెదిరింపులకు గురిచేసినట్టు ఆరోపణలున్నాయి. గత ఏడాది ట్రాన్స్‌పోర్టర్ల మధయ తలెత్తిన వివాదాలను ఏకంగా ఓ డీఎస్పీ సమక్షంలో వివాదాన్ని పరిష్కరించుకొన్నట్టు సమాచారం. స్టాంపు పేపర్‌పై అగ్రిమెంట్ రాసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం కోల్ మాఫియా గతంలో నెలవారి మామూళ్లుగా డీఎస్పీకి రూ.50వేలు, సీఐకి, పోలీస్‌స్టేషన్‌కు రూ. 50 వేలు, ఒక్కో రాజకీయ పార్టీకి రూ.10వేలు, మీడియాకు ఏడాదికి రూ.లక్ష చొప్పున చెల్లిస్తున్నట్టు తెలుస్తోంది. అందుకు వాహనాల కిరాయిల నుంచి పెట్టుబడిగా వసూలు చేస్తున్న సొమ్మును వినియోగిస్తున్నట్లు అసోసియేషన్ నాయకులు పేర్కొంటుండటం గమనార్హం. తమకు ప్రశ్నించే శక్తిలేక అడిగింత ముట్టజెపుతూ మిన్నకుంటున్నామని కొందరు యజమానులు చెప్పడం గమనార్హం.

కష్టార్జితం కొల్లగొడుతున్నారు..

● లాడెన్ హబీబ్, లారీ యజమాని



తాత ముత్తాల నాటి నుంచి బొగ్గు రవాణా చేస్తున్నాం. పెరిగిన ఆయిల్ ధరలు, వేతనాలతో కనీసం బండ్ల నిర్వహణ వ్యయం కూడా చేతికందడంలేదు. ట్రాన్స్‌పోర్ట్ సంస్థలు చెల్లించే కిరాయిలు, బొగ్గు రవాణాచేసే లారీ యజమానికి చెల్లించడంలేదు. ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మా కష్టార్జితాన్ని కొల్లగొడుతున్నాడు.

ట్రాన్స్‌పోర్ట్ దందాతో నలిగిపోతున్నాం..

● ఎస్‌కే. మౌలానా, లారీ యజమాని



ఇల్లెందు కోల్ ట్రాన్స్‌పోర్ట్‌లో దోపిడీ పెచ్చుమీరుతుంది. క్రమపద్ధతి పాటించడంలేదు. అసోసియేషన్ సమావేశాలు ఉండవు. వసూలుచేస్తున్న డబ్బులకు రశీదులు ఇవ్వడంలేదు. నక్సలైట్లు, పోలీసులు, సింగరేణి సిబ్బంది, రాజకీయ పార్టీలు, ప్రెస్‌కు మామూళ్లు ఇవ్వాలంటూ ప్రతినె లా లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు.

దండుకుంటున్నారు...

బొర్రాజు రాములు, లారీయజమాని



అసోసియేషన్ అంటే సభ్యులందరికీ న్యాయం చేయాలి. వాహనాల నిర్వహణ భారంగా మారినందువల్ల కిరాయిలు పెంచడం, సభ్యులను ఆదుకోవాలి కానీ ఇల్లెందులో వాహనాల యజమానులనే అసోసియేషన్ దోపిడీ చేస్తుండటం శోచనీయం. ఒక్కోలోడ్‌కు వేలాది రూపాయలు వివిధ పేర్లతో వసూలు చేసుకుంటున్నారు. ఎవరికీ చెప్పుకోలేకపోతున్నాం.

పునరావాసంలో చేతివాటం

● అధిక ధరలకు సామగ్రి కొనుగోళ్లు ● ప్రశ్నించిన లబ్ధిదారులపై ఆగ్రహం
● పక్కదారి పట్టిన ప్రభుత్వసాయం ● ఎక్సైజ్ అధికారుల తీరుపై ఆరోపణలు

దుమ్ముగూడెం: ప్రభుత్వం కల్పించిన ఆర్థికసాయం లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరలేదు. డివిజన్ వ్యాప్తంగా గుడుంబా పునరావాస కల్పనా పథకా ల్లో అధికారుల చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలున్నాయి. లబ్ధిదారులకు అవసరంలేని సరుకులను కూడా అధి క ధరలకు కొనుగోళ్లు జరిపి యూనిట్ల ను అంటకట్టారనే ఆరోపణలున్నాయి. ఏమీచేయలేని స్థితిలో లబ్ధిదారులు యూనిట్లను తీసుకొని అంతర్గతంగా మదన పడుతున్నారు. యూనిట్ల కొనుగోలులో భారీగా కమీషన్లు చేతులు మారాయని తెలుస్తోంది.

అధిక ధరలకు కొనుగోళ్లు:

భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా యాభై మంది లబ్ధిదారులకు సంబంధిత పథకంలో భాగంగా వివిధ రకాల యూనిట్లు అందించినట్లు తెలుస్తోంది. ఏ ఒక్క యూనిట్‌తోనూ లబ్ధిదారునికి పూర్తిన్యాయం జరగలేదని సమాచారం. ప్రతీయూనిట్‌లోనూ రూ40 నుంచి రూ.50వేల వరకు లబ్ధిదారుడు ఆర్థికంగా నష్టపోయినట్లు తెలుస్తోంది.

ఎనిమిది యూనిట్ల మంజూరీ:

గుడుంబా ప్రభావిత పునారావాస పథకంలో భాగంగా మండలంలోని ఎనిమిది మందిని ఎంపిక చేశారు. ఎంపీడీవో, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ఎక్సైజ్ సీఐ కమిటీ సభ్యులుగా ఉన్నారు. నిరుపేద, వితంతు, పేదవర్గాలకు చెందిన ఐదు ఎస్టీ, రెండు బీసీ, ఒక ఎస్సీలను లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. గతంలో సారా కేసులున్నవారికి ప్రాధాన్యం కల్పించారు. ఐదు కిరాణాదుకాణాలు, ఒక గేదె, ఒక మేకలున్న యూనిట్లను అందజేశారు.

ఒక్కో యూనిట్ రూ. రెండు లక్షలు:

ఒక్కో లబ్ధిదారుడికి రూ2లక్షల యూనిట్‌ను ప్రభుత్వం పూర్తిఉచితంగా అందజేసింది. పథకం సాయంతో ఆర్థిక స్వయంసమృద్ధి సాధిస్తూ భవిష్యత్‌లో సారా అమ్మకాలు జరపకూడదు. అమ్మితే చర్యలు తీసుకునేందుకు ఒక్కోలబ్ధిదారుడి సంబంధించి ఇద్దరి నుంచి హామీ సంతకాలను కూడా తీసుకున్నారు. ఇన్ని నిబంధనలు విధిస్తున్న అధికారులు యూనిట్లు అందజేయడంలో మాత్రం చేతివాటం ప్రదర్శించారని విమర్శలున్నాయి.

కొనుగోళ్లన్నీ అనుమానాస్పదం..

భద్రాచలంలో పెద్ద ఎత్తున హోల్‌సేల్ కిరాణా దుకాణాలున్నాయి. మణుగూరు మండలం బండారుగూడెంలోని ఓ దుకాణాన్ని కొనుగోలుకు ఎంపిక చేశారు. లబ్ధిదారులందరినీ అక్కడకే తీసుకెళ్లారు. పైగా కిరాణా సరుకుల ఎంపిక ప్రక్రియలో లబ్ధిదారుడికి ఎటువంటి అధికారంలేదు. దుకాణాదారుడు ఇచ్చినవే సరుకులు. గుండుగుత్తాగా తన కిష్టమొచ్చిన సరుకులను అధిక ధరలకు అంటగట్టి రూ.రెండు లక్షలకు సరిపడా బిల్లులు చేతి కందించారు. ఈ సరుకులు మాకొద్దు అని తిరస్కరించే వాళ్లకు వెంట వెళ్లిన సిబ్బంది బెదిరింపులకు గురిచేశారు. వద్దంటే మీపేరును తొలగించి మరొకరికి యూనిట్ ఇస్తామనడంతో చేసేది లేక సరుకులు తీసుకొన్నామని లబ్ధిదారులు అంటున్నారు.

అక్కడైతేనే అరువిస్తారట!

ప్రభుత్వం ఇంకా డబ్బులు మంజూరు చేయలేదు.. ఈ దుకాణదారుడైతేనే మనకు అరువిస్తారు. ఇక్కడ తీసుకోవాల్సిందేనని కొనుగోలుకు వెళ్లిన ఒక ఎక్సైజ్ సిబ్బంది తెగేసిచెప్పడంతో లబ్ధిదారులు మారు మాటాడకుండా అంటకట్టిన సామాన్లను వెంట తెచ్చుకున్నారు. పైగా పూర్తిఉచితంగా వస్తుండడం కూడా ఒక కారణం. భద్రాచలంలో కొనుగోలు జరిపితే కిరాయిలు తగ్గడంతోపాటు, భవిష్యత్తు లావాదేవీలకు ప్రయోజనం కలిగేది. అయితే వీటన్నింటినీ పక్కనబెట్టి కేవలం కమీషన్ల కక్కుర్తితోనే బండారుగూడెం దుకాణాన్ని ఎంచుకున్నట్లు ఆరోపణలున్నాయి. పశువుల కొనుగోలులోనూ ధరల వ్యత్యాసం అధికంగా ఉండడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. అత్యధిక ధరల చెల్లింపులో ఆంతర్యం అర్థంకాక తలలు పట్టుకున్నారు. కాగా యూనిట్ల కొనుగోళ్లపై సమగ్ర విచారణ జరిపిస్తే భారీ ఎత్తున ముడుపుల బాగోతాలు బయటపడే అవకాశముంది.

ఎంపీడీవో వివరణ:

‘ఎంపిక ప్రక్రియ అంతా సవ్యంగానే జరిగింది. పథకం ఎక్సైజ్‌శాఖకు సంబందించింది కావడంతో కొనుగోళ్లలో వారిదే కీలక పాత్ర. మా తరపున ఐకేపీ ఏపీఎం వెళ్లారు. బిల్లులు సమర్పించిన అనంతరం విక్రయదారుల పేరిట చెక్కులను జారీచేశామని’ ఎంపీడీవో రమాదేవి వివరణ ఇచ్చారు.

జెన్కో ఇంటర్ ప్రాజెక్టు

క్రీడల ప్రారంభం



ప్రసంగిస్తున్న జెన్కో ప్రాజెక్టు డైరెక్టర్ రాధాకృష్ణ

కేటీపీఎస్(పాల్వంచ): పాల్వంచలోని కేటీపీఎస్ ఐదు, ఆరు దశల స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జెన్కో ఇంటర్ ప్రాజెక్టు టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కేటీపీఎస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న పోటీలను జెన్కో ప్రాజెక్టు డైరెక్టర్ రాధాకృష్ణ ప్రారంభించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ జెన్కోలో క్రీడలను ప్రోత్సహించేందుకు సంస్థ ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలోని విద్యుత్‌సౌధ, జూరాల, కేటీపీఎస్ ఓఅండ్ఎం, కేటీపీపీ, కేటీపీఎస్ ఐదు,ఆరు దశలనుంచి జట్లు తరలివచ్చాయి. స్పోర్ట్స్ కౌన్సిల్ అధికారి లోహితానంద్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో కేటీపీఎస్ ఓఅండ్ఎం, ఐదు, ఆరుదశల చీఫ్ ఇంజనీర్లు జాటోత్ సమ్మయ్య, టీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈలు కిషన్, ఎల్లయ్య, సంజీవయ్య, వరప్రసాద్, స్పోర్ట్స్ సెక్రెటరీ వీరస్వామి, కట్టా శ్రీధర్, వైవెంకటేశ్వర్లు, వైటీఎంకే రాజు, పీలే శ్రీనివాస్, పఠాన్‌ఖాన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న రాధాకృష్ణ

ఉపరితల గనులే కీలకం

- ఓసీ-4 విస్తరణ పనులు షురూ
- 1077 ఎకరాల అటవీభూమికి అనుమతులు
- ఓసీ-2 విస్తరణకు రానున్న అనుమతులు!
- వార్షిక లక్ష్యంలో 15 శాతం మణుగూరు నుంచే



మణుగూరు: సింగరేణి మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఓపెన్ కాస్టు గనులే కీలకపాత్ర పోషిస్తున్నాయి. 1976లో మణుగూరులో భూగర్భ గనులతో ఉత్పత్తిని ప్రారంభించిన సింగరేణి ఆ తర్వాత ఉపరితల గనులకే ప్రాధాన్యం ఇచ్చింది. పీకే-1, 2, 3 భూగర్భగనులను మూసివేసిన యాజమాన్యం ఓపెన్‌కాస్టు గనులపైనే ఆధార పడింది. ప్రస్తుతం కొండాపురం భూగర్భగని ఉన్నా అనుకున్న స్థాయిలో ఉత్పత్తి రావడం లేదు. దీంతో ఉత్పత్తి సాధనకు ఓసిలే ఆధారమయ్యాయి. ఓసి-2, 4 గనుల్లోనూ నిల్వలు నిండుకుంటున్న తరుణంలో యాజమాన్యం 11 సంవత్సరాల జీవితకాలంతో మణుగూరు ఓసీని కొత్తగా ప్రారంభించింది. కొండాపురం భూగర్భ గని నుంచి కూడా ఉత్పత్తి అక్ష్యాలను సాధించే చర్యలకు పూనుకుంది. వీటి నుంచి వచ్చే ఉత్పత్తి కూడా అక్ష్యాలను అధిగమించేందుకు సరిపోదన్న ఉద్దేశ్యంతో ఓసీ-2, 4 గనుల విస్తరణకు అవసరమైన అటవీభూముల అనుమతుల కోసం ప్రారంభించిన యత్నాలు కొలిక్కిరావడంతో గనుల విస్తరణ జరగనుంది.

ఓసీ-4 విస్తరణ పనులు షురూ

ఓసీ-4 గని విస్తరణకు సంబంధించి అటవీ భూమి 1,077 ఎకరాలకు జూన్‌లో అనుమతులు లభించడంతో యాజమాన్యం పనులను వేగిరం చేసింది. ఉత్పత్తికి ఆటంకంగా ఉన్న చెట్లను తొలగించే పనుల్లో నిమగ్నమైంది. వచ్చే ఏడాది నాటికి ఉత్పత్తిని ప్రారంభించే అవకాశాలున్నాయి. అయితే ఈ విస్తరణ గనిలో 350 లక్షల టన్నుల బొగ్గునిల్వలున్నాయి. సంవత్సరానికి 35 లక్షల టన్నులను వెలికి తీయనున్నారు. ఈ గని మరో పదేళ్లు నడవనుంది.

ఓసీ-2 గనికి త్వరలో అనుమతులు

ఓసీ-2 విస్తరణకు సంబంధించి అటవీభూములకు త్వరలో అనుమతులు రానున్నాయని అధికారులు తెలిపారు. ఈ గని విస్తరణకు 920 ఎకరాల అటవీ భూమి కావాలని యాజమాన్యం ప్రభుత్వానికి విన్నవించింది. ఈ విస్తరణ గనిలో 400 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఏడాదికి సుమారు 50 లక్షల టన్నుల బొగ్గును వెలికితీయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ అంచనాల ప్రకారం ఈ గని జీవిత కాలం తొమ్మిదేళ్లు ఉండే అవకాశం ఉంది.

- సింగరేణి లక్ష్యంలో 15 శాతం

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా లక్ష్య సాధనలో రికార్డులు నెలకొల్పుతూ.. ఎప్పుడూ తన ప్రత్యేకతను చాటుతోంది. ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా విషయాల్లో నూతన రికార్డులు సృష్టిస్తూ... తన స్థానాన్ని నిలబెట్టుకుంటోంది. సింగరేణి వార్షిక ఉత్పత్తి లక్ష్యాల్లో మణుగూరు ఏరియా 12 నుంచి 15 శాతం బొగ్గును అందిస్తూ దూసుకుపోతోంది.



మాట్లాడుతున్న రాజేష్

టీ-మాస్ జిల్లా సదస్సును జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా నేత రాజేష్

మణుగూరు రూరల్ : సామాజిక న్యాయం, తెలంగాణ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా కొత్తగూడెం క్లబ్‌లో 26న జరిగే టీ మాస్‌పోరం జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటి సభ్యుడు బండి రాజేష్ పిలుపు నిచ్చారు. మంగళవారం ఎస్‌ఎంఎస్, మల్లారం సివిక్ అడ్డాలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న అప్రజస్వామిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయలన్నారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన సంఘా ల, సంస్థల, ప్రజల ఆశయాలను నెరవేర్చ డంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో కార్మికులు మాధవరావు, కృష్ణయ్య, నవీన్, రవి, బాలకృష్ణ, సమ్మయ్య, లత, సీత తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల కలకలం

- ఓసీపీల పేరుతో భూపాలపల్లిలో దందా..
- కేటీకే 2వ గని ప్రహరీకి మావోయిస్టు పేరుతో వాల్‌పోస్టర్లు
- ఆరా తీస్తున్న పోలీసులు

భూపాలపల్లి, ఆంధ్రజ్యోతి: సింగరేణి ప్రాంతంలో వెలసిన మావోల వాల్‌పోస్టర్లు కలకలం రేపాయి. 30 ఏళ్లుగా భూనిర్వాసితులు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేవని, ఉద్యోగాలు అంతకంటే రావడం లేదని మావోయిస్టు కేకేడబ్ల్యూ కార్యదర్శి దామోదర్ పేరుతో వెలసిన వాల్‌పోస్టర్లలో ఆరోపించారు. మంగళవారం జయశంకర్‌జిల్లా భూపాలపల్లి పట్టణంలోని కేటీకే 2వ గని ప్రహరీపై ఈ పోస్టర్లు కనిపించాయి. కేకేడబ్ల్యూ కార్యదర్శి పేరున వెలిసిన ఈ వాల్‌పోస్టర్‌లో ప్రజలను మభ్యపెట్టి, అమాయకులైన ఎస్సీ, ఎస్టీల విలువైన భూములను లాక్కుని వారికి జీవనం లేకుండా చేశారని పేర్కొన్నారు. ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు కింద 1500ఎకరాలు తీసుకున్నారని, అందులో 100ఎకరాల భూ కుంభకోణం జరగ్గా.. నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ తూతూ మంత్రంగా విచారణ జరిపి ఎనిమిది మందిపై కేసు పెట్టి ఎందుకు రిమాండ్‌కు పంపలేదని ప్రశ్నించారు. ఇప్పుడు టీఆర్‌ఎస్ అధికారంలో ఉండి కూడా రైతులకు న్యాయం చేసిందేమీ లేదని పేర్కొన్నారు. స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ముగ్గురు కుమారులు మూడు ఊళ్లు పంచుకుతింటున్నారని ఆరోపించారు. నాడు ఓసీలు వద్దన్న కేసీఆర్ ఇప్పుడు ఓసీలు తీస్తూ ఊళ్లకు ఊళ్లు ఎందుకు బొందలు గడ్డలు చేస్తున్నారో తెలపాలని ఆ వాల్‌పోస్టర్‌లో పేర్కొన్నారు. ఓసీల మూలంగా జంగేడు, గడ్డిగానిపల్లి, ఆకుదారివాడ, శాంతినగర్, బాంబులగడ్డ పల్లెలన్నీ కనుమరుగయ్యే దుస్థితి నెలకొందని పోస్టర్లో తెలిపారు. ఉపాధి లేక రైతులు కూలీలుగా మారారని పేర్కొన్నారు. చల్లూరి సమ్మయ్య, మధు, బుర్ర రమేష్, సిద్ధు, చిన్న రాజయ్య భూకబ్జాలకు పాల్పడుతూ జనాన్ని భయపెడుతున్నారని ఇదివరకే చాలాసార్లు హెచ్చరించామని రాశారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోకపోతే శిక్ష తప్పదని ఆ వాల్‌పోస్టర్‌లో హెచ్చరించారు. అయితే ఈ పోస్టర్లు అసలివా..? నకిలీవా అనే చర్చ సాగుతోంది. వాల్‌పోస్టర్‌ను తొలగించి పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, మావోయిస్టుల పేరుతో సింగరేణి కేటీకే 2వగని ప్రహరీకి వాల్‌పోస్టర్ వెలువడం ఒక్కసారిగా పట్టణంలో కలకలం రేపుతోంది.



ప్రహరీకి వెలిసిన వాల్‌పోస్టర్

స్ఫూర్తిదాయకంగా స్వచ్ఛపక్వాడ్ నిర్వహణ

- సింగరేణి సీఎండీ శ్రీధర్



ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం : స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆగస్టు 16నుంచి 31వరకు 15 రోజులపాటు స్వచ్ఛపక్వాడ్ (పరిశుభ్రత పక్షోత్సవం) సింగరేణి సంస్థ ఏరియాల్లో స్ఫూర్తిదాయకంగా కొనసాగుతోందని సీఎండీ శ్రీధర్ తెలిపారు. స్వచ్ఛపక్వాడ్ నిర్వహణపై కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి సుశీల్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సింగరేణి సీ అండ్ ఎండీ ఎన్. శ్రీధర్‌తోపాటు సింగరేణి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా సీఎండీ శ్రీధర్ మాట్లాడారు. స్వచ్ఛపక్వాడ్‌లోలో భాగంగా అన్ని ఏరియాల్లోని కాలనీలు, హాస్పిటల్స్, ఓవర్ హెడ్ ట్యాంక్స్, కాలనీ డ్రైన్స్, స్కూల్స్ తదితర వాటి వద్ద పూర్తిగా చెత్తా చెదారం లేకుండా శుభ్రపరిచినట్టు పేర్కొన్నారు. మొక్కలను నాటడం, స్కూల్ పిల్లలతో ర్యాలీలు నిర్వహించడం, స్కూల్ పిల్లలకు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలను (స్వచ్ఛ్ పక్వాడా కార్యక్రమంపై) నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతీ ఏరియాల జనరల్ మేనేజర్లతో సహా అధికారులు, కార్మికులు, స్కూల్ పిల్లలు, పట్టణ ప్రజలు, కార్మిక సంఘాల నాయకులు, క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, కాలనీ వాసులు, మున్నగువారు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహిస్తున్నందుకు సింగరేణీయులందరినీ సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్. శ్రీధర్ అభినందిస్తూ ఇదే స్ఫూర్తిని ఇక ముందు కూడా కొనసాగించాలని తద్వారా పరిశుభ్ర భారత్‌కు సహకరించాలని కోరారు. ఈ సమీక్షలో సింగరేణి తరపున జీఎం కో-ఆర్డినేషన్ బి. కిషన్‌రావు ఉన్నారు.



స్వచ్ఛపక్వాడ్‌లో సింగరేణి ఉద్యోగులు(ఫైల్)

మహిళలతోనే కుటుంబాల అభివృద్ధి



పరీక్షాకేంద్రాన్ని సందర్శించిన జీఎం

ఇల్లెందుటౌన్: మహిళలు అభివృద్ధి చెందితేనే కుటుంబాలు వృద్ధిలోకొస్తాయని ఇల్లెందు ఏరియా జీఎం కందుకూరి లక్ష్మీనారాయణ అన్నారు. మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీషియన్ తదితర కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసిన మహిళలకు గ్రామోద్యోగ్ ఆధ్వర్యం లో స్థానిక వైసీవోఏ క్లబ్, జేకే కాలనీ సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను జీఎం సందర్శించి మాట్లాడారు. సింగరేణి సేవా సమితి ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కుట్టుశిక్షణ, మగ్గం వర్క్, బ్యూటీషియన్ తదితర రంగాల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన అనంతరం వివిధ బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవా కోఆర్డినేటర్ సత్యనారాయణపాసి, సుధాకర్, జమాలుద్దీన్ పాల్గొన్నారు.

గణేష్ మండపాల విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోవాలి: డీఈ

కొత్తగూడెం టౌన్: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు విద్యుత్ వినియోగానికి ముందస్తుగా సంబంధిత ఏఈ లేదా ఏఏఈల కార్యాలయాల్లో వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని డివిజనల్ ఇంజనీర్ ఎస్. మల్లికార్జున్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు మునిసిపాలిటీ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, టేకులపల్లి, జూలూరుపాడు, పాల్వంచ, ములకలపల్లి, ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, బయ్యారం మండలాల పరిధిలోని ఉత్సవ కమిటీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక కిలో వాట్‌కు రూ.1,406లు ఆపై 1.5కిలో వాట్ వరకు రూ.2,085లు, 1.5కిలో వాట్ నుంచి 2.0కిలో వాట్ వరకు రూ.2,745లు, ఆ పైన ప్రతి కిలో వాట్‌కు రూ.1,406ల చొప్పున చెల్లించాలన్నారు. డీడీ రూపంలో చెల్లించి రసీదు పొందాలన్నారు. అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తే సదరు ఉత్సవ కమిటీ, ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రైకార్ రుణాలు మంజూరు: ఎంపీడీవో

చంద్రుగొండ: ట్రైకార్ పథకం ద్వారా యువతకు జీవనోపాధి కల్పించేందుకు చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు 68 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబరు 15లోపు అర్హులైన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని, వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వెనుకబడిన వారిపై దృష్టిసారించాలి

● ఐటీడీవో ఏసీఎంవో రమణయ్య ● ఆశ్రమ పాఠశాలల సందర్శన

అశ్వారావుపేట రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని, మంచి ఫలితాలు సాధించకపోతే ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని ఐటీడీఏ భద్రాచలం ఏసీఎంవో రమణయ్య తెలిపారు. మండలంలోని సున్నంబట్టి, అనంతారం, భీమునిగూడెం ఆశ్రమ పాఠశాలలు, నెమలిపేట గిరిజన ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఏసీఎంవో ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను, భోజనాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. త్రీఆర్స్ బోధనతీరును పరిశీలించారు. ఆయన వెంట పీఎంఆర్‌సీ కోఆర్డినేటర్ జయబాబు, హెచ్ఎంలు మోహన్‌లాల్, కోటయ్య ఉన్నారు.

సామూహిక సెలవుకు వినతిపత్రం

సెప్టెంబరు ఒకటో తేదీన సామూహిక సెలవు కోరుతూ భద్రాచలం ఏసీఎంవో రమణయ్యకు మండల సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మండలంలోని అనంతారం ఆశ్రమ పాఠశాలకు వచ్చిన ఏసీఎంవోకు అందరికీ సెలవు మంజూరు చేయాలని


వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హీరాలాల్, డివిజన్ అధ్యక్షుడు చిట్టిబాబు, ఏటీఎఫ్ నాయకులు కృష్ణయ్య, మోహన్ లాల్, సీపీఎస్ సంఘం నాయకులు మురళీ, సైదులు, శ్రీను, రాఘవ, వెంకన్న, అక్కమ్మ, ఝాన్సీ, కృపావతి, మేరీ పాల్గొన్నారు.

విద్రోహ దినం పోస్టర్ ఆవిష్కరణ

చంద్రుగొండ: చంద్రుగొండలో ఉపాధ్యాయులు మంగళవారం పెన్షన్ విద్రోహ దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల కన్వీనర్ రవి కుమార్ మాట్లాడుతూ సెప్టెంబరు ఒకటిన చీకటి దినంగా భావిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరుగా గణనాథుల విక్రయాలు

● పలు ఆకారాల్లో ఆకర్షిస్తున్న విగ్రహాలు ● గణేష్ మండపాల ఏర్పాట్లల్లో నిమగ్నమైన నిర్వాహకులు


అమ్మకానికి సిద్ధంగా భారీ విగ్రహాలు


చంద్రుగొండలో బాహుబలి ఆకారంలో..


వినాయకపురంలో..

అశ్వారావుపేట, అశ్వారావుపేట రూరల్: గణపతి నవరాత్రి మహోత్సవాలకు ఉత్సవ కమిటీలు గణనాథుల విగ్రహాలను సిద్ధం చేస్తున్నాయి. 25వ తేదీన గ్రామల్లో, వాడవాడలా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజులు పూజలు చేయనున్నారు. పట్టణంలో, వినాయకపురంలో ఇతర రాష్ట్రానికి చెందిన వ్యాపారులు పలు ఆకారాల్లో గణనాథులను తయారుచేసి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. రంగురంగులతో ఉన్న విగ్రహాలు రూ.వెయ్యి నుంచి రూ.ఇరవై వేల వరకు ఉన్నాయని యజమానులు తెలిపారు. చవితి సమీపిస్తుండటంతో విగ్రహాల అమ్మకాలు ఊపందుకున్నాయి.

చంద్రుగొండ: నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తుండటంతో గణనాథుల విగ్రహాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పలు ఆకారాల్లో గణేష్ ప్రతిమలను రంగులతో తీర్చిదిద్ది విక్రయానికి సిద్ధంగా ఉంచారు. బాహుబలి సినిమాలో విధంగా శివ లింగాన్ని ఎత్తుతున్న వినాయకుని విగ్రహం పలువురిని ఆకర్శిస్తుంది.

అనుమతులు తీసుకోవాలి: ఎస్ఐ

ములకలపల్లి: వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని, ఊరేగింపులో తీసుకోవలసిన జాగ్రత్తలపై ములకలపల్లి ఎస్ఐ రవీందర్ పలు సూచనలు చేశారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో నిర్వాహకులతో సమీక్షించారు.

జాగ్రత్తల తర్వాతే టీకా వేయాలి

ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంక శాఖ సభ్యుడు గణేశ్‌నాయక్

అశ్వారావుపేట రూరల్: మిజిల్స్ రూబెల్లా టీకా వేసే సమయంలో సిబ్బంది పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంకశాఖ సభ్యులు గణేశ్‌నాయక్ సూచించారు. మండలంలోని గుమ్మడివల్లి, వినాయకపురం ప్రభుత్వ వైద్యశాలల ఆధ్వర్యంలో అశ్వారావుపేట, నారంవారిగూడెం, నందిపాడు, తిరుమలకుంట, నారాయణపురం, అనంతారం, కావడిగుండ్ల గ్రామాల్లో గ్రామాల్లో టీకాల కార్యక్రమం జరిపారు. దాదాపు పన్నెండు వందల మంది చిన్నారులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఈఎంఎం సభ్యులు గణేశ్‌నాయక్ పరిశీలించారు. టీకాలు వేసే సమయంలో చిన్నారులకు ఏమైనా ఇబ్బందులు కలిగితే సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల మందులను దగ్గర ఉంచుకొని చికిత్స నిర్వహించాలన్నారు. టీకా వేసిన తరువాత చిన్నారులకు గుర్తు పెట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్, హరీశ్, హెచ్ఎస్ శ్రీను, రమణారావు, హెచ్ఈవో రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న దృశ్యం

దమ్మపేట: మండల పరిధిలో జగ్గారం గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం ఎం ఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం వైద్యాధికారి డా.కిషోర్ ఆధ్వర్యంలో జరిగింది. టీకాలు వేయించుకోని వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌తోనే బడుగుల అభివృద్ధి

● ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

అశ్వారావుపేట టౌన్: కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తుమ్మా రాంబాబును అశ్వారావుపేట మండల కాంగ్రెస్ నాయకులు సాయిసుమన్ థియేటర్ వద్ద జరిగిన పార్టీ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ విస్తరణకు అహర్నిశలు కృషిచేస్తానని, తనపై ఉంచిన బాధ్యతను నెరవేరుస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ బీసీల ఉన్నతికి ఎంతో కృషిచేసిందని గుర్తుచేశారు. అందరి సూచనలతో ముందుకు వెళ్లానన్నారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, డీసీసీ అధ్యక్షుడు ఐతం సత్యంలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో నాయకులు సున్నం నాగమణి, బండి వీరరాఘవులు, మైనార్టీ, ఎస్సీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బాజీ, వేల్పుల నాగమహేశ్వరరావు, సంగ ప్రసాద్, కొప్పుల శ్రీను, జుజ్జూరు దుర్గారావు, దాసరి నాగేంద్రరరావు, పఠాన్ దావూద్, నూనె సత్యనారాయణ, శాఖా చక్రధరరావు, పూనెం వెంకటస్వామి పాల్గొన్నారు.


రాంబాబును సన్మానిస్తున్న దృశ్యం

వసతి గృహాన్ని తనిఖీ చేసిన డీడీ రామ్మూర్తి

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని మంగళవారం సాయంత్రం ట్రైబల్ వెల్ఫేర్ డీడీ సీహెచ్. రామ్మూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన బాలుర వసతి గృహ నిర్మాణానికి రూ.1.25 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. 3, 4, 5 తరగతులను సెప్టెంబర్ 1నుంచి ఆశ్రమ పాఠశాలగా మార్చి విద్యాబోధన చేస్తామన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట హాస్టల్ అధికారి రాంబాబు ఉన్నారు.

ఆయిల్ పాం సాగుతో అధిక దిగుబడులు

చంద్రుగొండ: ఆయిల్ పాం సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా బలపడొచ్చని ఉద్యానవన శాఖ అధికారి సందీప్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయిల్ పాం సాగుపై అవగాహన సదస్సు జరిగింది. ఆయిల్ పాం సాగు కోసం రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయిల్ పాం సాగు చేసే పలువురు రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఈజీఎస్ ఏపీవో ఉదయశ్రీ, ఏవో అనూష, గోద్రెజ్ ఆగ్రో వెట్ సీనియర్ అధికారి వి. కేశవ నారాయణ, ఎస్‌కే. సలాం, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ శిక్షణ పట్ల హర్షం

ములకలపల్లి: గ్రామాల్లో పని చేసే ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులను గుర్తించి ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ప్రకటించడం పట్ల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బండి కొమరయ్య మాట్లాడుతూ అర్హులైన గ్రామీణ వైద్యులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షులు తాహేర్, వైద్యులు బి. వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన బ్యాంకులు

ఉద్యోగుల సమ్మెతో వినియోగదారుల ఇక్కట్లు

అశ్వారావుపేట: కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల్లో చేపట్టిన సంస్కరణలను వ్యతిరేకిస్తూ జాతీయ స్థాయిలో బ్యాంకుల సమ్మె పిలుపు మేరకు మండలంలోని బ్యాంకులన్నీ మూతపడ్డాయి. ఉద్యోగులు విధులకు గైర్హాజరు అవ్వడంతో పట్టణంలోని రెండు ఎస్‌బీఐ, సహకార, పట్టణం, వినాయకపురంలోని ఆంధ్రాబ్యాంకులు, ఏపీజీవీ బ్యాంకులు పూర్తిగా మూతపడ్డాయి.


చంద్రుగొండలో మూతపడిన ఎస్‌బీఐ ఎదుట నిరీక్షిస్తున్న వృద్ధులు

చంద్రుగొండ: బ్యాంకులను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం చంద్రుగొండలో ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది చేపట్టిన సమ్మె విజయవంతమైంది. సమ్మెతో బ్యాంకు మూసివేశారు. దీంతో దూర ప్రాంతాల నుంచి పెన్షన్‌ల కోసం వచ్చిన వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గిరిజన ఉపాధ్యాయులకు 'సర్వీస్ రూల్స్' వర్తింపజేయాలి: ఏటీఎఫ్

అశ్వారావుపేట రూరల్: ఐటీడీఏ ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని ఏటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పద్దం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వాగొడ్డుగూడెం, రామన్నగూడెం, గోపన్నగూడెం, కావడిగుండ్ల, కన్నాయిగూడెం పాఠశాలల్లో మంగళవారం సభ్యత్వ నమోదును చేపట్టారు. పాఠశాలల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సున్నం నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కొర్రి వెంకటేశ్, మండల బాధ్యులు నారం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు కథల రామిరెడ్డి, చలమారావు, రవికుమార్, బాబురావు, కె.శ్రీను పాల్గొన్నారు.

నేడు వెంకయ్య స్వామి ఆరాధన

దమ్మపేట: మండల పరిధిలో మందలపల్లి క్రాస్ రోడ్డులోని వేంచేసి ఉన్న సాయిబాబా మందిరంలో భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధన కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక పూజలు, భజనలునిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?

మెంటల్ ఎబిలిటీ


1. ఒక కోడ్ భాషలో PEACEను FEDIUగా రాశారు. అదే కోడ్‌లో FAITH ను ఎలా రాస్తారు?
ఎ) IVLEK బి) KLEVI
సి) EIKLK డి) ఏదీకాదు
2. ఒక కోడ్‌లో GENIUSను TVJOFHగా రాశారు. అదే కోడ్‌లో NATUREను ఎలా రాస్తారు?
ఎ) OBUSVF బి) FSVUBO
సి) UBOVFS డి) ఏదీకాదు
3. ఒక కోడ్‌లో GOODను 76గా రాశారు. అదే కోడ్‌లో HEARను ఎలా రాస్తారు?
ఎ) 67 బి) 58 సి) 49 డి) ఏదీకాదు
4. ఒక కోడ్‌లో STUDENTను FPWDRRRగా రాశారు. అదే కోడ్‌లో TEACHERను ఎలా రాస్తారు?
ఎ) XCUGISC బి) SCXCUGI
సి) IGUCSCX డి) ఏదీకాదు

(5 - 7) ఒక కోడ్ భాషలో
nic sac tic అంటే all are good
sac mic mec అంటే good luck people
tic mec rac అంటే all people nice
పై కోడ్ భాష ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

5. sac నకు సరైన కోడ్?
ఎ) good బి) luck సి) are డి) ఏదీకాదు
6. rac నకు సరైన కోడ్?
ఎ) luck బి) nice సి) all డి) people
7. mec నకు సరైన కోడ్?
ఎ) all బి)good సి)people డి) luck
8. 10, 5.5, 6.5, 15, 64, ------
ఎ) 520 బి) 256 సి) 128 డి) 156
9. 600, 120, 30, 10, 5, ------
ఎ) 6 బి) 8 సి) 4 డి) 5
10. 68, 14, 85, 13, 93, 12, 89, ----
ఎ) 15 బి) 16 సి) 17 డి) 18
11. 5, 6, 11, 17, 28, 45, ------
ఎ) 73 బి) 75 సి) 78 డి) 81

(12 - 14) భిన్నమైన దానిని తెలపండి?

12. ఎ) LOP బి) KPO సి) TGW డి) IRM
13. ఎ) 347 బి) 819 సి) 628 డి) 529
14. ఎ) రాగి బి) తగరం సి) తుత్తినాగం డి) జింక్
15. FAME : GOCH :: KING : --------
ఎ) IPKM బి) IKMP సి) PMKI డి) ఏదీకాదు
16. గడియారంలో సమయం గం7.30నిలు అయింది. నిమిషాల ముల్లు ఈశాన్యాన్ని చూపిస్తోంది అనుకొంటే గంటల ముల్లు ఏ దిక్కును సూచిస్తుంది?
ఎ) పడమర బి) దక్షిణం సి) ఉత్తరం డి) తూర్పు
17. విజయ్ కాలేజీకి వెళ్లాలనుకొన్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు తూర్పున ఉంది. ఆ రోడ్డు కూడలికి వచ్చిన తరవాత ఎడమవైపున ఆడిటోరియం ఉంది. అతని ఇంటికి ఎదురు రోడ్డులో బ్యాంక్ ఉంది. అయితే కాలేజ్ ఏ దిశలో ఉంది?
ఎ) దక్షిణం బి) ఉత్తరం సి) పడమర డి) తూర్పు
18. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?



ఎ) 260 బి) 220 సి) 280 డి) 240
19. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?

L_8	N_4	M_{80}
M_4	L_3	N_{25}
N_6	M_8	?


ఎ) L_{100} బి) N_{80} సి) M_{60} డి) L_{120}



Panditi Meenakshi Pavan
Senior Faculty


Competitive Exams Special

20. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్య?



ఎ) 172 బి) 186 సి) 144 డి) 196
21. ఫొటోలో ఉన్న ఒక వ్యక్తిని చూపిస్తూ అజయ్ ఇలా చెబుతున్నాడు. 'అతను నా తల్లి తండ్రికి ఏకైక కుమారుని ఏకైక సోదరి భర్తకు కుమార్తె కొడుకు'. అయితే ఫొటోలోని వ్యక్తి అజయ్‌కు ఏమవుతాడు?
ఎ) మేనమామ బి) మేల్లుడు
సి) అల్లుడు డి) సోదరుడు
22. ఫొటోలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అవినాష్ ఇలా చెబుతున్నారు. 'అతను నా తండ్రి తల్లికి ఏకైక కుమారుడి సోదరి భర్త భార్యకు ఏకైక సోదరుడు.' అయితే ఫొటో లోని వ్యక్తికి అవినాష్ ఏమవుతాడు?
ఎ) అల్లుడు బి) సోదరుడు సి) తండ్రి డి) కుమారుడు
23. AA, BE, FI, OO, -------------
ఎ) EU బి) EV సి)FU డి) FV
24. AZ, CX, FT, JN, --------------
ఎ) DE బి) OF సి) FO డి)EP
25. TE, SF, QI, NN, ----------
ఎ) JU బి) KU సి) IV డి) TV
26. a - c - cbc - b - ca - cbab - a -
ఎ) babacac బి) baaabcc
సి) ababacc డి) ఏదీకాదు
27. aab - dab - cdabc - d - bc - d
ఎ) abcdc బి) bcdcd సి) cbcad డి) ఏదీకాదు
28. వికాస్ దక్షిణానికి 7మీ. నడిచిన తరవాత ఎడమ వైపునకు తిరిగి 9 మీటర్లు నడిచాడు. చివరకు మరల కుడివైపునకు తిరిగి 5మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వికాస్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 15 మీ నైరుతి బి) 15 మీ వాయవ్యం
సి) 15 మీ ఆగ్నేయం డి) 15 మీ ఈశాన్యం
29. ఒక వరసలో అనిల్ కుడివైపునుంచి 24వ స్థానంలోను, ఎడమవైపునుంచి 17వ స్థానంలోను ఉన్నాడు. అదే వరసలో సునీల్ ఎడమవైపు నుంచి 26వ స్థానంలో ఉంటే కుడి వైపు నుంచి సునీల్ స్థానమెంత?
ఎ) 15 బి) 18 సి) 16 డి) 19
30. ఒక వరసలో నిశాంత్ కుడివైపునుంచి 18వ స్థానంలోను, ఎడమవైపు నుంచి 13వ స్థానం లోను ఉన్నాడు. అదే వరసలో నిరంజన్ తన కుడివైపునకు 5 స్థానాలు జరిగాడు ప్రస్తుతం అతను ఎడమవైపు నుంచి 22వ స్థానంలో ఉన్నట్లయితే కుడివైపు నుంచి నిరంజన్ మొదటి స్థానం ఎంత?
ఎ) 16 బి) 14 సి) 18 డి) ఏదీకాదు
31. ఇంటర్వ్యూని నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 10 కంటే 15 నిలు ముందుగా వచ్చారు. ఈ మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ కంటే 30 నిలు ముందుగా వచ్చారు. ఛైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 45నిలు ముందు వచ్చారు. అయితే ఆయన ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించదలచారు?
ఎ) గం. 11.00ని. బి) గం. 11.02ని.
సి) గం. 11.15 ని. డి) గం. 11.30ని.
32. అజయ్‌కు అతని తల్లిదండుల పెళ్లి రోజు నవంబరు 11, 15ల మధ్య అని గుర్తు. అతని సోదరి ఆర్తికి నవంబరు 13, 17ల మధ్య అని గుర్తు. అయితే వారి తల్లి దండ్రుల పెళ్లి రోజు ఎప్పుడు?
ఎ) నవంబరు 15 బి) నవంబరు 13
సి) నవంబరు 14 డి) ఏదీకాదు
33. (36 X 1/4) of 4 ÷ 6 x 2 - 8+6ను సూక్ష్మీకరించండి?
ఎ) 36 బి) 10 సి) 42 డి) ఏదీకాదు
34. P అంటే ÷, Q అంటే x, R అంటే -, S అంటే + అయితే 36P4Q5R8S4 విలువ ఎంత?
ఎ) 41 బి) 39 సి) 45 డి) ఏదీకాదు
35. కింది వానిలో సరైన దానిని తెలపండి
ఎ) 18 ÷ 3 X 4 - 5 + 3 = 20
బి) 25 ÷ 5X 3 - 6 + 4 = 15
సి) 35 ÷ 7X 6 - 4 + 7 = 33 డి) ఏదీకాదు
36. SHIPCYS పదంలోని అక్షరాల స్థానాలను మార్చగా ఒక పార్యాంశం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి అక్షరం ఏమిటి?
ఎ) H బి) P సి) I డి) ఏదీకాదు
37. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్య ఏర్పడే పదాన్ని తెలపండి?
1. Mango 2. Music 3. Margin
4. Marble 5. Medium
ఎ) Music బి) Mango సి) Medium డి) Margin
38. ఈ రోజు నవంబరు 29 ఆదివారం. ఇది లీపు సంవత్సరమైతే మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?
ఎ) బుధవారం బి) గురువారం
సి) మంగళవారం డి) ఏదీకాదు
39. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదే వారం వచ్చే తదుపరి నెల ఏది?
ఎ) నవంబరు బి) డిసెంబరు
సి) జనవరి డి) ఏదీకాదు
40. గడియారంలో సమయం గం.2.30 నిలు అయితే గంటల ముల్లు, నిముషాల ముల్లు మధ్య కోణమెంత?
ఎ) 100^0 బి) 90^0 సి) 105^0 డి) ఏదీకాదు

(41-45)



పై రేఖాచిత్రంలో దీర్ఘచతురస్రం భారతీయులను, వృత్తం సైనికులను, త్రిభుజం పురుషులను సూచిస్తుంది. పై రేఖాచిత్రం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

41. భారతీయులైన పురుషులను సూచించే అక్షరం?
ఎ) C బి) G సి) F డి) ఏదీకాదు
42. భారతీయ సైనికులను సూచించే అక్షరం?
ఎ) G బి) D సి) E డి) ఏదీకాదు
43. పురుషులైన భారతీయ సైనికులను సూచించే అక్షరం?
ఎ) C బి) F సి) D డి) ఏదీకాదు
44. భారతీయులను సూచించే అక్షరం?
ఎ) F బి) B సి) A డి) ఏదీకాదు
45. కేవలం సైనికులను సూచించే అక్షరం?
ఎ) B బి) D సి) E డి) ఏదీకాదు
46. అద్దంలో చూసినపుడు సమయం గం.4.20 నిలు. అయితే అసలు సమయం?
ఎ) గం.7.30ని బి) గం7.40ని
సి) గం.8.40ని డి) ఏదీకాదు

సమాధానాలు

1) ఎ	8) ఎ	15) ఎ	23) ఎ	31) ఎ	39) బి
2) బి	9) డి	16) డి	24) బి	32) సి	40) సి
3) ఎ	10) సి	17) బి	25) ఎ	33) బి	41) సి
4) సి	11) ఎ	18) బి	26) బి	34) ఎ	42) బి
5) ఎ	12) సి	19) ఎ	27) సి	35) సి	43) ఎ
6) బి	13) డి	20) సి	28) సి	36) బి	44) బి
7) సి	14) సి	21) బి	29) ఎ	37) డి	45) సి
		22) డి	30) బి	38) ఎ	46) బి

JOBS ఉద్యోగాలు

బిహెచ్ఇఎల్

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బిహెచ్ఇఎల్)- టెక్నీషియన్ అప్రెంటిస్‌ల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 310
అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
క్యాంపస్: బిహెచ్ఇఎల్, ఇడిఎన్, బెంగళూరు
విభాగాలు: ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్/ సివిల్/ మెకట్రానిక్ ఇంజనీరింగ్
అర్హత: 2015 జనవరి 1 నాటికి సంబంధిత విభాగంలో డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: ఆగస్టు 1 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి.
ఇంటర్వ్యూలు పూర్తయ్యే తేదీ: ఆగస్టు 31
వేదిక: Bharath Heavy Electricals Limited, Electronics Division, Mysuru Road, Bengaluru - 560026
వెబ్‌సైట్: www. bheledn.com
www.bheldn.com

ఐఐటి మద్రాస్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)- జూనియర్ టెక్నీషియన్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 32
పోస్టులు - ఖాళీలు: రిజిస్ట్రార్ 1, సిస్టమ్స్ ఇంజనీర్ 1, సెక్యూరిటీ ఆఫీసర్ 1, జూనియర్ ఇంజనీర్ 3, స్టాఫ్ నర్స్ 4, జూనియర్ టెక్నీషియన్ 12, జూనియర్ అసిస్టెంట్ 10
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఇ/ ఎంటెక్(కంప్యూటర్ సైన్స్) + ఎనిమిదేళ్ల అనుభవం ఉండాలి లేదా 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్) + పదేళ్ల అనుభవం ఉండాలి.
వయసు: 27 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.100
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 8
దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
చిరునామా: The Assistant Registrar, Recruitment Section, Admin. Building(First Floor), IIT Madras, Chennai - 600036
వెబ్‌సైట్: www.recruit.iitm.ac.in

డిఆర్‌డిఒ

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ)- జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 11
అర్హత: ఫస్ట్ క్లాస్ మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ ఇన్ సైకాలజీ ఉత్తీర్ణత + నెట్ అర్హత పొంది ఉండాలి.
వయసు: 28 ఏళ్లు మించరాదు
స్టయిపెండ్: మొదటి రెండేళ్లు నెలకు రూ.25,000 మూడో ఏడాది నెలకు రూ.28,000 ఇస్తారు. హెచ్ఆర్ఏ + మెడికల్ ఫెసిలిటీస్ తోపాటు కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.15000 ఇస్తారు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు రూ.10ల ఇండియన్ పోస్టల్ ఆర్డర్‌ను జతచేసి కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 7
చిరునామా: Director DIPR, Lucknow Road, Timarpur, Delhi - 110054

గోవధ నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?


కొమ్ము సుందర్‌రాజు
పాలిటీ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

ఆదేశిక సూత్రాలు

1. ఆదేశిక సూత్రాలను రాజ్యాంగ నిర్మాతలు ఏ దేశం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) అమెరికా సి) బ్రిటన్ డి) రష్యా

2. ఆదేశిక సూత్రాల ముఖ్య లక్ష్యం?
ఎ) సామ్యవాద వ్యవస్థను ఏర్పాటు చేయడం
బి) సంక్షేమ రాజ్యస్థాపన(లేదా) శ్రేయోరాజ్య స్థాపన
సి) పెట్టుబడిదారి వ్యవస్థను రూపొందించడం
డి) కమ్యూనిస్ట్ వ్యవస్థను రూపొందించడం

3. ఆదేశిక సూత్రాలను ఐర్లాండ్ ఏ దేశం నుంచి స్వీకరించింది?
ఎ) రోమ్ బి) అమెరికా సి) స్పెయిన్ డి) రష్యా

4. ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలో ఎక్కడ పొందుపరిచారు?
ఎ) రెండో భాగం 5 నుంచి 11 ఆర్టికల్ వరకు
బి) మూడో భాగం 12 నుంచి 35 ఆర్టికల్ వరకు
సి) నాలుగో భాగం 36 నుంచి 51 ఆర్టికల్ వరకు
డి) 4(ఎ) భాగం, 51(ఎ) ఆర్టికల్

5. ప్రభుత్వ విధానాలను రూపొందించడం, వాటిని అమలులో వేటిని ప్రాథమికాలుగా భావిస్తారు?
ఎ) ప్రాథమిక హక్కులు బి) ప్రాథమిక విధులు
సి) ఆదేశిక సూత్రాలు డి) ఏదీకాదు

6. ఆదేశిక సూత్రాలకు చట్ట సంరక్షణ లేదు, వీటిని కోర్టుల ద్వారా అమలు పరచడానికి వీలు లేదు అని తెలిపే అధికరణం?
ఎ) 36వ బి) 37వ సి) 38వ డి) 39వ

7. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు వేటి ప్రభావ ఫలితం?
ఎ) సామ్యవాద భావాలు బి) ప్రాథమిక హక్కులు
సి) ప్రాథమిక విధులు డి) పైవన్నీ

8. మన రాజ్యాంగ పీఠికలో 'సామ్యవాద' అనే పదాన్ని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు?
ఎ) 1956, 7వ రాజ్యాంగ సవరణ
బి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
సి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

9. సామ్యవాదాన్ని అమలుచేయడానికి రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు?
ఎ) విధివిధానాలు బి) ప్రాథమిక విధులు
సి) ప్రాథమిక హక్కులు డి) ఆదేశిక సూత్రాలు

10. ఆదేశిక సూత్రాలను ఏ ప్రభుత్వమైనా విస్మరిస్తే వారు ఎన్నికల కాలంలో ప్రజల ముందు జవాబుదారీగా నిలవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది?
ఎ) గాంధీ బి) నెహ్రూ సి) పటేల్
డి) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

11. ఆదేశిక సూత్రాలు రాజ్యాంగ ప్రవేశికలో ఉదహరించిన ఆశయాలను పోలి ఉంటాయని అన్నది?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బి) బి.ఎన్.రావు
సి) ఎన్.గోపాలస్వామి డి) గాంధీజీ

12. ఆదేశిక సూత్రాలు శాసన వ్యవస్థకు కరదీపం వంటిదని పేర్కొనది?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బి) ఎన్.గోపాలస్వామి
సి) ఎం.సి.సెతల్వాడ్ డి) ఎవరూ కాదు

13. ఆదేశిక సూత్రాలను వాస్తవమైన మానసిక ప్రవృత్తుల చెత్తకుండీ అని ఎవరు అన్నారు?
ఎ) ఎం.సి.సెతల్వాడ్ బి) కె.ఎం.మున్షీ
సి) ఎం.సి.చాగ్లా
డి) ఎన్.గోపాలస్వామి అయ్యంగార్

14. భారత ప్రభుత్వం నిర్దేశిక నియమాలను నిజాయతీగా అమలుచేస్తే భారతదేశం ఒక భూతల స్వర్గం అవుతుందని పేర్కొనది?
ఎ) గాంధీ బి) ఎం.సి.చాగ్లా
సి) అంబేద్కర్ డి) ఎం.సి.సెతల్వాడ్

15. బలహీనవర్గాల విద్య, ఆర్థిక స్థితిగతులు మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపే నిబంధన?
ఎ) 44వ బి) 45వ సి) 46వ డి) 47వ

16. ఆదేశిక సూత్రాల్లో ఏ అధికరణం గ్రామపంచా యతీల ఏర్పాటును సూచిస్తుంది?
ఎ) 40 బి) 41 సి) 42 డి) 43

17. స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలి అని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 38 బి) 39 సి) 39(డి) డి) 39(ఇ)

18. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ఏ రాష్ట్రానికి వర్తించవు?
ఎ)జమ్మూకశ్మీర్ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) సిక్కిం డి) అస్సాం

19. గోవధను నిషేధించిన రాష్ట్రాలు?
ఎ) ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్
బి) ఆంధ్రప్రదేశ్, కర్ణాటక
సి) తమిళనాడు, జమ్మూకశ్మీర్
డి) మహారాష్ట్ర, తెలంగాణ

20. గోవధ నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
ఎ) 46వ బి) 47వ సి) 48వ డి) 49వ

21. మత్తుమందులు, మత్తు పానీయాలను నిషేధించి ప్రజారోగ్యాన్ని సంరక్షించాలి అని తెలిపే అధికరణం?
ఎ) 39వ బి) 47వ సి) 48వ డి) 50వ

22. సంపూర్ణ మద్యపాన నిషేధం అమల్లో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కర్ణాటక
సి) తెలంగాణ డి) గుజరాత్

23. ఒకే శిక్షాస్మృతి అమల్లో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కేరళ సి) గోవా డి) తెలంగాణ

24. కార్మికులకు కనీస వేతనం, కనీస పనిగంటలు కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 41వ బి) 42వ సి) 43వ డి) 44వ

25. మహిళలకు ప్రసూతి సౌకర్యం కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 42వ బి) 43వ సి) 44వ డి) 45వ

26. దేశంలోని పౌరులందరికీ ఒకే శిక్షాస్మృతిని అమలు చేయాలని తెలిపే అధికరణం?
ఎ) 40వ బి) 44వ సి) 50వ డి) ఏదీకాదు

27. ఆరేళ్లలోపు బాలబాలికలకు అందించే బాలబడి విద్యను ఏ రాజ్యాంగ సవరణ ద్వారా 45వ అధికరణంలో చేర్చారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1956, 7వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

28. చారిత్రక కట్టడాలను, ప్రదేశాలను సంరక్షించాలని, జాతీయ వస్తువులను పరిరక్షించాలని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 48వ బి) 49వ సి) 50వ డి) 51వ

29. ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఆదేశిక సూత్రాల్లో అదనపు సూత్రాలను చేర్చారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 2001, 85వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

30. యువతీయువకులు, బాలబాలికలు దురలవాట్లకు లోనుకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని తెలిపే నిబంధన?
ఎ) 39(ఎ) బి) 39(ఇ) సి) 39(ఎఫ్) డి) 39వ

31. రాజ్యాంగంలో ఏ అధికరణం నిరుద్యోగ భృతిని కల్పించాలని తెలుపుతుంది?
ఎ) 40వ బి) 41వ సి) 42వ డి) 43వ

32. వృద్ధాప్య పెన్షన్ ఏ అధికరణం ప్రకారం కల్పించాలి?
ఎ) 40వ బి) 41వ సి) 42వ డి) 43వ

33. ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధాప్య పెన్షన్‌ను కల్పించిన మొదటి ముఖ్యమంత్రి?
ఎ) కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బి) నీలం సంజీవరెడ్డి
సి) వై.ఎస్.రాజశేఖరరెడ్డి డి) ఎన్.టి.రామారావు

34. ఆదేశిక సూత్రాలకు సంబంధించి ఆర్టికల్ 41లో లేనిది?
ఎ) ఆశ్రయ హక్కు బి) పని హక్కు
సి) విద్య హక్కు
డి) ప్రభుత్వ సహాయ హక్కు

35. ప్రపంచ శాంతికి కృషి చేయడం, అంతర్జాతీయ శాంతిభద్రతలను పెంపొందించుకోవాలని తెలిపే అధికరణం?
ఎ) 50వ బి) 51వ సి) 51(ఎ) డి) ఏదీకాదు

36. పేదలకు ఉచిత న్యాయసహాయం గురించి తెలిపే అధికరణం?
ఎ) 38వ బి) 39వ సి) 39(ఎ) డి) 43(ఎ)

37. యుపిఎ ప్రభుత్వం ఏ అధికరణం ప్రకారం 100 రోజుల ఉపాధి హామీ పథకాన్ని కల్పించింది?
ఎ) 41వ బి) 42వ సి) 43వ డి) 44వ

38. వెట్టిచాకిరి నిరోధక చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
ఎ) 1973 బి) 1974 సి) 1975 డి) 1976

39. నిరుద్యోగ భృతిని అందిస్తున్న రాష్ట్రాలు?
ఎ) పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్
బి) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ
సి) కర్ణాటక, తమిళనాడు డి) మహారాష్ట్ర, బీహార్

40. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వికలాంగులకు ఎంత పెన్షన్ ఇస్తున్నారు?
ఎ) రూ.500 బి) రూ.1000
సి) రూ.1200 డి) రూ.1500

41. వికలాంగులకు భృతిని కల్పిస్తున్న రాష్ట్రాలు?
ఎ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, సిక్కిం
బి) మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా
సి) గోవా, కేరళ, నాగాలాండ్ డి) పైవన్నీ

42. నిర్దేశిక నియమాలు రాజ్యాంగానికి ప్రాణవాయువు వంటివి అని అన్న దౌత్యవేత్త, న్యాయకోవిదుడు ఎవరు?
ఎ) ఎల్.ఎం.సింఘ్వి బి) కె.టి.షా
సి) ఎం.సి.సెతల్వాడ్ డి) ఎవరూ కాదు

43. ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కుల కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు?
ఎ) 1956, 7వ రాజ్యాంగ సవరణ
బి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
సి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

44. యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 39వ బి) 39(ఎ) సి) 43(ఎ) డి) 48(ఎ)

45. ఆదేశిక సూత్రాలను మూడు రకాలుగా వర్గీకరించిన పరిపాలన శాస్త్రవేత్త?
ఎ) ఎం.పి.శర్మ బి) జి.ఎన్.జోషి
సి) ఎ, బి డి) ఎవరూ కాదు

46. అడవులు, అటవీ జంతువుల సంరక్షణకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని తెలిపే అధికరణం?
ఎ) 39(ఎ) బి) 43(ఎ) సి) 48(ఎ) డి) 50

47. వ్యవసాయం, పశుగణాభివృద్ధిని శాస్త్రీయ పద్ధతుల్లో అభివృద్ధి చేయాలని తెలిపే అధికరణం?
ఎ) 48వ బి) 48(ఎ)వ సి) 49వ డి) 50వ

48. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌరులకు పౌష్టికాహారం అందించాలని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 46వ బి) 47వ సి) 48వ డి) 49వ

సమాధానాలు

1) ఎ 2) బి 3) సి 4) సి 5) సి 6) బి 7) ఎ
8) బి 9) డి 10) డి 11) ఎ 12) సి 13) డి 14) బి
15) సి 16) ఎ 17) సి 18) ఎ 19) ఎ 20) సి 21) బి
22) డి 23) సి 24) సి 25) ఎ 26) బి 27) డి 28) బి 29) ఎ 30) సి
31) బి 32) బి 33) డి 34) ఎ 35) బి 36) సి 37) ఎ 38) సి 39) ఎ
40) డి 41) ఎ 42) ఎ 43) బి 44) సి 45) సి 46) సి 47) ఎ 48) బి

అడ్మిషన్స్

బిఐఆర్ఇడి

హైదరాబాద్ రాజేంద్ర నగర్‌లోని బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (బిఐఆర్ఇడి)- గ్రామీణ యువకుల కోసం ఉచిత స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.
శిక్షణాంశాలు: మొబైల్ సర్వీసింగ్/ యంయస్ ఆఫీస్/ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్ / ఎలక్ట్రీషియన్ & వ్యవసాయ పంపుసెట్ రిపెయిర్
అర్హత: శిక్షణాంశాన్ని అనుసరించి పదోతరగతి/ ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 19 నుంచి 30ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.
శిక్షణ కార్యక్రమాల తేదీలు: సెప్టెంబరు 13 నుంచి నవంబరు 7 వరకు
ప్రస్తుతం చదువు కొనసాగిస్తున్నవారు, బిఇడి/ ఇంజనీరింగ్/ ఎంబిఏ/ ఎంసిఏ పూర్తిచేసినవారు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.
వెబ్‌సైట్: www.bired.org

JOBS ఉద్యోగాలు

ఐటిబిపిఎఫ్

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటిబిపిఎఫ్)- సబ్ ఇన్‌స్పెక్టర్ (ఓవర్‌సీర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21(పురుషులకు 18, మహిళలకు 3 పోస్టులు కేటాయించారు)
వయసు: సెప్టెంబరు 22 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
అర్హత: మెట్రిక్యులేషన్ + డిప్లొమా(సివిల్) ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక: రిక్రూట్‌మెంట్ టెస్ట్, మెడికల్ ఎగ్జామ్ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 23 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 22
వెబ్‌సైట్: www.recruitment.itbpolice.nic.in

పారదీప్ పోర్ట్ ట్రస్ట్

పారదీప్ పోర్ట్ ట్రస్ట్ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 8
పోస్టులు: చీఫ్ మేనేజర్ 4, సీనియర్ మేనేజర్ 2, మేనేజర్ 2
విభాగాలు: ఇన్ఫర్మేషన్/ కమ్యూనికేషన్ & ట్రేడ్ ఫెసిలిటేట్/ఎన్విరాన్‌మెంట్ & సేఫ్టీ/ బిజినెస్ డెవలప్‌మెంట్ & ట్రేడ్ ప్రమోషన్/ కార్పొరేట్ రిలేషన్ & కమ్యూనికేషన్స్
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 19
చిరునామా: Secretary, Paradip port Trust, Administrative Building, Paradip - 754142, Jagatsinghpur Dt, Odisha
వెబ్‌సైట్: www.paradipport.gov.in

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబిబిఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

ప్రభుత్వ ఉద్యోగులు.. వృత్తినైపుణ్యం పెంచుకోవాలి

● ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించండి ● శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

పాల్వంచ టౌన్: ప్రభుత్వ ఉద్యోగులు వృత్తినైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తద్వారా ప్రజలకు సమర్థవంతంగా, పారదర్శకంగా సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు 'ఈ లెర్నింగ్ మాడిఫైడ్ మాడ్యూల్స్'పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులు ఎక్కువ, తక్కువ అన్న భావనను విడనాడి కలిసిమెలిసి విధులు నిర్వహించినట్లైతే కార్యాలయంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యాలయ సిబ్బందికి అధికారులు స్ఫూర్తిగా ఉండాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పరిపాలన మారుతూ ఉంటుందని, మార్పులను నేర్చుకుని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. వృత్తిలో క్రమశిక్షణ చాలా అవసరమని, పాలనా యంత్రాంగం కొందరు వ్యక్తులకే పరిమితమైంది కాదని అన్నారు. అవసరమైన అంశాలు ఎదుటి వారికి అర్థమయ్యేలా సూటిగా చెప్పాలని, అటువంటి చొరవ అధికారి తీసుకోవడం వల్ల ఇతరులకు ప్రేరణగా నిలుస్తామన్నారు. ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ కలిగి ఉండాలని, విధుల్లో తాత్సారం లేకుండా ఎప్పటి పనులను అప్పుడే నిర్వహించడం వల్ల పని భారం తగ్గుతుందన్నారు. బుధవారం జరిగే శిక్షణ కార్యక్రమాల్లో రెండో స్థాయి అధికారులు హాజరు కావాలని, గురువారం అన్ని సంక్షేమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులకు శిక్షణ కార్యక్రమంఉంటుందని తెలిపారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మాడ్యూల్స్‌కు సంబంధించిన వివరాలను వివరించారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులు

పుస్తక ఆవిష్కరణ...

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'సామాజిక ఆర్థిక ముఖచిత్రం-2017 నిన్నటి నేపథ్యం.. రేపటి సంకల్పం' పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ పుస్తకంలో రాష్ట్రానికి చెందిన సమగ్ర సమాచారం ఉన్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు ఈ పుస్తకాలను అందుబాటులో ఉంచాలని గిరిజన సంక్షేమశాఖ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రణాళికాశాఖ కార్యాలయంలో పుస్తకం అందుబాటులో ఉందని, రూ. 150 చెల్లించి ఎవరైనా కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి బాలశౌరి, జిల్లా విద్యాశాఖాధికారి హయగ్రీవచారి, డీఆర్‌డీవో జగత్ కుమార్ రెడ్డి, ఈడీఎం లక్ష్మణరావు, జిల్లాస్థాయి రిసోర్స్‌పర్సన్ చావా శ్రీనివాసరావు, తహసీల్దార్ గనియా, ఎంపీడీవో ధన్‌సింగ్, కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ టి. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భాద్రపద మాసోత్సవాలు ఇలా..

● 13న శ్రీ వైష్ణవ కృష్ణ జయంతి

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో భాద్రపద మాసంలో జరపాల్సిన ఉత్సవాలకు సంబంధించి నివేదికను దేవస్థానం ఈవో ప్రభాకర శ్రీనివాస్‌కు వైదిక కమిటీ అందజేసింది. ఈ నెల 25న వినాయక చవితి, 26న చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం నిర్వహించనున్నారు. సెప్టెంబరు 13న శ్రీ వైష్ణవ కృష్ణ జయంతి సందర్భంగా శ్రీ కృష్ణ ఆవిర్భావ మహోత్సవం, లాలలు, జోలలు జయంతోత్సవం నిర్వహించనున్నారు. 14న ఉట్ల ఉత్సవం, తిరువీధి సేవ నిర్వహించనున్నారు. సెప్టెంబరు 15న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని పునర్వసు సేవ నిర్వహించనున్నారు. 16న శ్రీరామ పట్టాభిషేకం, లక్ష కుంకుమార్చన చేయనున్నారు. ఇదిలాఉండగా.. గణేష్ నిమజ్జనోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 27, 29, 31, సెప్టెంబరు 2, 3 తేదీల్లో భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగ్గ రీతిలో ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.



భద్రాద్రి రామాలయం

తాలిపేరు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

● 3,990 క్యూసెక్కుల నీరు విడుదల

చర్ల: ప్రాజెక్టు ఎగువభాగంలో కురుస్తున్న వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టులోకి వరదనీరు వస్తోంది. దీంతో మంగళవారం ఉదయం ప్రాజెక్టు 25 గేట్లలో 3 గేట్లు రెండు అడుగుల మేర ఎత్తి 3,996 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు వద్ద ప్రస్తుత నీటి మట్టం 73.20 మీటర్లు గా ఉంది. ఏఈ వెంకటేశ్వర్లు ఎప్పటి కప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాగా సోమవారం ప్రాజెక్టు లోకి ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గిపోయింది. గేట్లు కూడా అన్ని దించేశారు. మంగళవారం తెల్లవారుజామున ఛత్తీస్‌గఢ్‌లో భారీగా వర్షం కురిసింది. దీంతో వరద నీరు ప్రాజెక్టులోకి పోటెత్తింది. ఫలితంగా అధికారులు మళ్లీ మూడు గేట్లు ఎత్తారు.

ఎక్కడి ఉత్తరాలు అక్కడే!

● నిరవధిక సమ్మెలో జీడీఎస్ ఉద్యోగులు ● వెలవెలబోతున్న తపాలా కార్యాలయాలు
● నిలిచిపోయిన బట్వాడా, పార్సిళ్ల పంపిణీ ● సమస్యలు పరిష్కరించేవరకూ విరమించం: సిబ్బంది



అశ్వారావుపేటలో సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

అశ్వారావుపేటరూరల్/కొత్తగూడెంటౌన్: సాంకేతిక ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతున్నా.. తపాలా వ్యవస్థ ప్రాధాన్యం తగ్గటం లేదు. ప్రభుత్వ పథకాల అమలులో భాగస్వామ్యం.. రోజుకో పథకంతో ప్రజల్లో ప్రత్యేకతను చాటుకుంటనే ఉంది. ఇందులో క్షేత్రస్థాయి సిబ్బందికి పని అధికంగా ఉంటుంది. ఈతరుణంలో రోజుకు పది గంటల పాటు పని, అరకొర వేతనం, అమలకు నోచని పెన్షన్ స్కీంతో ఇబ్బందిపడుతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తపాలశాఖలోని గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) ఉద్యోగులు 16తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టటంతో సేవలకు అంతరాయం ఏర్పడింది.

ప్రధాన డిమాండ్లు ఇవే..

ఏఐజీడీఎస్‌యూ సూచించిన సవరణలతో సహా జీడీఎస్ పే కమిటీ రిపోర్టును వెంటనే అమలుచేయటం, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేస్తూ సర్వెంట్ హోదాను కల్పింటచం, ఢిల్లీ, చెన్నై క్యాట్ కోర్టులు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఉద్యోగ విరమణ పొందిన జీడీఎస్‌లకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించటం, టార్గెట్ల పేరుతో వేధింపుల నుంచి విముక్తి కలిగించాలనే ప్రధాన డిమాండ్లతో సమ్మెను చేపట్టారు. విధుల్లో చేరుతున్న సమయంలో నాలుగు గంటల పనిఅని చెప్పి ప్రస్తుతం రోజుకు పది గంటల వరకు పనులు చేయిస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.8వేల నుంచి రూ.11వేల వేతనం అందిస్తున్నారని, ఉద్యోగ విరమణ సమయంలో గ్రాట్యూటీ, ఎక్స్‌గ్రేషియా కింద కేవలం రూ.1.20లక్షల మాత్రమే చెల్లిస్తున్నారని చెబుతున్నారు. పూర్తిస్థాయి ఉద్యోగులు విరమణ చేసినప్పుడు రూ.25లక్షల వరకు చెల్లిస్తున్నారని, తమకు ఇలాంటి పథకాలను వర్తింపజేయాలనే డిమాండ్లతో సేవలకు సెలవు ప్రకటించారు.

సమ్మెబాటన 600మంది..

2016 నవంబర్‌లో కమలేష్ చంద్ర కమిటీ జీడీఎస్ ఉద్యోగుల జీతభత్యాలపై కేంద్రానికి నివేదికను అందించింది. దీనిపై అప్పట్లో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేయటంతో యూనియన్ సూచించిన సవరణలతో పాటు ఉద్యోగులకు అనుకూలంగా సిఫారసులను అమలుచేస్తామని తెలిపారు. తర్వాత విస్మరించడంతో ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలంలో ప్రధాన తపాలా కార్యాలయాలు ఉన్నాయి. ఖమ్మం పరిధిలో 37, కొత్తగూడెం పరిధిలో 18, భద్రాచలం పరిధిలో 21 ఉప తపాలా కార్యాలయాలు ఉన్నాయి. రెండు జిల్లాల గతంలో 576 తపాలా కార్యాలయాలు ఉండగా.. కొత్తగా 73చోట్ల బ్రాంచ్‌లు ఉన్నాయి. ముంపు మండలాల్లో దాదాపు యాభై గ్రామీణ తపాల కార్యాలయాలు ఆంధ్రాలో కలవగా ప్రస్తుతం 549 గ్రామీణ తపాలా కార్యాలయాల ద్వారా సేవలు అందుతున్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు 1,100 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం దాదాపు 900 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో ఏఐజీడీఎస్‌యూ పిలుపు మేరకు ఈనెల 16వ తేదీ రెండు జిల్లాల్లో 600 మంది వరకు సమ్మెబాట పట్టారు. ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఏడో రోజుకు చేరింది.

పేరుకుపోయిన ఉత్తరాల మూటలు

ప్రస్తుతం తపాలశాఖల ద్వారా ఎస్‌బీ, ఆర్‌డీ, రూరల్ పోస్టల్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధియోజన, ఉపాధి కూలీల వేతనాల చెల్లింపులు, ఆసరా పింఛన్ల పంపిణీ, ఉత్తరాల బట్వాడా, ఆన్‌లైన్ బుకింగ్, స్పీడ్ పోస్టు, పాన్‌కార్డు, ఏటీఎం కార్డులు, రిజస్టర్ లెటర్ ఇలా రకరకాల సేవలను తపాలాశాఖ ఉద్యోగులు అందిస్తున్నారు. సిబ్బంది సమ్మెతో నాలుగు వందల వరకు తపాలా కార్యాలయాలు తెరుచుకోకపోవడంతో ఉత్తరాల మూటల పేరుకుపోయాయి.

సమ్మె విరమించే ప్రసక్తే లేదు..
- సుబ్రమణ్యేశ్వరరావు, ఏఐజీడీఎస్‌యూ, కొత్తగూడెంబ్రాంచ్ అధ్యక్షుడు



తపాలశాఖలో ఉద్యోగులు నాలుగు గంటలే పనిచేయాలనే నిబంధనలు ఉన్నా రోజుకు పదిగంటలు కష్టపడుతున్నాం. అయినా ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్నాం. గతంలో వేసిన కమిటీ సిఫార్సులు అమలుచేయాలి.

తక్కువ వేతనాలతో ఇబ్బందులు..
- దుర్వాసరావు, గౌరవ అధ్యక్షుడు



నిరంతరం శ్రమించినా పనికి తగ్గ వేతనం రావటం లేదు. దీంతో కుటుంబాలు గడవటమే ఇబ్బందిగా ఉంది. పనికి తగ్గ వేతనాన్ని ఇచ్చి కిందిస్థాయి ఉద్యోగుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి. అందరు ఉద్యోగుల మాదిరిగానే సదుపాయాలు కల్పించాలి.

ఎదురుచూపులు మళ్లీ వెక్కిరింపేనా..
- ఎ.ఎ. ఖాన్, జీడీఎస్ బ్రాంచి సెక్రటరీ



ఎన్నో ఏళ్ల తరబడి సమస్యల పరిష్కారం కావాలని ఎదురుచూస్తు అనేక దఫాలుగా సమ్మెబాట పట్టినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈసారైన జీడీఎస్ సేవలను ప్రభుత్వం గుర్తించాలి. సమస్యలు పరిష్కరించాలి.

సేవలకు గుర్తింపేది..
- టి. నర్సింహారావు, జీడీఎస్ సిబ్బంది సర్వారం



తపాలాశాఖ సేవలు భిన్నంగా ఉంటాయి. తప్పకుండ నిత్యం పట్టణస్థాయి నుంచి గ్రామస్థాయిలో ప్రజలకు భట్వాడా చేరవేయడంలో బాధలను భరిస్తునే ఇప్పటివరకు నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించాలి.

జానపదం.. జనపదం

● పల్లె సంస్కృతికి దర్పణం ● మట్టి మనుషుల కళాతృష్ణకు సజీవ సాక్ష్యం





జానపద నృత్యాలు చేస్తున్న కళాకారులు



పాటలు పాడుతున్న కళాకారులు

ఇల్లెందు: 'టపటప.... టపటప.... చెమటబొట్టు తాళాలైపడుతుంటే... కరిగిన కండరాల నరాలే స్వరాలు కడుతుంటే... పాట పనితోపాటే పుట్టింది... పనీ పాటతోనే జతకట్టింది... ఆగడాల ఆగడీల దిన గండపు ఏలుబడిలో మెడలువంచి దొరమేన పదిలంగా మోయువేల.. పదపద బిరబిర అపాదమస్తకం చలిస్తూ అహోం ఒహోం అను ఆయాసమే అయినదిరా... జానపదం' అన్నాడు ఒక ప్రజాకవి. మంగళవారం జానపద వారోత్సవాలు ప్రారంభమైన సందర్భంగా ప్రత్యేక కథనం.

జానపద కళల లోగిలి...

జానపద కళల లోగిలి ఉమ్మడి ఖమ్మం జిల్లా. సబ్బండ వర్గాల ప్రజలు అపాదమస్తకం స్పందించే శక్తి కలిగిన జానపదాలకు నేటికీ జై కొడతారు. ఉత్సాహం ఉరకలు వేసే శక్తి కలిగిన జానపదాలకు ఈ ప్రాంతం ప్రతీకగా నిలిచింది. యాస, భాషలు కలబోసిన జానపదాలు నేటికీ సజీవంగా ఉన్నాయి. పాశ్చాత్య నాగరికత, సంగీత వాయిద్యాల హోరులో డీజే డిస్కోల మత్తెకించే, ఘైమరిపించే పాటలను సైతం ఎదుర్కొంటూ జానపదాలు నేటికీ అలరారుతున్నాయి. ప్రత్యేకించి తెలంగాణ ఉద్యమ సమయంలో శక్తివంతమైన ఆయుధాలుగా రూపుదాల్చయనడంలో అతిశయోక్తి లేదు.

ఇరు జిల్లాల్లో గిరి ప్రాంతాలు అధికం..

●ఇరు జిల్లాలో పల్లెలు, గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్నాయి. కాకతీయుల కాలంలో విశేష ప్రాచుర్యం పొంది ప్రధానంగా పురుషులతో యుద్ధ నైపుణ్యాల ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న పేరిణి శివ తాండవం రూపకం విశేష ఆదరణ పొందుతోంది.

●గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ ప్రజానీకం ప్రదర్శించే రేలారె రేలా నృత్యాలు, ఆదివాసీ నృత్యాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దీపావళి తరుణంలో రాజ్‌గోండులు గుస్సాడి దండారి నృత్యాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

●జంబు పురాణం ద్వారా వెలుగులోకి వచ్చిన చిందు భాగోతాలు, నాటకాలు దళితుల ఆదరణ పొందుతున్నాయి. ప్రధానంగా బుర్ర కథలకు విశేష ఆదరణ లభించింది. స్వాతంత్రోద్యమం కాలం నుంచి నేటి వరకు సమకాలీన సమస్యలను ప్రతిబింబించే ఇతి వృత్తాలతో కేవలం కథకుడు, ఇరువురు వంతలతో కూడిన ముగ్గురు కళాకారులు ప్రదర్శించే బుర్ర కథలు ప్రాచుర్యం పొందుతున్నాయి.

●యాదవులు, కురుమ గొల్లలు ఆరాధించే ఒగ్గు కథలు సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమ దేవతలైన మల్లన్న, బీరప్ప, ఎల్లమ్మ దేవతల కొలుపులు ఇతివృత్తాలుగా ఒగ్గు కథలు ఆదరణ పొందుతున్నాయి. అదే విధంగా గౌడ సామాజిక వర్గంలో చైతన్యాన్ని పెంపొందించేందుకు జెట్టీలు ప్రత్యేక జానపద కళారూపాలు ప్రదర్శిస్తుంటారు. మతపరమైన పద్యాలు, కథలు, సంగీత వాయిద్యాలతో హరికథ కలాపాలు సైతం ఆదరణ పొందుతున్నాయి.

పుడితొక్కటి.... సత్తె రెండు

రాజిగో ఒరే రాజిగో... ఎత్తుర తెలంగాణ జెండా రాజిగో ఒరే రాజిగో..

తెలంగాణ పల్లెల్లో పొద్దే పొడిసెరో.. నగాదారిలో, పోరు నడిసెరో తెలంగాణలో....

ఆపొద్దు ఎవరంటే జయశంకరుడే నగాదారిలో... జనభాంధవుడే తెలంగాణలో........

కొట్టుర కొట్టు డప్పుల మీద నిప్పుల దండోరా..తెలంగాణ సిన్నోడా... నీ ఆటపాటకు పల్లె సీమలు ఊగిసలాడాలా... ఉద్యమం ఉధృతమయ్యేలా... కత్తిని మించిన కంఠాన్ని ఎత్తి పాడర ఇయ్యాలా.... వీరుల త్యాగాలా.... అంటూ తెలంగాణ పోరులో జానపద కళాకారుల ఆటపాటలు ఉగ్రూతలూగించడం మనందరికీ తెలిసిందే.

రాష్ట్రసాధనలో కీలక పాత్ర

రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జానపద కళారూపాలను, కళాకారులకు తెలంగాణలో ఆదరణ లభిస్తోంది. ఉద్యమాలకు ఊపిరి పోసిన కళాకారులను ఆదరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఉద్యోగ అవకాశాలు కల్పించింది. విద్యార్హతలు లేనప్పటికీ తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొనడం, ఏదైనా కళారూపాలను ప్రదర్శించిన 550 మంది కళాకారులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించింది. ప్రతీఏటా రూ. 18కోట్లు వేతనాలుగా చెల్లిస్తోంది. తెలంగాణ సాంస్కృతిక సారథి పేరిట ప్రత్యేక సాంస్కృతిక జానపద కళారూపాల పరిరక్షణ వేదికను ఏర్పాటు చేసి రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 157 కోట్లు కేటాయించడం విశేషం.



ప్రభుత్వం ప్రోత్సహించాలి
పమ్మి రవి, జానపద కళాకారుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

జానపద కళలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఈ కళలు రోజురోజుకు ఆదరణ కోల్పోతున్నాయి. గ్రామీణ కళలైన జానపద కళలను ప్రోత్సహించడం మంచిది. గ్రామీణ సంస్కృతిని బతికించినవారవుతారు.




పల్లె జీవనానికి ప్రతిరూపం
నంద్యాల నాగేశ్వరరావు

జానపద కళలు పల్లె జీవనానికి ప్రతిరూపాలు. పల్లె సంస్కృతి సాంప్రదాయాలను జానపదంతోనే ఎక్కువగా ప్రసిద్ధి చెందాయి. ప్రభుత్వాలు జానపద కళాకారుల్ని ప్రోత్సహించాలి. కళాకారులను గుర్తించి ప్రాచుర్యంలోకి తేవాలి.

సంసారాల్లో సెల్‌చిచ్చు!

● బంధువులకు ఇచ్చారో అంతే సంగతులు
● విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు
● మిస్సింగ్, కిడ్నాప్ కేసుల్లో నిందితులయ్యే ప్రమాదం
● జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు



తెలిసిన వ్యక్తులకు.... స్నేహం కొద్దో... చుట్టరికానికనో మీ సెల్‌ఫోన్‌లు మాట్లాడేందుకు ఇచ్చారో... తరువాత జరిగే పరిణామాలకు బాధ్యులు కాకతప్పదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

- కొత్తగూడెం క్రైం

సెల్ చిచ్చు రేపింది..

ఒక యువతి, పెళ్లయిన వ్యక్తితో మే 18వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తమ కూతురు కనిపించకుండా పోయిందని ఆ యువతి తల్లి చుంచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భర్త కనిపించకుండా పోయాడని అతడి భార్య వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మూడు నెలలుగా ఈ ఇద్దరు కనిపించకుండా పోయేసరికి పోలీసులు ఈ కేసును తీవ్రంగా పరిగణించారు. ఈ క్రమంలోనే ప్రతీ నెలా నిర్వహించే మిస్సింగ్ కేసుల రివ్యూ సమావేశాల్లో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వచ్చింది.

ఫోన్ ట్రాప్ చేస్తే...

పోలీసులు మిస్సింగ్ అయిన యువకుడి సెల్‌ఫోన్‌ను ట్రాప్ చేశారు. ఆ యువకుడు వెళ్లే సమయంలో తన వెంట వెళ్లిన మరో యువతితో మే 17వ తేదీన సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు సంభాషించినట్టు తేలింది. ఆచూకీ లేకుండా పోయిన ఆ యువకుడు వెళ్లే సమయంలో యువతితో మాట్లాడిన ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలిగారు. యువతి పెద్దమ్మ (అమ్మ వాళ్ల అక్క) ఇంటికి చుట్టరికంగా వచ్చి తరచూ ఆ ఇంట్లో ఉండే వదిన సెల్‌ఫోన్‌తో తన ప్రేమికుడితో మాట్లాడేది. పెద్ద ఖరీదైన సెల్ కాకపోవడంతో వాళ్లు ఎవరితో మాట్లాడుతున్నారో.... పెద్దగా పట్టించుకోలేదు. ఆ యువతి వెళ్లే సమయంలో మాట్లాడిన ఫోన్ నెంబర్ ఆధారంగా నెంబర్ కనుక్కున్న పోలీసులు యువతి, వ్యక్తితో వెళ్లే సమయంలో మీ ఫోన్ నుంచే గంటల తరబడి మాట్లాడారని వారిరువురి ఆచూకీ చెప్పాలని హుకుం జారీ చేశారు. లేనిపక్షంలో వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. సదరు వ్యక్తి చివరిసారిగా ఎక్కువసార్లు మాట్లాడిన నెంబర్ వారిదేనంటూ ట్రాపింగ్ ద్వారా సంపాదించిన ఫోన్ లిస్టును వారి ముందు ఉంచారు. చెల్లి కూతురు కదా అని ఇంటికి రానిచ్చినందుకు తనను, తన కొడుకును, కోడలిని ఆ యువతి ఇలా పోలీస్‌స్టేషన్ పాలు చేస్తుందని వారి కలలో కూడా ఊహించి ఉండరు.

అపరిచిత ఫోన్‌కాల్‌తో..

రమేష్ (పేరు మార్చాం) ఒక కారు డ్రైవర్. తాను కారు డ్రైవింగ్ చేసే క్రమంలో సుదూర ప్రాంతాలకు వెళ్లేవాడు. ఈ సమయంలో ఒక యువకుడిని సొంత తమ్ముడిలా భావించి ఇంటికి రానిచ్చాడు. ఇదే అదునుగా భావించిన ఆ యువకుడు రమేష్ భార్య ఫోన్ నెంబర్ సంపాదించాడు. దీంతో రమేష్ లేని సమయంలో ఆమెతో తరచూ పరిచిత వ్యక్తిలా మాట్లాడే వాడు. అనుమానం వచ్చిన రమేష్ తీరా కూపీ లాగారు. తీరా వారి ఇంట్లో భారీ ఎత్తున చోరీ జరిగింది. ఇంట్లో ఉండే బంగారం కొత్తగా ఏర్పడిన పరిచయస్థుడికే రమేష్ భార్య ఇచ్చేసింది. ఇంట్లో ఉన్న బంగారం కనిపించకుండా పోయే సరికి రమేష్ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ కేసులో రమేష్ భార్య, నమ్మకంగా ఇంటికి తీసుకువచ్చిన వ్యక్తే దొంగలని తేలింది. ఇరువురిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఒక నమ్మకం... ఒక కొత్త స్నేహం పండంటి కాపురాన్ని చీల్చింది. రమేష్ తన భార్యను పుట్టింట్లో వదిలివేయగా, స్నేహానికి ద్రోహం చేసిన వ్యక్తి ఊచలు లెక్కిస్తున్నాడు. రమేష్ ఇద్దరు పిల్లలు తల్లి ప్రేమకు దూరంగా ఉంటున్నారు.

ఇలాంటివి మరెన్నో....

స్నేహం పేరుతో స్నేహితులకి ఫోన్ నెంబర్, ఫోన్ మాట్లాడించడాలు చేయడం వల్ల వారు ఏ వ్యక్తికి...ఎందుకు ఫోన్ చేస్తున్నారో... తెలియక.. కొన్ని అసభ్య సందేశాలు, చిత్రాలు పంపిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. ఇలా జరిగినపుడు తమకు తెలియదని ఎంత వారించినా ఇది చట్టవ్యతిరేకం కాబట్టి పోలీసులు ఈ విషయంలో ప్రత్యక్షంగా వాడిన ఫోన్ నెంబర్ నుంచి వచ్చిన మేసేజ్ ఆధారంగా కేసులు కూడా నమోదు చేశారు.

పెడదారులు..

కొందరు ఆకతాయిలు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లతో కాకుండా.... వేరొకరి సెల్‌ఫోన్లతో కొత్త స్నేహాలను పరిచయం చేసుకోవాలని... వారి నెంబర్ సంపాదించి...ఆపై అదే ఫోన్‌తో సంభాషణలు సాగిస్తున్నట్లు తెలియవచ్చింది. ఇది తెలియని కొందరు తాము స్నేహం కోసం ఏదో చేస్తున్నామనే తలంపుతో ఉంటున్నారు.

చివరి సందేశాలకు కూడా....

కొందరు జీవితంపై విరక్తితోనో... ఇంట్లో నుంచి వెళ్లి పోయే సందర్భంలోనో... చివరిసారిగా వారు మాట్లాడిన ఫోన్ నెంబర్‌లు కూడా తల మీద కుంపటిలా మారుతున్నాయి. ప్రేమ విఫలమయ్యో... ఇంట్లో నుంచి వెళ్లి పోయే సందర్భంలో వారు చివరి సారిగా మాట్లాడిన మాటలు ఫోన్ ట్రాకింగ్‌లో తెలియడంతో కొన్ని సందర్భాల్లో ఫోన్ రిసీవ్ చేసుకున్న వ్యక్తులు సైతం ఇబ్బందులు పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

ప్రేమ పెళ్లిళ్లకు దారి తీసే వ్యవహారాలు..

కొందరు యువతి, యువకులు ప్రేమించుకోవడాలు... ఈవిషయం ఇంట్లో వారికి తెలియడం... అనంతరం వారిని ఇంటి వద్దే ఉంచడంతో... అవకాశం కోసం ఎదురు చూస్తూ.... ఉన్న వీరు సైతం బతిమాలో.. బామాలో... ఫోన్ తీసుకుని మాట్లాడి... తరువాత ఎంచాక్కా చెక్కేసినా సందర్భాలు కూడా లేకపోలేదు. మొహమాటాలకు వెళ్లి ఫోన్ మాట్లాడిస్తే... జరిగే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో.... ఏదైనా ఒక సంఘటనలో బాధ్యులైతే తప్ప తెలియని పరిస్థితి.



ఖమ్మంలో.. ఆర్చరీ అకాడమీ..!

● స్థలాలు పరిశీలించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు
● త్వరలో తాత్కాలిక శిక్షణ కేంద్రం ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - ఖమ్మం) జిల్లా కేంద్రమైన ఖమ్మంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు కాబోతోంది..! ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు స్థలాలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఖమ్మంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేయాలని పలువురు క్రీడాకారులు రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి దృష్టికి తీసుకెళ్లడంతో.. ఖమ్మంలో అకాడమీ ఏర్పాటు చేయాలని కేంద్ర క్రీడల సంక్షేమ శాఖ మంత్రికి, జాతీయ స్పోర్ట్స్ అథారిటీ అధికారుల దృష్టికి రేణుకాచౌదరి తీసుకెళ్లారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటు ఏజన్సీ ప్రాంతం, ఇటు మైదాన ప్రాంతం కలిసి ఉండటంతోపాటు ఖమ్మంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేయడం ద్వారా సరిహద్దు జిల్లాలు, రాష్ట్రాల క్రీడాకారులకు కూడా మెరుగైన శిక్షణ కల్పించే అవకాశం ఉంది. ఈ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో అంగీకారం తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత, ఆర్చరీ హైదరాబాద్ సాయ్(స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) అకాడమీ కోచ్ ప్రణీత తదితరులు ఖమ్మం వచ్చి స్థానిక డీవైఎస్‌వో పరంధామిరెడ్డిని కలిశారు. ఖమ్మంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన స్థలాలను డీవైఎస్‌వో సూచించారు. సీక్వెల్ పక్కన ఉన్న ఖాళీస్థలంతోపాటు, కేంద్రీయ విద్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని ఆయన సూచించారు. అలాగే తాత్కాలికంగా ఆర్చరీ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు సర్దార్ పటేల్ స్టేడియంలోని మైదానంలో కొంత స్థలాన్ని, అలాగే స్టేడియానికి ఎదురుగా రేణుకాచౌదరీ క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న ఎన్నెస్పీ ఖాళీ స్థలాన్ని కూడా పరిశీలించారు. ఇందుకు అనువైన స్థలాన్ని గుర్తించి అకాడమీ ఏర్పాటు చేయడం జరుగుతుందని 'సాయ్' అకాడమీ అధికారులు వెల్లడించారు.



డీవైఎస్‌వో కార్యాలయంలో సాయ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్


కలెక్టర్, ఎమ్మెల్యేతో సమావేశం...

సాయ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత, కోచ్ ప్రణీత, కలెక్టర్ లోకేష్‌కుమార్, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌తో సమావేశమయ్యారు. ముందుగా డీవైఎస్‌వో కార్యాలయంలో ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి చర్చించారు. క్రీడాకారులకు కావాల్సిన వసతి సౌకర్యాన్ని తాత్కాలికంగా సర్దార్ పటేల్ స్టేడియంలోని అకాడమీలో ఏర్పాటు చేస్తామని, ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సీక్వెల్ వద్ద ఉందని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ, కార్పొరేషన్ వైస్‌చైర్మన్ మురళీ, కార్పొరేటర్లు, ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సారంగపాణి, పుట్టా శంకరయ్య తదితరులు కలిసి సీక్వెల్ పక్కనున్న ఖాళీస్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తే అన్ని విధాలా సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. అనంతరం సాయ్ అధికారులు రేణుకాచౌదరి కార్యాలయం పక్కన ఉన్న రెండెకరాల ఎన్నెస్పీ ఖాళీస్థలాన్ని పరిశీలించారు. ఆర్చరీ కేంద్రం ఏర్పాటుకు వసతులను కూడా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ లోకేస్‌కుమార్‌ను కలిసి ఖమ్మంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన స్థలం తదితర విషయాలపై చర్చించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని జిల్లా యువజన, క్రీడా అభివృద్ధి అధికారి పరంధామిరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కేంద్రీయ విద్యాలయం పక్కన ఉన్న స్థలాల గురించి జిల్లా యువజన క్రీడాధికారులతో చర్చించారు.



రేణుకాచౌదరి క్యాంపు కార్యాలయం పక్కన ఎన్నెస్పీ స్థలాన్ని పరిశీలిస్తున్న సాయ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత, కోచ్ ప్రణీత

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..
పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే



ఖమ్మంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. సీక్వెల్ వద్ద రెండెకరాల స్థలాన్ని కేటాయిస్తాం. తాత్కాలిక వసతులకు చర్యలు తీసుకుంటాం. ఖమ్మంలో ఈ అకాడమీ ఏర్పాటుకు రెండేళ్లుగా కృషి చేస్తున్నాం.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..
శ్రీలత, సాయ్ డిప్యూటీ డైరెక్టర్

ఖమ్మంలో అకాడమీ ఏర్పాటుకు సంబంధించి కేంద్రం నుంచి మాకు ఆదేశాలు వచ్చాయి. ఇందుకు అవసరమైన స్థలాన్ని పరిశలించి ప్రతిపాదనలు పంపిస్తున్నాం. 50 మంది క్రీడాకారులకు ఉచిత వసతితో, పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. తాత్కాలికంగా శిక్షణ కేంద్రాన్ని త్వరలో ఏర్పాటుచేసి, పూర్తిస్థాయి భవనాలు నిర్మించనున్నాం. 50 శాతం కేంద్రం, 50 శాతం రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంటుంది.

జిల్లా ఆర్చరీ అసోసియేషన్ హర్షం..

ఖమ్మంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేస్తుండడంపట్ల జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సారంగపాణి, పుట్టా శంకరయ్య హర్షం వ్యక్తంచేశారు. ఈ అకాడమీ జిల్లాలోని క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

తడపడం.. ఆరబెట్టడం..

● వరి సాగునీటి యజమాన్యంలో కొత్తపద్ధతి
● డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు



ఖమ్మం వ్యవసాయం: వరి పంటకు నీటిని వినియోగం ఎక్కువ. దీనివల్ల భూగర్భజలాలు అడుగంటడమేగాక, ఉత్పత్తిలోనూ వ్యత్యాసం కనబడుతుందని డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. వరిలో నీటి వినియోగంపై ఆయన పలు సూచనలు చేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

సాధారణంగా నాటువేసిన దశ నుంచి చిరుపొట్ట దశ వరకు రెండు సెం.మీ నీరు మాత్రమే పొలంలో నిల్వ ఉంచాలి. కానీ.. చాలామంది రైతు సోదరులు దాదాపు ఐదు సెం.మీ వరకు పంట పక్వానికి వచ్చే వరకు విరివిగా వినియోగిం చడం వల్ల నీటివృధా మాత్రమేగాక, చీడపీడల ఉధృతి కూడా పెరుగుతుంది. ఈ సమస్యను అధిగమించడానికి అంతర్జాతీయ వరి పరిశోధనా స్థానం పిలిప్పైన్స్ వారు వరిలో సాగునీటి యాజమాన్యంలో తడపడం, ఆరబెట్టడం అనే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ విధానం తెలంగాణ రాష్ట్రంలో మొదటగా 150 ఎకరాలతో క్షేత్రస్థాయి ప్రయోగం చేపట్టారు. ఖమ్మం జిల్లాలో ఈ పద్ధతిని పరిశీలించేందుకు నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామంలో 15 మంది రైతుల పొలాల్లో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ పద్ధతిలో వరి పొలంలోని నీరు ఉపరితలం నుంచి 5 సెం.మీ లోతుకు పడిపోయిన తర్వాత నీటిని పెట్టడం, దాంతోపాటు ఒక ఎకరాకు 2 సెం.మీ నీరు పెట్టడానికి ఎంత సమయం పడుతుంది? ఎన్ని లీటర్లు అవసరమవుతుందో లెక్కిస్తాం. ఈ విధంగా.. పంటకాలం పూర్తయ్యే వరకు ఎంత నీటిని ఉపయోగించాం..? దిగుబడి ఎంత..? అనేది లెక్కించడం జరుగుతుంది.

తడపడం.. ఆరబెట్టడం

ఈ పద్ధతిలో వరి పొలంలోని నీటిమట్టాన్ని కేసింగ్ పైపునకు 30 సెం.మీ సగభాగం వరకు, ఐదు సెంటీమీటర్లకు ఒక రంధ్రాన్ని చుట్టూ చేసి, ఆ రంధ్రాలున్నంతవరకు పైపును భూమిలో పాతి పెడతారు. వరి పొలంలోని నీటిమట్టం తగ్గుతున్నప్పుడు కేసింగ్ పైపులోని నీటిమట్టం కూడా తగ్గుతుంది. ఈ పద్ధతిలో ఎన్ని రోజులకు నీరు పెడుతున్నామో, ఎంత సమయంలో పొలం తడుస్తుందో లెక్కించడం జరుగుతుంది. రైతులు పొలంలోని నీటిమట్టం 5సెం.మీ తగ్గినప్పుడు నీటిని పెడుతుంటారు. ఒక రకంగా దీన్ని తడపడం, ఆరబెట్టడం అంటారు. ఈ పద్ధతి ద్వారా నీటి వినియోగం సమర్థవంతంగా జరగడమేగాక, భూగర్భ జలాలు పడిపోకుండా కాపాడుకోవడం సాధ్యమవుతుంది.

ఓపెన్‌స్కూల్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువుపెంపు

జూలూరుపాడు: ఓపెన్‌టెన్త్, ఇంటర్ విద్యార్థులు తాత్కాల్ స్కీం కింద 26వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్ష ఫీజును చెల్లించేందుకు ప్రభుత్వం వెసులుబాటును కల్పించిందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్ జెట్టి రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాల్ కింద పదో తరగతి విద్యార్థులు రూ. 500 ఫీజుతోపాటు ఒక్కొక్క సబ్జెక్టుకు రూ. 100ల చొప్పున, ఇంటర్ విద్యార్థులు రూ. 1000లతోపాటు ఒక్కొక్క సబ్జెక్టుకు రూ. 150 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

అస్తవ్యస్తంగా పాలన

- జిల్లా అభివృద్ధి..ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- పేదల దరిచేరని సంక్షేమ పథకాలు
- ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్దే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి
- భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య

కొత్తగూడెం టౌన్: తెలంగాణలో పాలన అస్తవ్యస్తంగా.. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందని ద్రాక్షగా మారాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు, భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఆరోపించారు. కొత్తగూడెంలో సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సేవలు అనువుగా ఉండేందుకు ఇల్లెందు క్రాస్‌రోడ్డువద్దే అన్ని ప్రభుత్వకార్యాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధిని పోల్చుకుంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నరీతిన ఉందన్నారు. 171 జీవోను తీసుకురావడం సరికాదన్నారు. జిల్లాలో సాగునీటి వనరులు రైతులకు అందాలంటే.. రూ. 10వేల కోట్లను మంజూరు చేయాలన్నారు. దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకం, కిన్నెరసాని జలాలు, తాలిపేరు ప్రాజెక్టు, పులుసుబొంత ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి రైతాంగానికి సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి రానున్న రోజుల్లో దశలవారీ ఉద్యమాన్ని చేపట్టేందుకు కార్యచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. నిరుపేద గిరిజనుల పోడుభూముల విషయంలో అటవీ,రెవెన్యూ అధికారుల దౌర్జన్యాలను ఆపాలన్నారు. పోడు నిర్బంధాలను నిలిపివేసి గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని అయిలయ్య మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రూ.1500కోట్ల తునికాకు బకాయిలను తక్షణం చెల్లించాలని, కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణానికి బడ్జెట్ నిధులు కేటాయించి పనులు వేగవంతం చేయాలన్నారు. విమానాశ్రయ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు భూగర్భగనులు నెలకొల్పాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజె. రమేష్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అన్నవరపు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సున్నం రాజయ్య

సినిమాలు

కొత్తగూడెం

- దుర్గా: ఫిదా
- పూర్ణ: జయ జానకీ నాయక
- పరమేశ్వరి: లై
- విశ్వరూప: ఆనందోబ్రహ్మ
- మహేశ్వరి: నేనే రాజు.. నేనే మంత్రి

పాల్వంచ

- వెంకటేశ్వర జయ జానకీ నాయక
- వేణుగోపాల్ నేనే రాజు.. నేనే మంత్రి
- శాంతి లై

ప్రధాన ఆసుపత్రి

సూపరింటెండెంట్
డాక్టర్ జనార్దన్ 8008553195
బుధవారం డ్యూటీ డాక్టర్
మాలతీక్రిష్టిన

గ్యాస్ సమాచారం

కొత్తగూడెం ఇండియన్ గ్యాస్ గోడౌన్ నుంచి 22న గ్యాస్ బుక్ చేసుకున్న వారికి 29న సిలిండర్ అందజేస్తారు.
గ్యాస్ ఆన్‌లైన్ బుకింగ్
9848824365

రైతు బజార్ ధరలు

కిలోకి (రూ.ల్లో)			
టమోట	50	క్యాబేజీ	35
పచ్చిమిర్చి	30	ఉల్లిగడ్డలు (రైతుబజారు)	35
వంకాయ	40	గోరుచిక్కుళ్లు	30
బెండకాయ	30	చామగడ్డ	50
కాకరకాయ	30	అలుగడ్డ	20
బోడకాకర	120	క్యారెట్	70
బీరకాయ	25	తెల్లవంకాయ	40
దొండకాయ	20	తోటకూర	3
చిక్కుళ్లు	40	కొత్తిమీర	20
దోసకాయ	15	చుక్కకూర	3
సొరకాయ	15	బచ్చలకూర	3

పోలీస్ సమాచారం

- డీఎస్పీ 9440795310
- వన్‌టౌన్ సీఐ 9440795314
- టు టౌన్ సీఐ 9440904304
- త్రీ టౌన్ సీఐ 9440904305
- ఓఎస్‌డీ 9440795302

పర్యావరణ పరిరక్షణకు కళాప్రదర్శనలు

జూలూరుపాడు: అంతరించిపోతున్న పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు మట్టి గణపతులను పూజించాలని కోరుతూ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు అజయ్‌కుమార్ కళాజాత బృందం మంగళవారం జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో కళాప్రదర్శలిచ్చారు. ఈ సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేయడం వల్ల కలిగే నష్టాలు, ప్లాస్టిక్ వినియోగం వల్ల సంబంధించే అనార్థాలపై పాటలు, నాటికల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కృష్ణ, రాంబాబు, చలం తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో కళాకారుల ప్రదర్శన

ఒకటిని పెన్షన్ విద్రోహదినంగా పాటించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

జూలూరుపాడు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి కంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఒకటోతేదీ జరిగే పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నట్టు ఉపాధ్యాయసంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్రోహదినం పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒకటిన ఉపాధ్యాయ, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపడంతోపాటు జిల్లా కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్. వెంకటేశ్వర్లు, జి.నాగేశ్వరరావు, వై. వీరస్వామి, బాబులాల్, హనుమా, రవీంద్రబాబు, రాధ, యాదేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం మొక్కలకు రూ.12వేల రాయితీ: ఉద్యాన అధికారి

సుజాతనగర్: ఆయిల్‌పాం పంటకు ఎకరానికి మొక్కలపై ఎకరాకు రూ. 12వేల రాయితీ సౌకర్యం ఉందని మండల ఉద్యానవన అధికారి శాంతిప్రియ తెలిపారు. సుజాత నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఆయిల్‌పాం సాగు అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆయిల్‌ఫాం సాగులో వచ్చే లాభాలు రాయితీలు, సూక్ష్మ సేద్య నీటి పథకం గురించి రైతులకు వివరించారు. ఎరువులపై ఐదు వేల చొప్పున నాలుగేళ్లు రాయితీ ఉంటుందన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఎకరానికి మొక్కలు,ఎరువులకై రూ. 51, 670 రాయితీ సౌకర్యం మూడేళ్లు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ సర్పంచ్ వేములపల్లి సత్యనారాయణ, జైన్ కంపెనీ డీఎల్‌వో రమేష్, కె. ప్రసాద్, హెచ్‌ఇవో అర్టికల్చర్ విస్తారణ అధికారి ఫణికుమార్, కిషన్, కొండె కృష్ణ, సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


ఆయిల్‌పాం పంట అవగాహన సదస్సులో పాల్గొన్న శాంతిప్రియ, సర్పంచ్ తదితరులు

గూడెంలో బ్యాంకుల బంద్

- ఖాతాదారుల ఇబ్బందులు

కొత్తగూడెం టౌన్: ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడాలని, బ్యాంకుల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని మంగళవారం ఎస్‌బీఐ, ఆంధ్రాబ్యాంకు సిబ్బంది సమ్మెతో కొత్తగూడెంలో బ్యాంకులు మూతపడ్డాయి. బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ నాయకులు అన్నవరపు సత్యనారాయణ, అనిల్, జునుమాల నగేష్ తదితరుల సంఘీభావాన్ని తెలిపారు.

జూలూరుపాడు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో జూలూరుపాడులోని ఎస్‌బీఐ బ్యాంకు మూతపడింది. దీంతో ఖాతాదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. పెన్షన్ పొందేందుకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు బ్యాంకు వద్దకు వచ్చినప్పుడు మూసిఉంచడంతో అసంతృప్తితో వెనుతిరిగారు.



కొత్తగూడెంలో మూసివేసిన ఆంధ్రా బ్యాంకు

స్కూల్ బస్ ఢీ.. మహిళ పరిస్థితి విషమం

సుజాతనగర్: స్కూల్ బస్ ఢీ కొని మహిళకు గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. వేపలగడ నివాసి జయ కొత్తగూడెం నుంచి వేపలగడ్డకు వస్తూ ఆటో దిగి రోడ్డు దాటే క్రమంలో కొత్తగూడెం వెళుతున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సు (ఏపీ 20టీబీ 6700) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె ఎడమ చేయి విరిగి తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రురాలిని తొలుత ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేరళకు చెందిన జయ కొన్నేళ్లుగా వేపలగడ్డలో ఉంటోంది. భర్త రిటైర్డ్ ఉద్యోగని గ్రామస్థులు తెలిపారు. బస్సు డ్రైవర్ పరారీలో ఉండగా పోలీసు లు బస్‌ను ఆధీనంలోకి తీసుకున్నారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌లైన్ నిర్మాణం ఆపాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

జూలూరుపాడు: మండలంలోని పడమటి నర్సాపురంలో 33/11 కేవీ విద్యుత్ లైన్‌ను గృహాల సమీపంలో నుంచి ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆ విద్యుత్‌లైన్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు సత్యనారాయణ మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందచేశారు. ఆ లైన్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కాంట్రాక్టర్‌ను కోరినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేటినుంచి నిర్ణీత సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తగూడెం టౌన్: కొత్తగూడెం సౌత్ సెక్షన్ పరిధిలో 23నుంచి 26 వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలిపి వేస్తామని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మంగళవారం తెలిపారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హౌసింగ్ బోర్డు, చుంచుపల్లి తండా, విద్యానగర్ కాలనీ, ఎన్‌కే. నగర్ కాలనీ, రామవరం, రుద్రంపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి తమ శాఖతో సహకరించాలని ఆయన కోరారు.

మునిసిపల్ కమిషనర్‌గా భాస్కర్‌గౌడ్

పాల్వంచ టౌన్: పాల్వంచ మునిసిపాలిటికి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నా డీఈ భాస్కర్‌గౌడ్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి నుంచి మంగళవారం ఉత్తర్వులందాయి. ఇన్‌చార్జ్ పాలనలో కార్యాలయంలో అనేక పనులు నలిచిపోయాయి. భాస్కర్‌గౌడ్ నియామకం పట్ల కార్యాలయ సిబ్బంది, మునిసిపల్ కాంట్రాక్టర్లు, పలువురు అభినందనలు తెలిపారు.





యువకులకు కండువాలు కప్పుతున్న ఎడవల్లి కృష్ణ

కాంగ్రెస్‌లో యువకుల చేరిక

● ఆహ్వానించిన ఎడవల్లి

పాల్వంచ: జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో పలువురు యువకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. కొత్తగూడెం-శ్రీనగర్ కాలనీకి చెందిన యువకులు ఎడవెల్లి ఇంటికి పెద్దఎత్తున తరలివచ్చారు. వారందరికీ కడువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎడవల్లి మాట్లాడారు. మారుతున్న రాజకీయాలను యువత ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవతన్, యువకులు జయవర్ధన్, మధు, ఆర్ సురేష్, మురళీకృష్ణ, శివ, సంతోష్, కుమారస్వామి, విక్కీ, ప్రశాంత్, శరత్, ప్రణీత్, అనిల్, సన్నీ, కుమర్ పాల్గొన్నారు.

'ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలి'

కొత్తగూడెం టౌన్: ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, తక్షణమే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కొత్తగూడెం ఆర్టీసి డిపో ఎదుట టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఒకరోజు సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. దీక్షకు మద్దతు తెలిపిన కూనంనేని మాట్లాడారు. 2017ఏప్రిల్ నుంచి రావాల్సిన పేస్కేల్ వెంటనే అమలు చేయాలన్నారు. అద్దె బస్సులను రద్దుచేసి ఆర్టీసీ బస్సులను పెంచాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. మెకానిక్‌లకు ఆధునిక శిక్షణ ఇవ్వాలన్నారు. కార్మికులకు నాలుగు సంవత్సరాల యూనిఫాంను వెంటనే సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే.భాస్కర్‌రావు, డిపో సెక్రటరీ కేఎన్‌బి. రావు, ఆర్ఎన్. సింగ్, కే. హరివర్మ, కే. శ్రీనివాస్, సైమన్, కేఎస్.కుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం: జేసీ

పాల్వంచ టౌన్: గణపతి నవరాత్రోత్సవ పూజల్లో మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పూజిద్దామని జేసీ రాంకిషన్ అన్నారు. గ్రీన్ ఎర్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కరపత్రాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు.అనంతరం మాట్లాడారు. సామాజిక బాధ్యతగా ప్రతిమల పంపిణీని చేపట్టడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సొసైటీ గత ఐదేళ్లుగా ప్రతిమలతో పాటు మొక్కల పంపిణీ కూడా చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి ఆరెట్ల లక్ష్మణ్, సభ్యులు కిరణ్, ఉపాధ్యాయులు టి. మోహన్‌బాబు, టి.వెంకట్, ఎం. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలని, ఉత్సవ కమిటీలు పోలీసుశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని జూలూరుపాడు సీఐ సంపత్‌కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం జూలూరుపాడులోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుడు గణేష్ ఉత్సవ కమిటీసభ్యులతో సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మైకుల ఏర్పాటుకు డీఎస్పీ నుంచి అనుమతి తీసుకోవాలని, డీజే సౌండ్ వాడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మండపాల వద్ద రాత్రి సమయాల్లో కమిటీసభ్యులు పడుకోవాలని, నిమజ్జనం ఎప్పుడు చేస్తారో కూడ తెలియ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఇల్లా రాజేష్, ఎఎస్ఐ రామారావు, హెడ్‌కానిస్టేబుల్ శ్యాం, ఎంపీపీ చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యుడు సాయిల నాగేశ్వరరావు, సురేష్, సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు.

కొత్తగూడెం క్రైం: వినాయక చవితిని నవరాత్రి ఉత్సవాలను శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జరుపుకోవాలని త్రీ టౌన్ సిఐ షకూర్ సూచించారు. మంగళవారం స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవకమిటీ నిర్వాహకుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉత్సవకమిటీలు అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద సభ్యులు తప్పనిసరిగా ఉండాలన్నారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుని నిమజ్జనానికి వెళ్లే వరకు కట్టుదిట్టమైన స్వయం క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.ఈ అవగాహన సదస్సుల్లో బిజెపి పట్టణ అధ్యక్షులు, గణేష్ ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు ఎర్రా కామేష్, కోశాధికారి కూరపాటి రవీందర్, సభ్యులు ఆకిరెడ్డి మహేష్, కంచర్ల శ్రీనివాస్, వంగా రవి, గాజా సందీప్, సాయి, బొంతు సత్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జేసీ రాంకిషన్



కొత్తగూడెంలో పాల్గొన్న ఉత్సవ కమిటీల సభ్యులు



జూలూరుపాడులో మాట్లాడుతున్న సీఐ సంపత్

హరితహారం పూర్తి చేయకపోతే చర్యలు: ఏపీవో జమీర్‌పాషా

జూలూరుపాడు: హరితహారం మూడోవిడత కార్యక్రమం కింద గ్రామాల్లో, రైతుల పొలాల్లో మొక్కలునాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని లేనిపక్షంలో సిబ్బందిపై చర్యలు తప్పవని ఈజీఎస్ ఏపీవో ఎస్‌కె. జమీర్‌పాషా హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈజీఎస్ ఆధ్వర్యంలో రెండు లక్షల టేకు మొక్కలను నాటించాల్సి ఉండగా ఇప్పటి వరకు 73వేల టేకుమొక్కలను మాత్రమే నాటారన్నారు. రైతుల పొలాల్లో త్వరితగతిన మొక్కలను నాటించాలని కోరారు. ఈ నెలాఖరునాటికి కొమ్ముగూడెం, మాచినేనిపేటతండాలో 100శాతం మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేసి కలెక్టర్ ఆదేశాల మేరకు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంకా కొమ్ముగూడెంలో 48 నిర్మాణాలు, మాచినేనిపేటలో 46 నిర్మాణాలను పూర్తి చేయాల్సిఉందన్నారు. ఈ సమావేశంలో సెర్ప్ మండల ఏపీఎం సత్యనారాయణ రాజు, ఎక్సైజ్ ఎస్ఐ భాషా, ఈజీఎస్ ఈసీ బాజీబాబా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- పాత పాల్వంచలోని అంగన్‌వాడీ విద్యార్థులకు మంగళవారం ఏకరూప దుస్తులు అందజేశారు. వాసవిక్లబ్, వనితక్లబ్ ఆధ్వర్యంలో 50మంది విద్యార్థులకు దుస్తులనుపంపిణీ చేశారు. కార్యక్రమంలో చలువాది ప్రకాష్, పెండ్యాల రోజాలక్ష్మి, మంజుల, నర్సింహారావు, బి. హరీష్,ఎస్. స్వామి, వి. ఇందిర, నాగేశ్వరరావు, పద్మ, నాగేశ్వరి పాల్గొన్నారు.
- పాల్వంచ వర్తక సంఘ భవనంలో ఐదో తేదీన నిర్వహించే మెగాహెల్త్‌క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ముందుగా ఈ నెల 27వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకుని కార్డు పొందాలన్నారు. వైద్య పరీక్షలకు వచ్చే వారు ఎటువంటి ఆహారం తీసుకోకుండ పరిగడపున రావాలని కోరారు. వివరాలకు 9849198712ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో పాకాలపాటి రోశయ్య చౌదరి, ఆరుద్ర సత్యనారాయణ, రంజాన్, పాండురంగాచారి పాల్గొన్నారు.
- ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డాక్టర్ మద్దికాయల విజయ్‌కుమార్ సోదరుడు సుధాకర్‌ను భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని అయిలయ్యలు కొత్తగూడెంలో మంగళవారం పరామర్శించారు. డాక్టర్ ఝాన్సీరాణి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.
- జూలూరుపాడు పంచాయతీ పరిధిలోని దళితవాడలో మంగళవారం స్థానిక బెలివర్ చర్చీ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఫాస్టర్ కలిసి మురికి కాల్వలో కిరోసిన్, బ్లీచింగ్‌ను చల్లారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్ ఎలీషా, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అధైర్యపడకండి..అండగా మేముంటాం

● జీడీఎస్ సమ్మె శిబిరాన్ని సందర్శించిన సీపీఐ, సీపీఎం నేతలు

కొత్తగూడెం టౌన్: తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె బాట పట్టిన గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) సిబ్బందికి అండగా ఉంటామని... అధైర్యపడవద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, సున్నం రాజయ్య, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు హామీనిచ్చారు. కొత్తగూడెం పోస్టాఫీస్ ఎదుట మంగళవారం జీడీఎస్ నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని వారు సందర్శించి మాట్లాడారు. బ్యాంక్, పోస్టల్ ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి విధులు నిర్వహించినప్పటికీ ఉద్యోగులకు పని భద్రత కరువైందన్నారు. జడీఎస్ కమిటీ రిపోర్టును అమలు చేయాలని, జీడీఎస్‌లకు ఎనిమిది గంటల పని విధానం అమలు చేయడంతోపాటు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, క్యాట్ బెంచ్ తీర్పు మేరకు పెన్షన్ అమలు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బడా పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదార్లకు కోట్లాది రూపాయల ఋణాలిచ్చి వాటిని వసూలు చేయకపోవడం వల్లే బ్యాంకులు దివాళా తీస్తున్నాయోగానీ ఉద్యోగులు, ఖాతాదార్ల వల్ల కాదన్నారు. బ్యాంకుల్లో సంస్కరణలు చేపట్టి ఉద్యోగులకు, ఖాతాదార్లకు ఇబ్బందులకు గురిచేసే చర్యలను ఉద్యమాలతోనే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని ఐలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీపీఎం నాయకులు అన్నవరపు సత్యనారాయణ, తాటిపర్తి అనిల్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎండీ. జలాల్, సీపీఐ నాయకులు గుత్తుల సత్యనారాయణ, కంచర్ల జమలయ్య, వై. శ్రీనివాసరెడ్డి, సలిగంటి శ్రీనివాస్, మారపాక రమేష్, పిట్టల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు





శిబిరంలో మాట్లాడుతున్న సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు, సీపీఎం నేత, ఎమ్మెల్యే సున్నం రాజయ్య

మునిసిపాలిటీ 'పారిశుధ్య విభాగం' సమాచారం

1. కమిషనర్ రవిబాబు(ఫిర్యాదుల కోసం) 9849905883
2. మేనేజర్ నూరల్‌నజీబ్ (ఫిర్యాదు కోసం) 7702007775
3. రవీందర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ 9666104016
4. శ్రీనివాస్ (1 నుంచి 12 వార్డులు) 9849667031
5. అంజాద్ (13 నుంచి 24 వార్డులు) 9290769614

ఇల్లెందు సినిమాలు

కళాంజలి - లై
లలిత్ కళామందిర్ - జయ జానకి నాయక
శ్రీ సీతారామ - నేనే రాజు నేనే మంత్రి

శిలాఫలకంతోనే సరి..!

● ప్రారంభం కాని ఎంపీ ల్యాడ్స్ పనులు ● అధ్వానంగా రహదారి, డ్రైనేజీ
● ఎడాదైనా పట్టించుకోని వైనం ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఇల్లెందుటౌన్: మెరుగైన రహదారుల నిర్మాణానికి కేటాయించిన ఎంపీ ల్యాడ్స్ (లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీం) నిధులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. రహదారులు, డ్రైనేజీల నిర్మాణం కోసం కేటాయించిన నిధులు కేవలం కాగితాల ప్రతిపాదనలకే పరిమితమయ్యాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లెందు మునిసిపాలిటీ పరిధిలోని 8, 17వ వార్డులకు గత ఏడాది మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ నిధులతో రూ. 10 లక్షల వ్యయంతో రహదారుల నిర్మాణం కోసం శంకుస్థాపనలు నిర్వహించారు. గత సంవత్సరం ఎంపీ పుట్టినరోజు సందర్భంగా నిర్మాణాలకు భూమి పూజలు నిర్వహించి శిలాఫలకాలు ఆవిష్కరించి సంవత్సరం గడిచి పోయింది. అయితే రోడ్ల నిర్మాణాలు మాత్రం ఇప్పటివరకు చేపట్టలేకపోయారు.

ఏడాది పూర్తయినా...

17వ వార్డులో లలిత్‌కళామందిర్ వద్ద రూ. ఐదు లక్షల వ్యయంతో రహదారి, డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు స్వయంగా ఎంపీ సీతారాంనాయక్ గత ఏడాది ఆగస్టు 20న శంకుస్థాపన నిర్వహించారు. ఇప్పటి వరకు నిధుల కేటాయింపుగాని, రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టలేదు. హంగు ఆర్భాటాలతో, మంది మార్బలంతో హడావుడిగా శంకుస్థాపనలు చేసి పనులు చేపట్టక పోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8, 17వ వార్డులు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ. 10 లక్షలు కేటాయించినట్లు శంకుస్థాపన సందర్భంగా ఎంపీగారే స్వయంగా ప్రకటించారు. పుట్టినరోజు కానుకంటూ మోసం చేశారని వార్డు ప్రజలు విమర్శిస్తున్నారు. మునిసిపాలిటీ అయినా రోడ్డును చేపట్టలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా ఎంపీ సీతారాం నాయక్ స్పందించి తక్షణమే నిర్మాణ పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థలో డ్రైనేజీ


అధ్వానంగా రహదారి


శిలాఫలకం

హామీలను నెరవేర్చాలి



ముద్రగడ వంశీ
టీడీపీ ఇల్లెందు పట్టణకార్యదర్శి

ఎంపీ ల్యాడ్స్ నిధులు కేటాయించి శంకుస్థాపనలు చేసి సంవత్సరం గడిచింది. ఎంపీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఇప్పటివరకు పనులు చేపట్టకపోవడం దారుణం. వెంటనే స్పందించాలి.

రోడ్డుపై నడవలేకపోతున్నాం



యాకూబీబీ
17వవార్డు మహిళ

నడవలేకపోతున్నాం. మునిసిపాలిటీ అయిన మా రహదారిని నిర్మించాలి. డ్రైనేజీ కూడా శిథిలావస్థలో ఉండటంతో మురుగు నీరంతా రహదారిపైనే ప్రవహిస్తుంది.

అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి

● డీఎస్పీ ప్రకాశ్‌రావు ● గణేష్ మండపాల నిర్వాహకులతో సమీక్ష


మాట్లాడుతున్న ప్రకాశరావు

ఇల్లెందుటౌన్: గణేశ్ నవరాత్రుల నిర్వాహకు పోలీస్, విదుత్‌శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఇల్లెందు డీఎస్పీ ప్రకాశ్‌రావు తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో నవరాత్రుల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్ పర్మిషన్ ఉండాలన్నారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. ఊరేగింపుల్లో డీజేలు వినియోగించరాదన్నారు. సమావేశంలో ఇల్లెందు సీఐ డి వేణుచందర్, ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

'జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి'


మాట్లాడుతున్న సాములు నాయక్

టేకులపల్లి: జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేస్తానని ఆ పార్టీ ఎస్టీసెల్ జిల్లా చైర్మన్ బానోతు సాములు నాయక్ అన్నారు. మంగళవారం టేకులపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఐత సత్యం, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్‌లకు ఆయన కృతజ్ఞతల తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంటు, జిల్లాలోని మూడు ఎస్టీ నియోజకవర్గాల్లో పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రజలు కాంగ్రెస్ పక్షానే ఉన్నారన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు భూక్యా దళ్‌సింగ్ నాయక్, గంగారం సర్పంచ్ వీసం శ్రీనివాసరావు, టేకులపల్లి మాజీ సర్పంచ్ ఇస్లావత రెడ్యా నాయక్, ముత్యాలంపాడు ఎంపీటీసీ సభ్యురాలు సత్యవతి, సొసైటీ డైరెక్టర్ బుర్ర శంకర్‌గౌడ్, జిల్లా మహిళా కార్యదర్శి బండ్ల రజనీ, మండల మహిళా అధ్యక్షురాలు ఆకారపు స్వప్న, యూత్ కాంగ్రెస్ నాయకులు దంతోజు నవీన్ కుమార్, రవికాంత్, ఇస్లావతు సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడు చక్రపాణి కన్నుమూత

ఇల్లెందుటౌన్: ఇల్లెందు పట్టణంలోని సివిల్‌లైన్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు చక్రపాణి(80) మంగళవారం మృతిచెందారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం ఆయన స్వగృహంలోనే మృతిచెందారు. గత సంవత్సరమే రిటైర్డు ఉపాధ్యాయురాలైన ఆయన సతీమణి మృతిచెందారు. పట్టణంలో అనేక సంవత్సరాలుగా వైద్యసేవలు అందిస్తూ, పేదల డాక్టర్‌గా అందరి మన్ననలు పొందారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

పీహెచ్‌సీ స్థాయిని పెంచాలి

● మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం


మాట్లాడుతున్న లక్ష్మి

టేకులపల్లి: మండలంలోని సులానగర్ పీహెచ్‌సీని 50పడకల ఆస్పత్రిగా మార్చాలని, బోడు, లచ్చగూడెం, బేతంపూడి గ్రామాల్లో పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాలని కోరుతూ టేకులపల్లి మండల సభ్యులు తీర్మానం చేశారు. మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ అధ్యక్షురాలు భూక్యా లక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేవిధంగా అధికారులు కృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ట్రైకార్ రుణాలను వెలుగు ద్వారా ఇప్పించాలని, 2015-16 సంవత్సరానికి గాను మంజూరైన బీసీ కార్పొరేషన్ రుణాలను లబ్ధిదారులకు అందించాలని, మిషన్ భగీరథ పథకంలో గ్రామాల్లో పాత పైపులైన్లు తొలగించి నూతన పైపులైన్లు వేయాలని తీర్మానం చేశారు.

భగీరథ పనులు అడ్డుకుంటాం

మిషన్ భగీరథ పైపులైన్ల పనుల నిర్వహణ వల్ల పంచాయితీల్లో ధ్వంసమైన రోడ్లు, సైడుకాల్వలను మిషన్ భగీరథ కాంట్రాక్టర్ పునఃనిర్మించాలని, లేనట్లయితే ఆ పనులను అడ్డుకొంటామని గొల్లపల్లి (బొమ్మనపల్లి) సర్పంచ్ బానోతు సాములు నాయక్ హెచ్చరించారు. విద్య, వైద్యం, పశువైద్యం, శిశు సంక్షేమం, వ్యవసాయం, తాగునీరు తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు లక్కినేని సురేందర్‌రావు, ఎంపీడీవో సీడీపీవో జయసుగుణ కుమారి, ఎంఈవో రాంసింగ్, ఏవో రమేష్, వైద్యాధికారి శ్రీనునాయక్, పశువైద్యాధికారి సంతోష్, ఈవోఆర్డీ రమాదేవి, గ్రామపంచాయితీ కార్యదర్శులు, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొడ్ల నిర్మాణం పూర్తిచేయాలి

● కౌన్సిలర్ సుదర్శన్‌కోరి

ఇల్లెందుటౌన్: ఇల్లెందు పట్టణంలోని 15వ వార్డులో మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని కౌన్సిలర్ సుదర్శన్ కోరి పిలుపునిచ్చారు. మంగళవారం వార్డులో ఓడీఎఫ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మరుగుదొడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని వెల్లడించారు. ఇంకా అసంపూర్తిగా మిగిలివున్న మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. దీనిపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ అనిల్, ఓడీఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కౌన్సిలర్ కోరి

హమాలీలకు బోర్డు ఏర్పాటు చేయాలి

● ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి రాసుద్దీన్


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లెందుటౌన్: రాష్ట్రంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు, సమగ్ర చట్టం ఏర్పాటు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి ఎండీ రాసుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా హమాలీలు వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వాహణలో ప్రమాదాల బారిన పడినప్పుడు ఎటువంటి ఆర్థిక సహాయం అందడంలేదన్నారు. హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి హక్కులు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పీ. లింగయ్య, వీ. రాంసింగ్, ఎల్. రవి, రామ్మూర్తి, మంగయ్య, వెంకన్న, సత్యం, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

'సామూహిక సెలవు'కు సంపూర్ణ మద్దతు: ఏటీఎఫ్

ఇల్లెందురూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు ఒకటిన ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహిస్తున్న సామూహిక సెలవుకు ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షులు కుర్సం అంజయ్య తెలిపారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులంతా సామూహిక సెలవుల్లో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో చావల రమేష్‌బాబు, పూనెం బాలరాజు, మోహన్‌రావు, పాయం రమేష్, రాంబాబు, శిరీష, రామకృష్ణ, కృష్ణార్జున్‌రావు, రవికుమార్, ఈశ్వర్ పాల్గొన్నారు.